
# సింహాచలం దేవళం
# కట్టుబడి కథాగేయం



సేకరణ - పరిశీలన


డా. యం. జయదేవ్
ఎం.ఏ., పిహెచ్.డి
రీడర్, తెలుగు శాఖాధ్యక్షులు
ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం

# సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం

తిరుమల తిరుపతి దేవస్థానం వారు మత సంబంధిత
పుస్తకాలకు ఇచ్చే ఆర్థిక సాయంతో
ఈ గ్రంథం ముద్రింపబడింది

సేకరణ–పరిశీలన

డా. యం. జయదేవ్
ఎం.ఏ., పిహెచ్.డి.

రీడర్, తెలుగు శాఖాధ్యక్షులు
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

---

రమణవాణి ప్రచురణ, విశాఖపట్నం

మొదటి ముద్రణ : జనవరి, 1999

ప్రతులు : 1000

వెల : రూ 40 /-


ప్రతులకు

**శ్రీమతి ఎం. పద్మావతి**

6/1. సిరిపురం క్వార్టర్స్,
ఆంధ్రవిశ్వవిద్యాలయం
విశాఖపట్నం - 530 003

*Printed at*
**SPAA Offset Colour Prints**
Station Road, Dondaparthi
Visakhapatnam - 530 016
Phone 547600


# అంకితం




విశిష్ట స్నేహామృత మూర్తి, నిగర్వి
నిష్కల్మష హృదయులు, సహృదయులు అయిన
**శ్రీ టి. మనోహర్** (**మాజీరాజ్యసభ సభ్యులు**) గారికి
గౌరవాభిమానాలతో

సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయాన్ని నాకు పాడి

వినిపించిన వారు



ఈపు నరసింగరావు (పీతల వానిపాలెం)



మువ్వల అప్పారావు (మువ్వలవాని పాలెం)

# మనవి

నాకు చిన్నప్పటినుండి జానపద గేయాలన్నా, కథాగేయాలన్నా చాల ఇష్టం. మా స్వంత ఊరు కర్నూలు జిల్లా కొవెలకుంట్ల తాలూకాలోని చాకరాజు వేముల అనే చిన్న గ్రామం. చిన్నప్పటినుండి పనిపాటలు చేయడం నాకు అలవాటు పొలాల్లో పనిచేసే స్త్రీ, పురుషులు రకరకాల జానపద గేయాలను పాడుతూ ఉంటే ఆసక్తిగా వినేవాణ్ణి. మా యింటి ఎదురుగా 'బసమ్మ' దేవళం అనే గుడి ఉంది. అది సంచార జీవనం చేసే జానపద గాయక భిక్షుకులకు, సాధులు, సన్యాసులకు సత్రంగా ఉండేది. సాధులు, సన్యాసులు రాత్రిపూట తత్వాలు పాడుతూ ఉండేవారు. ఈ గేయాల్లోని బాణీ ఎంతో వినసొంపుగా ఉండేది. జానపద గాయక భిక్షుకులు రాత్రిపూట అల్లీరాణి కథ, ఆరె మరాఠీల కథ, సర్వాయి పాపడు కథ, బాలనాగమ్మ కథ, పల్నాటి కథ మొదలైన కథాగేయాలను వారాల తరబడి చెబుతూ ఉండేవారు. నేను తప్పకుండా ఆ కథలను వినేవాణ్ణి. మా యింటికి సుద్దుల గొల్లలు (గొల్లసుద్దులవారు) వచ్చి కాటమరాజు కథలను పాడేవారు. వాటిని గూడా నేను తప్పనిసరిగా వినేవాణ్ణి. రాయలసీమ ప్రాంతం బస్సులు, బస్టాండ్లలో కుంటి, గుడ్డి భిక్షగాండ్రు బుడ్డా వెంగళరెడ్డి పాట, మానందిరెడ్డి పాట మొదలైన చిన్న కథాగేయాలను పాడుతుంటె ఎంతో ఆసక్తిగా వినేవాడిని. ఈ విధంగా చిన్నప్పటినుండి జానపద కవిత్వం మీద నాకు ఆసక్తి పెరుగుతూ వచ్చింది.

ఈ ఆసక్తితోనే నేను ఎం.ఏలో ఐచ్ఛిక విషయంగా జానపద సాహిత్యం తీసుకున్నాను. పరిశోధన జానపద సాహిత్యంమీద చేయాలని ఎంతగానో ఆరాటపడ్డాను. నా పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు గూడా విషయాన్ని ఎంపిక చేసుకోవడంలో నాకు స్వేచ్ఛనిచ్చారు. అయితే ఫెలోషిప్ ఏదీ లేకపోవడం చేత, స్వంతంగా ఫీల్డ్‌వర్క్‌కు వెళ్లి జానపద సాహిత్యాన్ని సేకరించే ఆర్థిక స్తోమత లేకపోవడం చేత, నిర్దాక్షిణ్యంగా నాకున్న జానపద సాహిత్య మమకారాన్ని చంపి, దుర్భాక రాజశేఖర శతావధాని చారిత్రక కావ్యాలమీద పరిశోధన చేశాను. పరిశోధన పూర్తికాగానే గుడివాడ ఏ.ఎన్.ఆర్. కళాశాలలో అధ్యాపకునిగా చేరాను. ఇక్కడ అధ్యాపకునిగా ఉన్న ఆరేళ్లు నా ఉద్యోగానికి వచ్చిన అనేక ఇబ్బందులను ఎదుర్కొవడంతోనే సరిపోయింది. ఆ సమయంలో నేను ఎలాంటి పరిశోధన చేయలేకపోయాను.

ఆ తర్వాత 1990లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో రీడరుగా చేరాను. నాకు ఈ అవకాశం కల్పించినవారు ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, సామాజిక న్యాయంకోసం, తాము నమ్మిన సిద్ధాంతాలకోసం ఎంతటి కష్టాన్నైనా ఎదిరించగల మేరునగధీరులు, అప్పటి ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ అయిన ఆచార్య కె.వి. రమణగారు. ఆచార్య కె.వి. రమణగారికి నేను ఎంతో ఋణపడి ఉన్నాను. వారికి నా వేనవేల ధన్యవాదాలు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేరిన తర్వాత జానపద సాహిత్యంమీద బోధనకు, పరిశోధనకు నాకు అవకాశం లభించింది. జానపద సాహిత్యంమీద పత్రికల్లో కొన్ని వ్యాసాలు ప్రకటించాను. ఎన్నో కథాగేయాలను సేకరించాను. సేకరించినవాటిలో కొంత భాగాన్ని మాత్రమే ''సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం'' అనే ఈ పుస్తక రూపంలో ప్రచురిస్తున్నాను. జానపద సాహిత్యాభిమానులు సహృదయులు దీన్ని ఆదరిస్తారని ఆశిస్తూ

భవదీయుడు

(ఎం. జయదేవ్)

# విషయ సూచిక


1. కథాగేయాలు 1

2. దశావతార కథాగేయాలు 9

3. సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం – ఇతివృత్తం 16

4. సింహాచలం దేవళం కట్టుబడి కథా గేయం – విశేషాలు 34

5. సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం 44

6. సింహాచల క్షేత్రం – శిష్ట సాహిత్యం 67

# కథాగేయాలు

జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం, జానపదుల భాష, జానపదుల వస్తు సంస్కృతి, జానపదుల సాంఘిక ఆచారాలు అనే నాలుగు విభాగాలున్నాయి. వీటిలో జానపద సాహిత్యం ప్రధానమైంది. జానపద సాహిత్యంలో కవిత్వం, వచనం, దృశ్యం అనే మూడు శాఖలున్నాయి. వీటిలో మొదటిదైన కవిత్వంలో కథారహితం కథాసహితం అనే రెండు అంతశ్శాఖలున్నాయి. కథారహిత కవిత్వానికి జానపద గేయం (Folk Song) శుద్ధగీతం (Pure Song) అనే పేర్లు ఉన్నాయి. కథాసహిత కవిత్వాన్ని కథాగేయం(Narrative Song) అంటారు. కథాగేయమంటే కథ కలిగిన గేయమని అర్థం దీన్నే కొందరు గేయ కథ అని, మరికొందరు వీరగాథ అని అన్నారు. గేయ కథ అంటె గేయ రూపంలో ఉన్న కథ అని అర్థం. జానపద కవిత్వంలో మొదటిదైన కథారహిత కవిత్వం నుండి రెండవదైన కథాసహిత కవిత్వాన్ని వేరు చేసేది కథ. కథ లేకపోతే అది జానపద గేయమౌతుంది. కాబట్టి ఇక్కడ ముఖ్యమైనది కథ. పేరులో ఈ కథ అనే పదం మొదట ఉంటే ఆపేరుకు మరింత సార్థకత ఉంటుంది. కాబట్టి కథాసహిత కవిత్వానికి గేయకథ అనే పేరు కంటె కథాగేయం అన్నపేరే అన్నివిధాలా తగినదని చెప్పవచ్చు.

కథాసహిత కవిత్వాన్ని ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావుగారు 'వీరగాథ' అని పిలిచారు. ఇంగ్లీషులో Ballad అనే పదానికి తెలుగులో సమానార్థంగా 'వీరగాథ' అనే పదాన్ని తంగిరాలవారు ఉపయోగించారు.

ఇంగ్లీషులో G H Gerould, Francis B Gummere మొదలైన జానపద విజ్ఞానవేత్తలు Narrative Song ను Ballad అని అన్నారు. అదేవిధంగా తంగిరాలవారు గూడా కథాసహిత కవిత్వాన్ని వీరగాథ అని అన్నారు. అయితే వీరగాథ అనే పదం వీరరస ప్రధానమైన కథాగేయాలకు మాత్రమే వర్తిస్తుంది. కథాగేయాల్లో వీరరస ప్రధానమైనవే గాకుండా కరుణ, అద్భుత రస ప్రధానమైనవి గూడా ఉన్నాయి. వీటికి వీరగాథ అనే పేరు వర్తించదు. ఇంగ్లీషులో గూడా వీరరస ప్రధానమైన కథాగేయాలను Heroic Ballads అని అంటారు. కాబట్టి కథాసహిత కవిత్వాన్ని వీరగాథలు అని పిలవడం కంటె కథాగేయాలు అని పిలవడమే సమంజసం.

**కథాగేయ నిర్వచనం :** G H Gerould, Ballad ను ఇలా నిర్వచించాడు "Ballad is a Folk Song that tells a story. a ballad is always a Narrative is always sung to a rounded melody, and is always learned from the lips of others rather than by reading."[1]

Francis B. Gummere Ballad ను popular ballad, Traditional ballad అని రెండు భాగాలుగా చేసి నిజమైన జానపద కవిత్వమైన Popular ballad ను ఇలా నిర్వచించాడు

1 The Ballad of Tradition, P 3

"Popular Ballad is a poem meant for singing, quite impersonal in manner, narrative in material, probably connected in its origins with the communal dance, but submitted to a process of oral tradition among people who are free from literary influences and fairy homogeneous in character "[2]

ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావుగారు ''జానపద గేయ రూపమునుండి వీరరస ప్రధానమైన కథను చెప్పుచు, సంచార గాయక బిక్షుకుల (Minstrels) చే పాడబడు సరళ కథాగేయమే వీరగాథ''[3] అని వీరగాథను నిర్వచించారు. ఈ నిర్వచనం వీరరస ప్రధానమైన కథాగేయాలకు మాత్రమే వర్తిస్తుంది. అంతేగాకుండా వీరగాథలన్నీ సంచారగాయక బిక్షుకులచేత పాడబడవు. కొన్ని వీరగాథలను ఇతరులు గూడా పాడతారు. ఉదాహరణకు విశాఖపట్నం జిల్లాలో పాడబడే దశావతార కథాగేయాలు వీరరస ప్రధానమైనవే. వీటిని 'నేవగరిడి' అనే జానపద కళాప్రదర్శన సందర్భంలో యాదవులు పాడుతారు. వీటిని పాడే యాదవులు సంచార గాయక బిక్షుకులు కారు. అందువల్ల తంగిరాలవారి నిర్వచనం కథాగేయాలకు మాత్రమేగాదు కొన్ని వీరగాథలకు గూడా వర్తించదు.

కథాగేయాన్ని ఇలా నిర్వచింపచ్చు. ''కథను కలిగి, గేయ రూపంలో ఉండి, సరళ శైలిలో భిన్న పాఠాంతరాలతో, మౌఖిక సంప్రదాయంలో తరతరాలుగా అందింప బడుతున్న కథాసహిత కవిత్వాన్ని కథాగేయం'' అని పిలువవచ్చు.

**కథాగేయ లక్షణాలు** : కథాగేయ నిర్వచనంలోనే దానియొక్క ప్రధాన లక్షణాలన్నీ ఇమిడి ఉన్నాయి. 1. కథాగేయం కథను కలిగి ఉండాలి 2. కథాగేయం గేయరూపంలో పాడటానికి అనువుగా లయబద్ధంగా ఉండాలి. 4. కథాగేయం భిన్న పాఠాంతరాలను కలిగి ఉండాలి. 5. కథాగేయం మౌఖిక సంప్రదాయంలో జీవిస్తూ తరతరాలవారికి అందింపబడుతూ ఉండాలి. 6. కథాగేయం వారానువార్తనం (Ballad Common Places) ను కలిగి ఉండాలి. వీటితోపాటు బిరుదురాజు రామరాజుగారు జానపద గేయపరంగా[4] చెప్పిన 1. అజ్ఞాత కర్తృత్వం, 2. రచనాకాలం తెలియక పోవడం, 3. నియమిత స్వరూపం లేకపోవడం, 4. ఆశు రచనం, 5 పునరావృత్తి అనే అయిదు లక్షణాలను గూడా కథాగేయ లక్షణాలుగా చెప్పవచ్చు.

**కథాగేయాల వర్గీకరణ** : తెలుగు జానపద సాహిత్యంలో కథాగేయాలు గంటలోపు కాలంలో పాడబడే చిన్నవాడినుండి మొదలుకొని నెలల తరబడి పాడడానికి వీలైనంత పెద్దవి వరకు ఉన్నాయి. కాబట్టి కథాగేయాలను వాటి నిడివిని బట్టి 1. చిన్న కథాగేయాలు, 2. పెద్ద కథాగేయాలు, 3 కథాగేయ చక్రాలు అని మూడు విధాలుగా విభజింపవచ్చు.

---

2 The Popular Ballad, P 2

3. కాటమరాజుకథలు, మొదటిభాగం, డా తంగిరాల వేంకట సుబ్బారావు, పుట X

4 తెలుగు జానపదగేయ సాహిత్యం, బి రామరాజు, పుటలు 22 - 29

**చిన్నకథాగేయాలు** : వీటిలో కథ చాల చిన్నదిగా ఉంటుంది ఇవి గంటలోపు కాలంలో పాడబడతాయి. వీటిలో పౌరాణిక సంబంధమైన వాటిని స్త్రీలు పాడుతూ ఉంటారు మిగిలినవాటిని జానపదులు పని పాటల సందర్భంలో, గాయక భిక్షుకులు పగటిపూట భిక్షమెత్తుకునేప్పుడు పాడుతూ ఉంటారు. ఈచిన్న కథాగేయాల పేర్ల చివర సాధారణంగా పాట లేక పదం అనే మాటలు వస్తూ ఉంటాయి ఉదాహరణకు సాయిబు నాయుడు పాట, గంగరాజు పాట, మాలవారి మంగమ్మ పాట మొదలైనవి.

చిన్న కథాగేయాలను ఇతివృత్తాన్ని బట్టి పౌరాణికాలు, మత సంబంధాలు, జానపదాలు, చారిత్రకాలు, సాంఘికాలు అనే అయిదు శాఖలుగా విభజించవచ్చు

**పౌరాణికాలు** . పౌరాణిక చిన్న కథాగేయాల్లో ఇతివృత్తాన్ని బట్టి రామాయణ సంబంధాలు, భారత సంబంధాలు, భాగవత సంబంధాలు, ఇతరాలు అనే నాలుగు అంతశ్శాఖలను గుర్తింపవచ్చు. కంసల్యబైకలు, శ్రీరాముల ఉగ్గుపాట, మాయలేడి పాట, గరుట పచ్చిపాట, సీతమ్మ చెర, ముద్దుటుంగరం పాట, సీతాదేవి ఆనవాల పాట మొదలైనవి రామాయణ సంబంధాలు ధర్మరాజు జూదం, పండు పాట, సుభద్ర సారె, శశిరేఖా పరిణయం బతుకమ్మ పాట మొదలైనవి భారత సంబంధాలు. శ్రీకృష్ణ జననం లాలిపాట, కాళింగ మడుగు పాట, శ్రీకృష్ణుని చల్దుల పాట, గుమ్మడు పాట, యశోద కొంగపాట, రుక్మిణీ కళ్యాణం బతుకమ్మ పాట మొదలైనవి భాగవత సంబంధాలు. నల చరిత్ర పదం, గోవుపాట, మంగమ్మ పాట, తురక బూబమ్మ పాట మొదలైనవి ఇతరాలు.

**మతసంబంధాలు** : మత సంబంధాల శాఖకు చెందిన చిన్న కథాగేయాల్లో శైవమత సంబంధాలు, వైష్ణవ మత సంబంధాలు అనే రెండు అంతశ్శాఖలున్నాయి మేనకా దేవి నొప్పులు, మేనకా పార్వతీ సంవాదం, సవతుల కయ్యం, గంగాగౌరు సంవాదం మొదలైనవి శైవమత సంబంధాలు. వరదరాజు పెండ్లి పాట, తిరుమంత్రం పాట, లక్ష్మీదేవి సొగటాలాట పాట మొదలైనవి వైష్ణవమత సంబంధాలు.

**జానపదాలు** : ఎర్రపాప పాట, చాకలిదుడుమన్న పదం లేక వీరనాగమ్మ పాట, వానదేవుని పాట, భూపతిరాజు పదం, బొత్తుడుపాట, ఒలియ పాచ్చావుపాట, మొదలైనవి జానపదాల శాఖకు చెందిన చిన్న కథాగేయాలు[5]. ఈ జానపదాలన్నీ అద్భుత రస ప్రధానమైనవి

**చారిత్రకాలు** : చారిత్రక శాఖకు చెందిన చిన్న కథాగేయాల్లో వీర మరణాలు, వీర ప్రశంసలు, విప్లవ జన్యాలు, దానవీర ప్రశంసలు అనే నాలుగు అంతశ్శాఖలను గుర్తింపవచ్చు

దొరవారి నరసింహారెడ్డి పాట, చిన్నపరెడ్డి పాట, అల్లూరి సీతారామరాజు పాట మొదలైనవి

---

5 కాటమరాజుకథలు, మొదటిభాగం, డా తంగిరాల వెంకట సుబ్బారావు, పుట XXXXIV

వీరమరణాలు అనే అంతశ్శాఖకు చెందుతాయి. వీటిలో చెప్పబడిన వ్యక్తులందరూ ఆంగ్లేయులమీద తిరుగుబాటు చేసి చివరకు వారిచేత ఉరి తీయబడడంగాని, తుపాకితో కాల్చబడి చనిపోవడంగాని జరిగింది.

నరసింహారెడ్డి పాట, మరుట్ల చిన్నమల్లేశుని పాట, ఓబుల రెడ్డి పాట, పెనుగొండ కోట పాట మొదలైనవి వీర ప్రశంసలనే అంతశ్శాఖకు చెందుతాయి.[6]

దొడ్డి కొమరయ్య పాట, రేణిగుంట రామిరెడ్డి పాట, గోముక్కల గోపాలరెడ్డి పాట, యలకపల్లి యాదగిరి పాట పసునూరి వెంకటరెడ్డి పాట, వీరమల్ల వెంకయ్య పాట, కొంతం కొండల రెడ్డి పాట, అనిరెడ్డి రామిరెడ్డి పాట, చిలకమ్మ పాట మొదలైనవి విప్లవ జన్యాలనే అంతశ్శాఖకు చెందుతాయి. ఇందులో చెప్పబడిన వ్యక్తులందరూ తెలంగాణాలో నైజాం నవాబును, కిరాతకులైన అతని రజాకార్లనుఎదిరించి వీరమరణాన్ని పొందారు. 1945 నుండి 49 వరకు కమ్యూనిస్టులు గొప్ప విప్లవాన్ని లేవదీశారు. ఆ విప్లవం సందర్భంగానే పైన పేర్కొన్న వీరులు వీర వనితలు నైజాం నవాబును ఎదిరించారు. అందువల్లనే తంగిరాల వేంకట సుబ్బారావుగారు వీటికి విప్లవ జన్యాలు[7] అనే పేరు పెట్టారు.

బుడ్డా వెంగళ రెడ్డి పాట, సుద్దపల్లి లక్ష్మమ్మ పాట, యాదాళ్ల నాగమ్మ పాట, డొక్కా సీతమ్మ పాట, చిన్న అండ్లూరు శివమ్మ పాట మొదలైనవి దానవీర ప్రశంసలు అనే అంతశ్శాఖకు చెందుతాయి.

**సాంఘికాలు** : సాంఘిక శాఖకు చెందిన చిన్న కథాగేయాల్లో గ్రామ కక్షలు – హత్యలు, స్వైరిణులు – భర్తృహంతలు, పందాలు – స్పర్ధలు, ఆత్మత్యాగాలు – కట్టపదాలు, విధి వైపరీత్యాలు – ప్రమాదాలు అనే ఐదు అంతశ్శాఖలను చెప్పవచ్చు.[8]

గుర్రాల గోపిరెడ్డి పాట, మానంది రెడ్డి పాట, గడేకల్లు నాగిరెడ్డి పాట, బండోళ్ల కురుమలన్న పాటమొదలైనవి గ్రామకక్షలు – హత్యలు అనే వర్గానికి చెందుతాయి. అద్దాల సుబ్బులు పాట, చిన్న మునెమ్మ పాట, గుంటూరు ఆదెమ్మ పాట మొదలైనవి స్వైరిణులు – భర్తృహంతలు అనే విభాగానికి చెందుతాయి. అప్పలాపురం చెన్నారెడ్డి పాట, గొర్రెపోతుల పందెం మొదలైనవి పందాలు – స్పర్ధలు అనే విభాగానికి చెందుతాయి. లలికట్ట పదం, ఒద్దిరాజుల పాట, బోన కాటపరెడ్డి పాట మొదలైనవి ఆత్మత్యాగంతో కూడిన కట్టపదాలు. ఎల్లల చెరువు పొంగిన పాట, మూసిపొంగిన పాట, జనగామ రైలు ప్రమాదం, జడ్చెర్ల రైలు ప్రమాదం మొదలైనవి విధి వైపరిత్యాలు – ప్రమాదాలు అనే విభాగానికి చెందుతాయి.

---

6 కాటమరాజుకథలు,మొదటి భాగం, డా. తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXXXIII
7. కాటమరాజుకథలు,మొదటి భాగం, డా తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXXXIV
8. కాటమరాజుకథలు,మొదటి భాగం, డా తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXXXIII

సాంఘిక శాఖలో గ్రామ కక్ష్యలు - హత్యలు, స్వైరిణులు - భర్తృహంతలు, పందాలు - స్పర్ధలు, ఆత్మత్యాగాలు - కట్ట పదాలు, విధివైపరీత్యాలు - ప్రమాదాలు అనే అంతశ్శాఖలున్నట్లుగా తంగిరాలవారు చెప్పారు. తంగిరాలవారు తాము సేకరించిన చిన్న కథాగేయాలను ఆధారంగా చేసుకొని పై వర్గీకరణ చేశారు. పై వర్గీకరణ కిందికి రాని సాంఘిక శాఖకు చెందిన చిన్న కథాగేయాలు ఇంకా ఉన్నాయి. ఉదాహరణకు నేను విశాఖపట్నం పరిసరాల్లో సేకరించిన మాలవారి మంగమ్మ పాట, గంగరాజు పాట, సాయిబు నాయుడు పాట మొదలైనవాటిలో మాలవారి మంగమ్మ పాటలోని కథ హరిజన కాపు కులాలకు చెందిన యువతీయుకుల ప్రేమగాథ, గంగరాజు పాటలో గంగరాజు అనే మోసగాడు తన ఊరి నాయుడి కూతురైన వెంకట లక్ష్మికి మాయమాటలు చెప్పి ఆమెను లేవదీసుకు పోతాడు. సాయిబు నాయుడు పాటలో సాయిబు నాయుడుని పట్నంలో ఉండే ప్రేమ లచ్చిమి అనే భోగం స్త్రీ డబ్బుకోసం చంపిస్తుంది. కాబట్టి సాంఘిక శాఖలో చిన్న కథాగేయాలు లభించేకొద్దీ వాటిలో అంతశ్శాఖలు పెరిగిపోతూ ఉంటాయి.

**పెద్ద కథాగేయాలు:** వీటిలో కథ పెద్దదిగా ఉంటుంది. ఇవి రెండు మూడు రాత్రులు పాడదగిన పరిమాణంలో ఉంటాయి. కొన్ని నాలుగు అయిదు రాత్రులు పాడదగినంత పెద్దవిగా గూడా ఉంటాయి. వీటిలో పౌరాణిక సంబంధమైన వాటిని ఎక్కువగా స్త్రీలు పాడుకుంటూ ఉంటారు. అల్లీరాణి కథలాంటి పౌరాణిక కథాగేయాలను మిగిలిన కథాగేయాలను గాయక భిక్షుకులు రాత్రిపూట పాడుతూ ఉంటారు. వీటి పేర్ల చివర సామాన్యంగా కథ అనే పదం వస్తూ ఉంటుంది. బొబ్బిలి కథ, బాలనాగమ్మ కథ, సర్వాయి పాపని కథ, ఆరె మరాఠీల కథ, కామమ్మ కథ, లక్ష్మమ్మ కథ మొదలైనవి వీటికి ఉదాహరణలు.

ఇతివృత్తాన్ని బట్టి పెద్దకథాగేయాలను పౌరాణికాలు, మత సంబంధాలు, చారిత్రకాలు, జానపదాలు, సాంఘికాలు అనే అయిదు శాఖలుగా విభజింపవచ్చు.

**పౌరాణికాలు :** పౌరాణికాలను రామయణ సంబంధాలు, భారత సంబంధాలు, భాగవత సంబంధాలు, ఇతరాలు అనే నాలుగు అంతశ్శాఖలుగా విభజింపవచ్చు.

శాంత గోవిందనామాలు, అడవి గోవింద నామాలు లేక చరగోవిందనామాలు, సూక్ష్మ రామాయణం, పెండ్లి గోవింద నామాలు, లంకాయాగం, శారద రామాయణం, కుశలవ కుచ్చలచరిత్ర, రామకథాసుధార్ణవం మొదలైనవి రామాయణ సంబంధమైన పెద్ద కథాగేయాలు.

దేవయాని చరిత్ర, సుభద్రా కళ్యాణం, గయోపాఖ్యానం, విరాటపర్వం జంగం కథ మొదలైనవి భారత సంబంధమైన పెద్ద కథాగేయాలు.

ప్రహ్లాద చరిత్ర, వామన విజయం, అంబరీషోపాఖ్యానం, గజేంద్ర మోక్షం, ధ్రువ చరిత్రం

కథాగేయాలు
మొదలైనవి భాగవత సంబంధమైన పెద్ద కథా గేయాలు.

నల చరిత్ర, సత్య హరిశ్చంద్రబ్రతుకమ్మ పాట, చంద్రమతీదేవి బ్రతుకమ్మ పాట, దత్తాత్రేయ జననం, పారిజాతపల్లవి మొదలైనవి ఇతరాలకు చెందిన పెద్ద కథాగేయాలు. ఈ పౌరాణికాలను ఎక్కువగా స్త్రీలు పాడుతూ ఉంటారు.

**మత సంబంధాలు**. తెలుగు జానపద సాహిత్యంలో హిందూమతంలో ప్రధానాలైన శైవ వైష్ణవ మత సంబంధమైన కథాగేయాలు లభిస్తున్నాయి.

దక్షుని యజ్ఞం, గంగావివాహం, సురాభాండేశ్వరం, మార్కండేయుని జననం, శ్రీయాళ మహారాజు చరిత్ర జంగం కథ, చిరుతొండరాజు కథ, కుమ్మర గండయ్య కథ, మిండ జంగం కథ, కొమిరెల్లి మల్లన్న కథ మొదలైనవి శైవమత సంబంధమైన పెద్ద కథాగేయాలు. అండాళ్ చరిత్రం, శ్రీరంగ మాహాత్మ్యం, చెంచీత కథ, ఏకాదశీ మహాత్మ్యం, రుక్మాంగద మహారాజు కథ, చిన్నమ్మ కథ వరాహావతార చరిత్రం మొదలైనవి వైష్ణవ మతానికి చెందిన పెద్ద కథాగేయాలు

**చారిత్రకాలు**. చారిత్రక శాఖకు చెందిన పెద్ద కథాగేయాలు ఎక్కువగా వీరరస ప్రధానమైనవి. ఇంగ్లీషులో వీటిని Heroic ballads అంటారు. తెలుగులో వీటిని వీరగాథలు అనవచ్చు. వీటిలో యుద్ధవీరం ప్రధానంగా ఉంటుంది. చారిత్రకాల్లో స్పష్ట చారిత్రకాలు, అస్పష్ట చారిత్రకాలు అనే రెండు అంతశ్శాఖలున్నాయి. బొబ్బిలి కథ సర్వాయి పాపని కథ, కొమారరాముని కథ, దేశింగు రాజు కథ, రాణీ శంకరమ్మ కథ, సదాశివరెడ్డి కథ, కర్నూలు నవాబు కథ మొదలైనవి స్పష్ట చారిత్రకాలు. ముగ్గురు మరారీల కథ లేక ఆరె మరారీల కథ, బంగారు తిమ్మరాజు కథ లేక దేవరాయల కథ, కుంటి మల్లారెడ్డి కథ, వేమన కథ, బల్లారి కొండ్రాయుని కద మొదలైనవి అస్పష్ట చారిత్రకాలు.[9]

**జానపదాలు:** సాధారణంగా జానపదాలు అద్భుత రస ప్రధానాలు. జానపదులకు నవరసాల్లో అత్యంత ప్రీతికరమైంది అద్భుత రసం. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎంత ఎక్కువగా ఉంటే వారు అంతగా ఆదరిస్తారు. జానపదుల ఈ ఇష్టాన్ని గమనించి జానపద కవులు అద్భుత రస ప్రధానాలైన కొన్ని కథాగేయాలను కల్పించారు. బాలనాగమ్మ కథ, కమ్మవారి పణతి – పసల బాలరాజు కథ, గాంధారి కథ, కాంభోజరాజు కథ, ధర్మాంగద చరిత్ర పాము పాట మొదలైనవి జానపదాలు

**సాంఘికాలు** : సాంఘికాల్లో పేరంటాండ్రు, సాహసికులు, బందిపోట్లు, గజదొంగలు, గ్రామకక్ష్యలు – హత్యలు, కుటుంబ కలహాలు, లేచిపోవడాలు అనే ఏడు అంతశ్శాఖలున్నాయి.[10]

9 కాటమరాజుకథలు, మొదటిభాగం, డా. తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXXIX
10 కాటమరాజుకథలు, మొదటిభాగం, డా. తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXXIX

కన్యకామ్మవారి కథ, కామమ్మ కథ, సన్యాసమ్మ కథ, లక్ష్మమ్మ కథ, వీరరాజమ్మ కథ, నల్ల తంగాళ్ కథ, ఎరుకల నాంచారీ కథ, ఉయ్యూరు వీరమ్మ కథ మొదలైనవి పేరంటాండ్ర విభాగానికి చెందుతాయి. చిన్నపరెడ్డి కథ సాహసికుల శాఖకు చెందుతుంది మలగర బాలేసాబు కథ బందిపోట్ల శాఖకు చెందుతుంది. మియ్యాసాబు కద, పండుగ శాయన్న కథ, నక్కపల్లి రాముడు కథ మొదలైనవి గజదొంగల శాఖకు చెందుతాయి. కుంటి పుల్లారెడ్డి కథ, ఎల్లమంద నాయుడి కథ, దొర్నిపాడు వెంకట రెడ్డి కథ, పరిగ రామకృష్ణారెడ్డి కథ మొదలైనవి గ్రామ కక్ష్యలు – హత్యలు అనే శాఖకు చెందుతాయి. కండెపు సుబ్బయ్యగారి కథ కుటుంబ కలహాలు అనే శాఖకు చెందుతుంది. మందలోడు కథ లేచిపోవడం అనే విభాగానికి చెందుతుంది.

**కథాగేయ చక్రాలు** : పెద్ద కథాగేయాలలాంటి కథాగేయాలు కొన్ని ఈ కథాగేయ చక్రంలో ఒకదాని తరువాత ఒకటి చెప్పబడుతూ పెద్ద ఇతిహాసంలాగా ఉంటాయి. ఈ కథాగేయ చక్రాలను ఒక్కొక్కదాన్ని గాథాకారులు నెలల తరబడి పాడుతూ ఉంటారు. తెలుగు జానపద సాహిత్యంలో ఇప్పటికి లభించినంతవరకు కథాగేయ చక్రాలు అయిదు ఉన్నాయి. ఈ అయిదు అయిదు రకాలుగా ఉన్నాయి. వీటిలో మొదటిది మహాభారతంలాగా ఒక రాజవంశాన్ని ఆధారంగా చేసుకొని ఆ వంశంలోని వీరుల గురించి, దాయాదుల పరస్పర కలహాల గురించి అనేక కథలను వివరిస్తుంది. దీనికి ఉదాహరణ పల్నాటి వీరకథాచక్రం. ఈ కథాచక్రంలో క్రీ.శ. 12వ శతాబ్దంలో పల్నాడును పాలించిన హైహయ వంశపు రాజుల గురించి వివరింపబడింది. ఇందులో మొత్తం ఇరవై అయిదు కథలున్నాయి.[11]

రెండవదానిలో పెద్ద కథాగేయాలలాంటి కథలు కొన్ని ఒక ప్రముఖ వీరుని చుట్టు అల్లబడి అతణ్ణి గురించి, అతని బంధువులను గురించి చాల కథలను వరుసగా వర్ణిస్తూ ఉంటాయి. దీనికి ఉదాహరణ కాటమరాజు కథాచక్రం. ఈ కథాచక్రంలో కథానాయకుడైన కాటమరాజును గురించి, అతని పెదతండ్రి, పినతండ్రుల గురించి, వారి కుమారులు, కుమార్తెలు, అల్లుళ్ల గురించి మొత్తం మూడు తరాలవారికి సంబంధించిన అనేక కథలు వివరింపబడ్డాయి. ఈ కథాగేయ చక్రంలో మొత్తం ముప్పై రెండు కథలున్నాయి.[12]

మూడవదానిలో కొన్ని పెద్ద కథాగేయాలు ఒక మహిమగల స్త్రీ చుట్టు అల్లబడి ఆమెను గురించి, ఆమె తల్లిదండ్రులను గురించి, ఆమె సంతానాన్ని గురించి చెప్పబడుతూ ఉంటాయి. దీనికి ఉదాహరణ ఎల్లమ్మ కథాచక్రం ఇందులో తొమ్మిది కథలున్నాయి.[13]

నాల్గవదానిలో ఒక దేవతను గురించి, ఆ దేవతను కొలిచిన రాజవంశం వారిని గురించి కొన్ని

11 కాటమరాజుకథలు,మొదటిభాగం, డా తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXX-XXXI
12 కాటమరాజుకథలు,మొదటిభాగం, డా తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXXII,XXXIII
13 కాటమరాజుకథలు,మొదటిభాగం, డా తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXIII

పెద్ద కథాగేయాల్లో వివరింపబడుతూ ఉంటుంది. దీనికి ఉదాహరణ అంకమ్మ కథాచక్రం. ఇందులో మూడు కథలున్నాయి [14]

ఐదవదానిలో దుష్ట శిక్షణ శిష్టరక్షణ కోసం ఒకదైవం ఎత్తిన అవతారాలను గురించి వరుసగా అనేక పెద్ద కథాగేయాల్లో చెప్పబడుతూ ఉంటుంది. దీనికి ఉదాహరణ దశావతార కథాచక్రం ఇందులో మొత్తం 10 కథలున్నాయి.

పైన చెప్పిన ఐదు కథాగేయ చక్రాల్లో పల్నాటి కథాచక్రం, కాటమరాజు కథాచక్రం, ఎల్లమ్మ కథాచక్రం, అంకమ్మ కథాచక్రం అనే నాలుగింటిని గురించి తంగిరాల వేంకట సుబ్బారావుగారు విశేషమైన పరిశోధన చేసి ఎన్నో అమూల్యమైన విషయాలను వివరించారు. దశావతార కథాచక్రం గురించి తంగిరాలవారు ప్రస్తావించలేదు. ఈ దశావతార కథాచక్రంలో శ్రీ మహావిష్ణువు ఎత్తిన విష్ణువవతారం, మత్స్యావతారం, కూర్మావతారం, కొమ్ముల వరాహావతారం, నరసింహావతారం, వామనావతారం లేక బలుడవతారం పరుశురామావతారం, రామావతారం, వరాహావతారం, కృష్ణావతారం అనే పది అవతారాల గురించి పది కథాగేయాల్లో వివరింపబడింది.

ఇతివృత్తాన్ని బట్టి కథాగేయ చక్రాలను చారిత్రకాలు, జానపదాలు, పౌరాణికాలు అనే మూడు అంతశ్శాఖలుగా విభజింపవచ్చు. పల్నాటి కథాచక్రం, కాటమరాజు కథాచక్రం అనేవి రెండు చారిత్రక శాఖకు చెందుతాయి. ఎల్లమ్మ కథాచక్రం, అంకమ్మ కథాచక్రం అనే రెండు శక్తి కథలని పౌరాణిక శాఖకు చెందుతాయని తంగిరాలవారు చెప్పారు. ఎల్లమ్మ కథల్లో రేణుక, జమదగ్ని, పరుశురాముడు అనే పేర్లు తప్ప మిగిలిన కథాభాగమంతా అద్భుత కల్పనలతో నిండివుంది. ఇందులో ఎల్లమ్మ అనే నామాంతరమున్న రేణుక ఒక దుష్టశక్తిగా, తన కడుపున పుట్టిన పిల్లలకు పరమ శత్రువుగా చిత్రింపబడింది. అంకమ్మ కథల్లోగూడా అనేక అద్భుత కల్పనలున్నాయి. కాబట్టి ఇవి రెండు జానపద శాఖకు చెందుతాయని చెప్పవచ్చు. దశావతార కథాచక్రం పౌరాణిక శాఖకు చెందుతుంది.

ఈ విధంగా తెలుగు జానపద సాహిత్యంలో చాల రకాలైన కథాగేయాలున్నాయి.

---

14. కాటమరాజు కథలు, మొదటిభాగం, డా. తంగిరాల వేంకట సుబ్బారావు, పుట XXXIII

# దశావతార కథాగేయాలు

దశావతార కథాగేయాలను విశాఖపట్నం జిల్లాలో యాదవ కులస్థులు ''సేవ గరిడీ'' అనే జానపద కళాప్రదర్శన సమయంలో పాడుతారు. వీరు పాడే దశావతార కథలు ఇవి 1. విష్ణువవతారు, 2. మత్స్యావతారం, 3 కూర్మావతారం, 4. వరాహావతరం లేదా కొమ్ముల వరాహావతారం, 5. నరసింహావతారం, 6. వామనావతారం లేదా బలుడవతారం, 7. పరశురామావతారం, 8. రామావతారం, 9. వరాహావతారం, 10 కృష్ణావతారం. ఈ పది అవతార కథలతోపాటు ఈ గాథాకారులు తొమ్మిదవ అవతారమైన వరాహావతారానికి అనుబంధంగా సింహాచలం దేవళం కట్టుబడి అనే కథాగేయాన్నిగూడా పాడుతారు. దీనితో కలిపి మొత్తం ఇవి పదకొండు కథాగేయాలవుతాయి. ఈ పదకొండింటిని ఈ గాథాకారులు ''దశ పదకొండు అవతార కథలు'' అని పిలుస్తారు.

ఈ గాథాకారులందరూ చదువులేనివారు కావడంవల్ల అవతారం అనే మాటను అవుతారం అని అంటారు. అంతేగాక ఈ దశావతారాల పేర్లనుగూడా వీరు విష్ణువవుతారం, మచ్చావుతారం, కూర్మావుతారం, వారావుతారం లేదా కొమ్ముల వారావుతారం లేదా కొమ్ములావుతారం, నర్శిమ్మావుతారం, వామనావుతారం, పరశురామావుతారం, వారావుతారం, కిష్టావుతారం లేదా కిష్ణావుతారం అని పిలుస్తారు వీటిలో నాల్గవది ఎనిమిదవది రెండూ వరాహావతారం అనే పేరుతో ఉన్నాయి. అందువల్ల ఈ రెండింటిని గుర్తించడానికి వీలుగా నాల్గవదైన వరాహావతారాన్ని కొమ్ముల వరాహావతారమని ఈ గాథాకారులు పిలుస్తారు. విష్ణువు వరాహావతారం ఎత్తి హిరణ్యాక్షుని సంహరించి తన కోరలమీద భూమిని మోశాడు. ఈ కోరలను ఈ గాథాకారులు కొమ్ములుగా భావించి ఈ అవతారాన్ని కొమ్ముల వారావుతారమని పిలుస్తారు. మరికొందరు కొమ్ములావుతారం అని గూడా అంటారు. వామనావతారాన్ని బలిచక్రవర్తి పేరుతో బలుడవుతారమని గూడా వ్యవహరిస్తారు.

ఈ దశావతారాల్లో మత్స్యావతారం, కూర్మావతారం, వరాహావతారం లేదా కొమ్ముల వరాహావతారం, నరసింహావతారం, వామనావతారం, పరశురామావతరం, రామావతారం, కృష్ణావతారం అనే ఎనిమిది శిష్ట సాహిత్యంలో ఉన్నవే. అయితే కథలో పాత్రల పేర్లలో కొంత భేదం ఉంటుంది మొత్తంమీద శిష్ట సాహిత్యంలోని ఆయా అవతార కథల ననుసరించే ఈ కథాగేయాలను జానపద కవి రచించాడు. మొదటిదైన విష్ణువవతారం తొమ్మిదవదైన వరాహావతారం రెండూ శిష్ట సాహిత్యంలోని దశావతారాలకు చెందినవి కావు. ఇవి రెండు జానపద కవి కల్పితాలే శిష్టసాహిత్యంలోని బుద్ధావతారం, కల్క్యవతారం గురించిన కథలను జానపద కవి రచించలేదు.

వీటిలో కొమ్ముల వరాహావతారం, వామనావతారం, పరశురామావతారాలు మూడు చాల చిన్నవి వీటిలో కథ చాల తక్కువగా సూచనామాత్రంగా ఉంది. ఈ మూడు అరగంటలోపు కాలంలో పాడబడేటంత పరిమాణంలో ఉంటాయి. కాబట్టి ఈ మూడు కథాగేయాలను చిన్న కథాగేయాలుగా భావించవచ్చు

విష్ణువవతారం, మత్స్యావతారం, కూర్మావతారం అనే మూడు కథాగేయాలు ఒక్కొక్కటి నాలుగు గంటల కాలంలో పాడదగినంత పరిమాణంలో ఉంటాయి. వరాహావతారం ఐదు గంటల కాలంలో పాడదగినంత నిడివి కలిగి ఉంది. వరాహావతార కథకు అనుబంధంగా పాడబడుతున్న సింహాచలం దేవళం కట్టుబడి కథ ఆరు గంటల కాలంలో పాడబడేటంత పరిమాణంలో ఉంది. నరసింహావతార కథ ఏడు గంటల కాలంలో పాడబడేటంత పరిమాణంలో ఉంది.

రామావతార, కృష్ణావతార కథాగేయాలు చాల పెద్దవి. కృష్ణావతారం కంటె రామావతార కథ ఇంకా పెద్దది. కృష్ణావతార కథ సుమారు నలభై గంటల కాలంలో పాడబడేటంత పరిమాణంలో ఉంటే రామావతార కథ అరవై గంటల కాలంలో పాడబడేటంత పరిమాణంలో ఉంటుంది.

దశావతార గాథాకారులు సేవగరిడి కళాప్రదర్శన సమయంలో కృష్ణావతార కథను ఎక్కువగా పాడుతూ ఉంటారు ఈ కళాకారుల్లో కృష్ణావతార కథ ఎంతో కొంతైనా రానివారుండరు. అలాగే ఈ కథాగేయం చాల పెద్దది కావడంచేత మొదటినుండి చివరదాకా దీన్ని నేర్చుకున్నవారు గూడా చాలా తక్కువగానే ఉన్నారు. కృష్ణావతారం తర్వాత విష్ణువవతారం, మత్స్యావతారం, కూర్మావతారం, నరసింహావతార కథాగేయాలను ఈ గాథాకారులు సేవగరిడిలో ఎక్కువగా పాడుతూ ఉంటారు. కొమ్ముల వరాహావతారం, వామనావతారం, పరశురామావతార కథలు చాలా చిన్నవిగా ఉన్నప్పటికి గాథాకారులు వీటిని నేర్చుకోవడం గాని, సేవగరిడి కళాప్రదర్శన సమయంలో వీటిని పాడడంగాని చాల తక్కువ. ఈ మూడు కథలు వచ్చిన గాథాకారులుగూడా చాల తక్కువమంది ఉన్నారు దీనికి కారణం ఇందులో కథ సూచనామాత్రంగా ఉండడం కావచ్చు.

రామావతార కథను గాథాకారులు సేవగరిడి కళాప్రదర్శనలో అసలు పాడరు. ఈ కథ 'గరిడీ' లో ఎక్కదని వీరంటారు. అంటే సేవగరిడి కళను ప్రదర్శిస్తూ రామావతార కథను పాడడం కుదరదని వీరి ఉద్దేశ్యం. రామావతార కథను పూర్తిగా నేర్చుకున్నా, పాడినా అది ఆ గాథాకారునికి, అతని కుటుంబానికి ''కొట్టు'' అని ఆ కుటుంబం పైకి రాదని వీరి నమ్మకం. అందువల్ల గాథాకారులు చాలావరకు రామావతార కథను నేర్చుకోరు. నేర్చుకున్నా పూర్తిగా నేర్చుకోరు. పూర్తిగా పాడరు. దీనికి కారణం ఈ కథాగేయంలో దైవదూషణ ఉన్న మాటలు

ఎక్కువగా ఉన్నాయని, ఈ కథ పాడితే తమ నోటితో రాముణ్ణి, విష్ణువును దూషింపవలసి వస్తుందని అది తమకు మంచిది కాదని వీరి నమ్మకం, ఉద్దేశ్యం అయితే రామావతార కథ వచ్చినవారిని, ఎవరైనా వచ్చి విడిగా ఆ కథను పాడమంటె పాడుతారు.

వరాహావతార కథకు అనుబంధంగా ఉండే సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయాన్ని గూడా గాథాకారులు ఎక్కువగా నేర్చుకోరు, పాడరు. దీనికి కారణం ఇది శ్రీ మహావిష్ణువు అవతార కథ కాకపోవడం కావచ్చు. మొత్తంమీద ఈ గాథాకారులు సేవగరిడి కళా ప్రదర్శనలో కృష్ణావతార, విష్ణువవతార, మత్స్యావతార, కూర్మావతార, నృసింహావతార, వరాహావతార కథలనే ఎక్కువగా పాడుతూ ఉంటారు.

దశావతార కథలు, కథాగేయాల్లోని చిన్న కథాగేయాలు, పెద్ద కథాగేయాలు, కథాగేయ చక్రాలు అనే మూడు విభాగాల్లో చివరిదైన కథాగేయ చక్రాల శాఖకు చెందుతాయి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీ మహావిష్ణువు ఎత్తిన అవతారాలు వరుస క్రమంలో పది కథలుగా ఈ కథాగేయ చక్రంలో చెప్పబడ్డాయి. ఈ కథలన్నీ వీరరస ప్రధానమైనవే. కాబట్టి వీటిని వీర గాథలు అని పిలువవచ్చు.

దశావతార కథల్లో కథాగేయ లక్షణాలైన కథను కలిగి ఉండడం, గేయరూపంలో ఉండడం, సరళశైలిలో ఉండడం, భిన్న పాఠాంతరాలను కలిగి ఉండడం, మౌఖిక సంప్రదాయంలో జీవించడం, వారానువర్తనాలను కలిగి ఉండడం, అజ్ఞాత కర్తృత్వం, రచనాకాలం తెలియక పోవడం, నియమిత స్వరూపం లేకపోవడం, ఆశురచన, అభివర్ణిత పునరుక్తి మొదలైనవన్నీ ఉన్నాయి.

దశావతార కథాగేయాలు ''హరిహరి నారాయణాది నారాయణ, కరుణించి మమ్మేలు కమలలోచనుడా'' అనే వరుసలో ఉన్నాయి. 'సేవగరిడి' కళలో ఈ కథలను పాడే ప్రధానగాయకుణ్ణి 'దాసుడు' అంటారు దాసుడు ఎడమ చేత ''బెత్తు'' అని పిలువబడే కర్రను, కుడిచేత నెమలి ఈకలతో చేసిన కుంచెను పట్టుకొని కథను చెబుతూ ఉంటే మిగిలిన కళాకారులు అతనిచుట్టూ నిలబడి తాళాలు వాయిస్తూ అతడు చెప్పిన పాదాన్ని పునరావృత్తి చేస్తూ ఉంటారు. కొన్ని సమయాల్లో చుట్టూ ఉన్నవారు దాసుడు పాడిన గేయ పాదానికి బదులుగా హరిహరి నారాయణాది నారాయణ, కరుణించి మమ్మేలు కమలలోచనుడా అని వంత పాడుతారు.

దశావతార కథాగేయాల రచయిత ఎవరో తెలియడం లేదు. వీటన్నింటిని ఒకే జానపద కవి రచించి ఉంటాడు. ఈ గాథాకారుల్లో ఒకరైన గొలగాని అప్పారావుగారు చెప్పిన ప్రార్థనాగీతాన్ని బట్టి ఈ కథలను రాసిన జానపద కవి పతకాల ముసలయ్య అని తెలుస్తూ ఉంది. అప్పారావుగారు

విశాఖపట్నం సమీపంలో ఉన్న చినగదిలి గ్రామ నివాసి. వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వాచ్‌మాన్‌గా పనిచేస్తున్నారు. వీరు పాడిన ప్రార్థనాగీతం ఇది.

మాదవా గోవిల యాదవుల గాయగా
మాదవా రేపల్లి ఈదులున్నాడు
నాకు జెప్పిన గురువు నా వద్దనుంటేను
నీలవెన్నుడి సామి నెత్తిపాడుదును
పాడుదును పట్టాపు రామయ్య కతలాను
రాగి కొండలమీద రామావతారుణ్ణి
దశరదాతనయుణ్ణి దండమని మొక్కితే
దండమని మొక్కితే గండములు తొలగు
కౌసల్లె తనయుణ్ణి కరునందు దనిసితె
కారుటాకుల రీతి కర్మములు తొలగు
దండమయా దశరాజా తనయుల మీకు
రామజల్మము జెప్పి రాజ్యమేలుబడి జెప్పి
కుసుమాల చరితంబు గూర్చి పాడుదును
ఏవేళ పాడిన శీరాము చరితంబు
అన్నలార మీరు ఆలకించండి
నాకన్న చిన్నోలు నాకన్న పెద్దోలు
అన్నలారా మీరు ఆలకించండి
అరతంబు దెలియక వన్నేయమాడుదురు
అన్నలారా మీరు అనుబగించండి
ఆచ్చాపన మాని ఆలకించండి
పదము గూర్చిన వాడు పతకాల ముసలయ్య
తండ్రి పాపయ రాజు తల్లి జగ్గమ్మ
తండ్రి పాపయరాజు తల్లి జగ్గమ్మని
అతని బారియ పేరు అత్తినూజలది
ఇల నాయకుడు తెచ్చె అలనాడు కతలు
ఇంద్రలోకంమీద ఇరజల్లినాడు
ఆ కతలు కతలాయి కలియుగంమీద
అంతకంతకు కతలు అతిమిక్కిలాయె
రాజ్యంబుమీద కతలు రంజిల్లుతుండె

ఈ గేయంలో రామావతారం గురించి చెప్పిన తర్వాత ''పదము గూర్చినవాడు పతకాల ముసలయ్య'' అని చెప్పబడింది. పదం కూర్చడమంటె పదం రాయడమే. ఈ కథాగేయాలను గాథాకారులు పదాలు అని గూడా వ్యవహరిస్తారు. ఈ ప్రార్థనాగీతంలో రామావతారాన్ని ప్రస్తావించి ఆ తర్వాత కవి గురించి చెప్పబడింది. కాబట్టి పతకాల ముసలయ్య రామావతార కథాగేయాన్ని రాసిన వాడై ఉండాలి. లేక అతడే మొత్తం దశావతార కథలన్నింటిని రాసి ఉండవచ్చు. గీతంలో అతని పేరుతోబాటు అతని తండ్రి పాపయరాజు అని, తల్లి జగ్గమ్మ అని, అతని భార్య అత్తిమాజలది అని చెప్పబడింది. ముసలయ్య ఏ ఊరివాడో, ఏ కాలంవాడో చెప్పబడలేదు. అందువల్ల అతని గురించిన వివరాలు తెలియడంలేదు.

ఈ దశావతార కథలన్నింటిని చెరసాలలో ఉన్న దేవకీదేవికి ఆమె గర్భంలో ఉన్న కృష్ణుడు చెబుతాడు. తనచెల్లెలైన దేవకీదేవికి పుట్టిన అష్టమ కొడుకు వల్ల తనకు మరణం కలుగుతుందని ఆకాశవాణి ద్వారా విన్న కంసుడు దేవకీ వసుదేవులను చెరసాలలో పెట్టి ఆమెకు పుట్టిన ఏడుగురు కుమారులను నరికి చంపుతాడు. ఎనిమిదవసారి గర్భం ధరించిన దేవకి, కృష్ణుడు జన్మించడానికి ముందుగా తన అన్న శక్తిసామర్థ్యాలను, దుర్మార్గాన్ని తలుచుకొని పుట్టబోతున్న ఎనిమిదవ సంతానాన్నిగూడా తప్పనిసరిగా చంపివేస్తాడని భావించుకుంటూ కంటికీ మంటికీ ఏకధారగా విలపిస్తూ ఉంటుంది. ఆ సమయంలో ఆమె గర్భంలో ఉన్న కృష్ణుడు తాను సాధారణమైన వాణ్ణి కాదని, అంతకుముందు తొమ్మిది అవతారాలు ధరించి అనేక ఘనకార్యాలు చేసిన శ్రీమహావిష్ణువునని, పదవ అవతారంగా శ్రీకృష్ణుడుగా జన్మించి తప్పనిసరిగా కంసుణ్ణి చంపుతానని చెబుతాడు. అప్పుడు దేవకి అంతకుముందు ఎత్తిన అవతారాలను గురించి అడుగుతుంది. దానికి సమాధానంగా తాను ఎత్తిన ఒక్కొక్క అవతారాన్ని గురించి ఒక్కొక్క కథగా కృష్ణుడు ఆమెకు చెబుతాడు.

**అమ్మలమ్మల తల్లి తల్లి దేవాకి**
**పగరాజు చెల్లెలా బత్తిగల మాతల్లి**
**ఎత్తినావు తారాల ఏదమిన్నావా**
**ముందటవుతారాల ముచ్చటిన్నావా**
**ఆ పలుకులిన్నాది తల్లి దేవాకి**
**ఏ మంట పలుకుతది తల్లి దేవాకి**
**నాయనా నాయబ్బనాముకుమారా**
**అష్టబూలోకాల కాది నారాయణ**
**పుట్టలేదురా కొడుక పొట్టలున్నావు**
**నువ్వేది అవుతారాలు ఎత్తినావురా**

ఎత్తినావుతారాల పెదమేమిటిరా
చెప్పరా ఒరె కొడకా చెవులనింతాను
ఆ పలుకులిన్నాడు నీల యెల్లుండు
ఏ మంట పలుకుతడు నీల యెల్లుండు
అమ్మలమ్మలతల్లి తల్లి దేవాకి
అవుతారముల ముచ్చటమ్మ ఇంటావా
యిష్టమౌతారాలు ఎత్తుండి నాను
చెప్పుతానే తల్లి చెవులాలకించు

అని మొదటి అవతారమైన విష్ణువవతార కథను చెబుతాడు కథను పూర్తిగా చెప్పిన తర్వాత కృష్ణుడు

పగరాజు చెల్లెలా బత్తిగల మాతల్లి
అంతేసి పంతాలు గెలచినానమ్మ
అంతేసి పంతాలు నాకు చెల్లాయి
నాడెక్కడున్నాడో నాతి మీయన్న
ఏది మీయన్న దొక్కెదమిందాము
చెప్పకే మియన్న గొప్పలిచ్చోట

అని అంటాడు దానికి దేవకి తన అన్న కంసుడు చాల దుర్మార్గుడని తప్పనిసరిగా అతడు కృష్ణుని శిరస్సు ఖండిస్తాడని అంటుంది

నాయనా నాయబ్బ నాముకుమారా
ఎన్నెన్ని పంతాలు ఏల జెప్పెనగాని
ఉంచ్రడా నీ శిరసు ఉగములోపలను
దాయ్రడా నీ శిరసు కండించుతాడు

దానికి కృష్ణుడు కోపంతో

అమ్మరో మముగన్న తల్లి దేవాకి
మాటిమాటికి నువ్వు కంజుడంతావు
మీయన్న పంతాలు మిగుల జెప్పేవు
కంజుడికి నావేరు కాలచక్రములమ్మ
చెప్పకే మీయన్న గొప్పలిచ్చోట
ఎవరికన్నగ్గజ్జుడు ఓలమ్మ మీయన్న

అని తాను ఎత్తిన రెండవ అవతారమైన మత్స్యావతారం గురించి చెబుతాడు. ఈ విధంగా శ్రీకృష్ణుడు తల్లి గర్భంలో నుండే ఈ దశావతార కథలను చెప్పినట్లుగా ఈ కథాగేయాల్లో చెప్పబడింది.

దశావతార కథలను పాడేవారు ఎక్కువగా యాదవులే. వీరు సేవగరిడి అనే జానపద కళాప్రదర్శన సమయంలో ఈ కథాగేయాలను పాడుతారు. సేవగరిడి ప్రదర్శన విశాఖపట్నం జిల్లాలోని కొన్ని యాదవ కుటుంబాల్లో తరతరాలుగా వంశపారంపర్యంగా వస్తూఉంది. ఈ కళను వీరు నియమ నిష్ఠలతో భక్తి శ్రద్ధలతో ప్రదర్శిస్తారు. ఇది భక్తి ప్రధానమైన కళ. ఈ కళాకారులందరూ పేదవారు. చదువుసందెలు లేనివారు. వీరిలో కొందరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వాచ్‌మాన్‌లు, గార్డెనర్‌లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలాంటివారు తెలుగులో సంతకం చేయగలరు. మిగిలినవారు కూలిపని చేస్తూ పొట్టపోసుకుంటారు. వీరందరూ మిగిలిన గాథాకారులలాగా సంచార జీవనులు కారు. వీరు తాము ఉన్న ఊళ్ళోనే స్థిరనివాసం ఏర్పరచుకొని సేవగరిడి కళను ప్రదర్శిస్తారు.

విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లో సేవగరిడి సంఘాలున్నాయి. చిన్నవాల్తేరు, మువ్వలవానిపాలెం, వెంకోజీపాలెం, శివాజీపాలెం, శ్రీరంగాపురం మొదలైన గ్రామాలన్నీ ప్రస్తుతం విశాఖపట్నం నగరంలో కలిసిపోయాయి. నగర జీవనంతో సంబంధాలు ఏర్పరచుకున్నప్పటికి సేవగరిడి కళాకారులు తమ ప్రదర్శనలను మానుకోలేదు. సినిమాలు, టీ వీలు రాకముందు సేవగరిడి కళ గ్రామీణ ప్రజలకు భక్తితో పాటు మంచి వినోదాన్నిగూడా కలిగించేది. సంక్రాంతి, శివరాత్రి మొదలైన పండుగ రోజుల్లోను, గ్రామదేవతల పండుగ సమయాల్లోను, మిగిలిన ఉత్సవాల సందర్భాల్లోను ఈ కళాకారులు రాత్రంతా దశావతార కథాగేయాలనుగానంచేసి ప్రజలను తరింపజేసేవారు. ఇలాంటి సమయంలో చదువులేకపోయి నప్పటికి వీరు ఏమాత్రం తడుముకోకుండా దశావతారాలను రాత్రంతా పాడడం చూస్తే వారి శ్రుత పాండిత్యానికి, ధారణాశక్తికి ఆశ్చర్యం వేస్తుంది ఆదునికకాలంలో అన్ని జానపద కళలలాగే ఈ కళకు ఆదరణ లేకపోవడం శోచనీయం. ఈ కళాకారులు పేదవారైనప్పటికి ఎవరైనా పిలిస్తే ఉచితంగా గూడా తమ కళను ప్రదర్శిస్తారు. తమ కళమీద వారికున్న భక్తి శ్రద్ధలు అలాంటివి.

# సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం - ఇతివృత్తం

ఆంధ్రదేశంలో నరసింహ క్షేత్రాలు సింహాచలం, అహోబలం, అంతర్వేది, అగిరిపల్లి, మంగళగిరి, యాదగిరి, వేల్పుకొండ, కోరుకొండ, ధర్మవరం మొదలైన చోట్ల ఉన్నాయి. ఈ క్షేత్రాల్లో ఉన్న నృసింహస్వామికి వరాహ నరసింహ, జల నరసింహ, ఉగ్రనరసింహ, జ్వాలానరసింహ, బిల నరసింహ, లక్ష్మీనరసింహ మొదలైన వేర్వేరు పేర్లు వున్నాయి. వీటిలో సింహాచలం గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఇది విశాఖపట్నానికి ఉత్తరం వైపున 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ క్షేత్రం సముద్ర మట్టానికి 800 అడుగుల ఎత్తులో తూర్పు కనుమల యొక్క కొండల వరుసలోని కైలాసగిరి అనే కొండమీద ఉంది. ఈ కొండలవరుస విశాఖపట్నంలోని ''లాసన్స్‌బే'' నుండి సింహాచలం వరకు తూర్పునుండి పడమర దిశగా వ్యాపించి ఉంది. సింహాచలంలో విష్ణువు వరాహ-నరసింహావతార రూపంలో ఉన్నాడు. విష్ణుమూర్తి దశావతారాల్లో వరాహావతారం మూడవది. నాల్గవది నరసింహావతారం. ఈ రెండు అవతారాలు కలిసిన వరాహ నరసింహావతార రూపంలో స్వామి సింహాచలంలో ఉన్నాడు. ఈ స్వామిని విశాఖపట్నం ప్రాంతంలోని ప్రజలు సింహాద్రి అప్పన్న అని పిలుస్తారు.

సింహాచల క్షేత్ర మాహాత్మ్యాన్ని గురించి, సింహాచలం దేవాలయం కట్టడాన్ని గురించి శిష్ట సాహిత్యంలోను, జానపద సాహిత్యంలోను వేర్వేరు కథలున్నాయి. సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం జానపద సాహిత్యానికి సంబంధించినది.

సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయాన్ని విశాఖపట్నం ప్రాంతంలోని దశావతార గాథాకారులు పాడుతూ ఉంటారు. వీరిని దాసులు అంటారు. దాసులు ఈ కథాగేయాన్ని దశావతార కథల్లో తొమ్మిదవదైన వరాహవతార కథకు-అనుబంధంగా పాడుతారు. ఈ కథను వీరు తాముచేసే ''సేవగరిడి'' కళాప్రదర్శన సందర్భంగా పాడడం చాల తక్కువ. దీన్ని విడిగా పాడుకుంటారు. దశావతార కథల్లో ఈ కథాగేయానికి పెద్దగా ప్రచారం ప్రసిద్ధి లేదు. దీనికి కారణం ఇది విష్ణువు ఎత్తిన అవతార కథకాకపోవడమేనని ఈ గాథాకారులంటారు.

అన్ని దశావతార కథలలాగానే సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయంగూడా లిఖిత రూపంలో లేదు. ఈ గాథాకారులందరూ దాదాపు నిరక్షరాస్యులు. మౌఖిక ప్రసారంలోనే ఈ కథ జీవిస్తూ ఉంది. ఈ కథను నేను ఈపు నరసింగరావు, మువ్వల అప్పారావు అనే ఇద్దరు దాసులచేత పాడించి రికార్డు చేశాను. ఈ కథను పూర్తిగా పాడడానికి ఒక్కొక్కరికి గంట నిడివిగల క్యాసెట్లు మూడు సరిపోయాయి. ఈ కథను వీరు విడిగా పాడేటప్పుడు హావభావాలతో చెప్పిన విషయాన్నే చెబుతూ, మధ్యలో నిలుపుతూ పాడడంవల్ల ఆరుగంటల కాలం పడుతుంది.

సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయాన్ని నాకు పాడి వినిపించిన మువ్వల అప్పారావుగారు

ముివ్వలవానిపాలెం గ్రామ వాస్తవ్యులు, ఈపు నరసింగరావుగారు పీతలవానిపాలెం గ్రామ వాస్తవ్యులు. ప్రస్తుతం ఈ రెండు గ్రామాలు విశాఖపట్నంలో కలిసి పోయాయి. ముివ్వల అప్పారావుగారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గార్డెనర్‌గా పని చేస్తున్నారు. ఈపు నరసింగరావుగారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పంపుసెట్ అటెండరుగా చేసి ఉద్యోగ విరమణ గావించారు. ముివ్వల అప్పారావుగారికి 50 సంవత్సరాలు. ఈపు నరసింగరావుగారికి 58 సంవత్సరాలున్నాయి. వీరిద్దరూ యాదవ కులస్థులే. వీరిద్దరూ పాడిన కథలో కొన్నిచోట్ల తేడా ఉంది. ఈ పాంఠాంతరాలను చెప్పడం కోసమే నేను ఈ ఇద్దరిచేత ఈ కథాగేయాన్ని పాడించాను. ఈ గ్రంథంలో ఇచ్చిన ప్రధాన గేయం ఈపు నరసింగరావు గారు పాడినది. అథస్సూచికలో ఇచ్చిన పాఠాంతరం ముివ్వల అప్పారావుగారు పాడినది.

సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం దశావతార కథల్లో తొమ్మిదవదైన వరాహావతార కథకు అనుబంధంగా ఉంది. వరాహావతార కథకు శేష భాగమే సింహాచలం దేవళం కట్టుబడి కథ. అయితే ఈ వరాహావతార కథ శిష్ట సాహిత్యంలో ఉన్న వరాహావతార కథ కాదు. ఇది పూర్తిగా జానపద కవి కల్పితం. శిష్ట సాహిత్యంలోని వరాహావతార కథకు దీనికి ఎలాంటి పోలిక లేదు. ఈ వరాహావతార కథను చెప్పకుండా సింహాచలం దేవళం కట్టుబడి కథను చెబితే అది అర్థం కాదు. అందువల్ల ముందుగా వరాహావతార కథను క్లుప్తంగా తెలుసుకుందాం.

**వరాహావతార కథ :**

శ్రీ మహావిష్ణువు రామావతారంలో కిష్కింద రాజైన వాలిని పందిని కొట్టినట్లుగా చెట్టు చాటునుండి బాణంతో కొడతాడు. చేసిన పాపానికి ఎంతటివారైనా ఫలితాన్ని అనుభవించ వలసిందే. అందువల్ల విష్ణువు రామావతారాన్ని వదలిపెట్టినా వాలిని కొట్టిన పాపం మాత్రం విష్ణువును వదలలేదు.

> **''నేను రామావుతారమున వోలిగొట్టాను**
> **వోలి నేసిన పగలు వద్దనున్నాయి**
> **ఎంత సెక్కెళ్లినా ఎంబడొచ్చేను**
> **ఉట్టుగట్టీ పగలు ఊగుతున్నాయి**
> **నేనిలమీద వోలి పగ లివ్వబోతాను**
> **తండ్రి గొట్టిన పగలు తనయుడాకిద్దును''**

వాలిని గొట్టిన పాపం (పగలు) ఉట్లు గట్టి ఊగుతూ ఉందని ఎక్కడికి వెళ్లినా ఆ పాపం వెంట వస్తూ ఉందని అందువల్ల తండ్రిని కొట్టిన పగ తనయుని కిస్తానని విష్ణువు అనుకున్నాడు.

వాలి కొడుకు అంగదుడు మరుసటి జన్మలో సింహాచలం కొండ ప్రాంతంలో ఒక ఎరుకలివాడుగా

జన్మిస్తాడు. అతడు కష్టపడి అడవి నరికి పోడు వ్యవసాయం చేసి కొర్రపంటను వేస్తాడు. విష్ణువు అతని కొర్ర పైరును నాశనం చేసి తద్వారా అతని ఆగ్రహానికి గురి అయి అతనిచేత బాణం దెబ్బ తినాలని భావిస్తాడు. అలాగే ఒక రోజు రాత్రి పంది రూపంలో వెళ్లి అతని పంటను నాశనం చేస్తాడు. దానికి ఎరుకలివాడు కోపించి తన పంటను నాశనం చేసిన పందిని చంపాలని మరుసటి రోజు రాత్రి చేను దగ్గర మాటువేసి అందులో దాక్కొని చివరకు నిద్రపోతాడు. విష్ణువు రెండవ రోజుగూడా పంది రూపాన్ని ధరించి కొర్ర చేనులోకి ప్రవేశించి దాన్ని పాడుచేసి, వేళ్లేటప్పుడు ఎరుకలవాడిని నిద్ర లేపుతాడు. ఎరుకలవాడు నిద్ర మేల్కొని వెళ్లిపోతున్న పందిని బాణంతో కొడతాడు.

''కుడిపక్క నెరికోడు గురుతు లేసేను
ఎండి ఎముకల సందు నెల్లె బాణములు
బాణ మెల్లిన కాసి బ్రమ్మాండమడిలె
దాని చాయలు ఎలుగు దగదగలాడె
నవురూను కొర్రాను నాడు గక్కేను
పాలూను కొర్రాను పడగక్కె పంది
కుడిపక్క నెరికోడు గురుతులేసితేను
ఎడమ పక్క సిల్లలేరి పడ్డాయి
సీమూను నెత్తురు సిమ్మరిల్లేను
ముకురు గుండల జోడు ముక్కలాయేను
తనయరితి తావలం నెత్తురైనాది
ఎరుకోడేసిన ఏటు ఎరుపూను మంట
నిలలేకపోతాడు నీల యెన్నుండు''

ఎరుకలివాడు వేసిన బాణం పంది కుడిపక్కనుంచి ఎడమవైపుకు దూసుకొని వెళ్లి పోతుంది. ఆ దెబ్బను పంది తట్టుకోలేక పోతుంది. రాముని బాణం దెబ్బకు వాలి ఎంత బాధ పడ్డాడో అంత బాధను పంది అనుభవించింది. పంది అక్కడనుండి మెల్లగా నడుస్తూ మధ్యలో విశ్రాంతి తీసుకుంటూ చివరికి పాతాళ పుట్టలోకి వెళ్లి విశ్రాంతి తీసుకుంటూ ఉంటుంది. తెల్లవారిన తర్వాత ఎరుకలివాడు పంది దెబ్బనుండి కారిన రక్తాన్ని బట్టి పందిని వెదుక్కుంటూ పాతాళ పుట్ట దగ్గరికి వచ్చి పుట్టను తవ్వి లోపలకు ప్రవేశిస్తాడు. అప్పటికి విష్ణువు పంది రూపాన్ని వదలివేసి నిజరూపాన్ని ధరించి ఉంటాడు. తాను బాణంతో కొట్టింది శ్రీ మహావిష్ణువునని తెలుసుకొని ఎరుకలవాడు భయంతో వణకిపోయి క్షమించుమని వేడుకుంటాడు. దానికి విష్ణువు

''అవుదువారే ఎరికోడ అవునంతటోడా
నేను రామావుతారమున మీ తండ్రి వోలిగొట్టాను
వోలి గొట్టిన పగలు నా వద్దనున్నాయి
తండ్రి గొట్టిన పగలు తనయులాకిద్దును
నీవల్ల నేరాలు నేవు ఎరికోడ
జడవకో ఎరికోడ జంకు నీకేల
ఏడవకు ఎరికోడ ఏడవద్దనును''

విష్ణువు ఎరుకలివానిని అలా అనునయించి బాణం దెబ్బ నొప్పికి తట్టుకోలేక, ఆ నొప్పి పోవడానికి ఏ మందు వాడాలో చెప్పమని ఎరుకలవాడిని అడుగుతాడు. దానికి ఎరుకలివాడు

''కుంకంబు కురియేలు కూరిసిన మందు
జాజికాయ జాపత్రి సల్లనా మందు
మంచి గంధముతోని·మాను మీపుండు''

అని చెప్పి తన కేదైనా వరము ఇమ్మని విష్ణువును అడుగుతాడు. అప్పుడు విష్ణువు

''ఓరి పట్టరా ఎరికోడ వరము లిస్తాను
నీకు ఉండ ఇల్లూలేదు వండ పొయ్యీలేదు
దేశ సంచార మాయి నువ్వు తిరగాల
ఏడూర్లు తిరిగినా మూడూర్లు తిరిగినా
మూడు సోలలు నీకు బత్తెమన్నాడు
ఊరి కొక తట్ట లల్లుకొని బతుకు
పెన్న మేసుకు అరిసెలు వండుకోవద్దు
సిలుకు సిమ్మాచలము నువ్వు ఎక్కవద్దు
అప్పన్న పాదాలు మెట్లు లెక్కొద్దు
తొలి మెట్టు కొబ్బరికాయ కొట్టి
ః ‘క తిరిగి ఎళ్లరా ఎరికోడ నువ్వు

అని అంటాడు. ఇది ఎరుకలివానికి వరం కాదు. శాపం. బాణం దెబ్బయొక్క నొప్పికి తట్టుకోలేక విష్ణువు ఎరుకలివాడిని ఒక్కడినే కాకుండా అతని కులాన్ని మొత్తాన్ని శపిస్తాడు. ఎరుకలివాళ్లకు ఉండడానికి ఇల్లు, వంట చేయడానికి పొయ్యి ఉండగూడదని, స్థిర నివాసం లేకుండా వాళ్ల సంచార జీవనం చేయాలని, ఎన్ని ఊర్లు తిరిగినా వారికి మూడు సోలల బత్తెము తప్ప అంతకంటె ఎక్కువ దొరకగూడదని, తట్టలు బుట్టలు అల్లుకొని వాళ్ల బ్రతకాలని పెన్నం

పెట్టి వారు అరిసెలు వండుకోగూడదని, వారు సింహాచలం మెట్లుగూడా ఎక్కవద్దని, ఒక వేళ సింహాచలానికి వారువచ్చినా సింహాచలేశుని దర్శించకుండా మొదటి మెట్టు దగ్గరే కొబ్బరికాయ కొట్టి వెనుకకు తిరిగి వెళ్లిపోవాలని విష్ణువు శపిస్తాడు. తర్వాత విష్ణువు గంగానదిలో స్నానం చేయడానికి కాశీకి వెళ్లి గంగానదిలో స్నానం చేస్తాడు.

ఇతటితో వరాహావతార కథ ముగుస్తుంది. ఇక్కడినుండి సింహాచల దేవళం కట్టుబడి కథ మొదలవుతుంది.

**సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయంలోని కథ :**

విష్ణువు గంగానదిలో స్నానం చేసేటప్పటికి అతని తేజస్సుకు గంగానదిలోని నీళ్లన్నీ ఇంకిపోతాయి. అప్పుడు గంగానది అడుగున ఉన్న కొన్ని స్తంభాలు బయట పడతాయి. వాటిని చూసి విష్ణువు తాను వరాహావతారంతో సింహాచలంలో ఉండడానికి కట్టుకోబోయే దేవాలయానికి ఆ స్తంభాలు బాగా సరిపోతాయని భావించి వాటిని తనకు ఇవ్వమని కోరుతూ కాశీవిశ్వనాథునికి ఉత్తరం రాస్తాడు.

విష్ణువు అభ్యర్థనను కాశీవిశ్వనాథుడు అంగీకరించి స్తంభాలను తీసుకెళ్లమని కబురు పంపిస్తాడు. వెంటనే విష్ణువు నదిలో ఉన్న స్తంభాలను చేత్తో ఎత్తి ఒడ్డుమీద వేస్తాడు. చాలాకాలంగా నీటిలో వుండడంచేత స్తంభాలకు బాగా నాచు పట్టి ఉంటుంది. విష్ణువు పర్వతానికి వెళ్ళివచ్చి ఆకులు తెచ్చి స్తంభాలను తోమి వాటి నాచు తీసివేసి శుభ్రం చేస్తాడు. అప్పుడు విష్ణువు సింహాద్రిమీద తనకు దేవాలయం కట్టగలవారు ఎవరా అని నలువైపులా దివ్యదృష్టితో చూస్తే పడమర దిక్కున 'పత్తివలస' అనే ఊర్లో 'సోల'.వారబ్బాయి బాల కాశీడు కనిపిస్తాడు. ఆ రోజు రాత్రి విష్ణువు బాలకాశీని ఇంటికి వెళ్లి అతనికి కలలో కన్పించి ఇలా చెబుతాడు.

> **''అవుదువోయి బత్తుడా అవునంతటోడా**
> **నేను పాలయుంబుదిలోన పట్టాపు సేనున్ని**
> **ఇష్టుమౌతారాలు ఈడుకున్నాను**
> **ఇష్టుమౌతారాలు సుష్టిలో దిగనాడి**
> **రాజ్యంలో రామావుతారమ్మైనాను**
> **రామావుతారాలు రాజ్యంలో దిగనాడి**
> **వోలుగా వోరావుతారమ్మైనాను**
> **ఎరికి వోడి సేత ఏటుబడ్డాను**
> **వడ్డి కొండలమీద వరనమ్మైనాను**
> **నా కుండడానికి స్థలమ్మైనాలేదు**

స్తానమాడడానికి చోటైనా లేదు
నిలవ నీడలేదు నీల యెన్నుడికి
ఎండలో శరియరము ఎండుతున్నాది
మంచులో శరి యరము మాగుతున్నాది
వానలో శరియరము వొడులుతున్నాధి
తూరుపు దేవళము కట్టరావయ్యా
కాశీలో నున్నాయి గనమైన కంబాలు
కంబాని కెయ్యేసి కట్నమిస్తాను
కట్టున్ని వారికి కలలేమి రాకుండా
మూన్నెల్ల జీతాలు ముందరిస్తాను
మూన్నెళ్ల జీతాలు ముందరేగాకన్న
ఆరునెల్ల జీతాలు వగల మిస్తాను
రానుపోను కూలి ముట్టడిస్తాను
రానుపోను కూలి ముట్టడే గాకుండా
ఏ పూట బత్తాలు ఆ పూట నిత్తాను
సిలుకు సిమ్మాచలము సిమ్మదిరి దేవళము
తూరుపు దేవళము కట్టరమ్మన్నాడు''

మరుసటి రోజు తెల్లవారిన తర్వాత కాశీడు విష్ణువు కలలో కన్పించి సింహాచలం దేవాలయం కట్టడానికి తనను రమ్మన్న విషయాన్ని తన భార్య అయిన సుందరమ్మకు చెబుతాడు. దానికి ఆమె

అక్కడున్నా కూలి ఇక్కడున్నాధి
ఎక్కడ సిమ్మదిరి ఎక్కడ దేవళము
ఎక్కడికి వెళ్లొద్దు అయ్యా కాశీడా

అని చెప్పి చివరకు నీకు చెప్పిన స్వామి నాకుగూడా చెబితే ''పయనములు జేస్తాను పంపించుతాను'' అని అంటుంది.

ఈ విషయాన్ని గ్రహించిన విష్ణువు ఆరోజు రాత్రి కాశీడు భార్యకు గూడా కలలో కనిపించి సింహాచలం దేవాలయాన్ని కట్టడానికి ఆమె భర్తను పంపించుమని చెబుతాడు. ఆమె అందుకు అంగీకరించి దేవాలయాన్ని కట్టడానికి సింహాచలం వెళ్లమని కాశీడుకు చెబుతుంది. కాశీడు పత్తివలసనుండి బయలుదేరి సింహాచలం కొండ దగ్గరికి వస్తాడు. అతనికి అడవి తప్ప ఏమీ కనిపించదు. ఎక్కడికి వెళ్లాలో ఎలా వెళ్లాలో తెలియక కాశీడు దుఃఖిస్తూ ఉంటే విష్ణువు

మానవ రూపంలో వచ్చి కాశీడ్ని కొండమీదకు తీసుకొని వెళ్లి దేవాలయం ఎక్కడ కట్టాలో ఎలా కట్టాలో చెబుతాడు. తర్వాత విష్ణువు కాశీడిని తీసుకొని కాశీకి వెళ్లి అతనికి స్తంభాలను చూపిస్తాడు. కాశీడు విష్ణువు చేతిలోని బెత్తం తీసుకొని గంగానదిలో వేస్తాడు ఆ బెత్తం కాశీనుండి గంగధార వెంట సింహాచలం కొండకు వచ్చి పుట్టుధార దగ్గర బైట పడుతుంది. తర్వాత విష్ణువు కాశీడిని తీసుకొని సింహాచలం కొండకు వచ్చిన తర్వాత అతనితో నువ్వు ఎంత గొప్పవాడివైనా ఒక్కడివే దేవాలయాన్ని కట్టలేవు. నీకు సాయంగా మరికొంతమంది కంసాలీలను తెచ్చుకోమంటాడు. దానికి అంగీకరించి కాశీడు అడవిలోనుండి గంగరేగు మొక్క ఒకటి, అల్లోనేరేడు మొక్క ఒకటి తీసుకొని తన ఊరికి వచ్చి రెండు మొక్కలను తన ఇంటిముందు నాటుతాడు.

మరుసటి రోజు కాశీడు చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న కంసాలి వాళ్లందరికి సింహాచలం దేవాలయం కట్టడానికి రావాలని అలా వచ్చేవారికి మంచి జీతం, బత్తెం ఉంటుందని జాబులు రాస్తాడు. అతని జాబులను చూసి ఆయా గ్రామాల్లో ఉన్న కంసాలి బత్తులు పదివేలమంది బాడితలు, ఉలులు, శానాలు మొదలైన తమ పనిముట్లతో బయలుదేరి పత్తివలసకు వచ్చి కాశీడ్ని కలుసుకుంటారు. మరుసటి రోజు కాశీడు మిగిలిన కంసాలి వాళ్లందరితో కలిసి సింహాచలానికి బయలుదేరుతున్నప్పుడు కాశీడు భార్య అయిన సుందరమ్మ తన భర్తతో ఇలా అంటుంది.

**''అవుదువోయి బత్తుడు అవునంత వాడా**
**తూరుపు దేవళము కట్టనెలతున్నావు**
**నేను మూడు నెల్లాతలము తప్పియున్నాను**
**అన్నెమందురు జనులు పున్నెమందూరు**
**అన్యాయమందురు వాడ జనులెల్ల**
**ఎల్లాచవా జనులెల్ల కల్ల లాడుదురు**
**పుట్టిన బాలయే బాబు ఏడంటేను**
**ఎవరి బాబును నేను చూపేది''.**

తాను మూడు నెల్ల గర్భవతినని, దేవాలయాన్ని కట్టడానికి వెళ్లిన భర్త మళ్లీ తిరిగి ఎప్పుడు వస్తాడోనని, నిజం గ్రహించలేని ప్రజలు తన గర్భాన్ని గురించి నీలాపనిందలు వేయవచ్చునని, పుట్టిన బాల తన తండ్రి ఏడీ అంటే నేను ఎవరిని చూపేది అని ఆమె అంటుంది. దానికి కాశీడు ఇలా అంటాడు.

''తాను ఉండగా ఆమె జనాపవాదానికి భయపడవలసిన అవసరం లేదని, ఆమెకు అమ్మాయి పుడితే తాను ఉంటున్న సింహాచలం కొండమీద పసుపు వర్షం కురుస్తుందని, అబ్బాయి అయితే

వజ్రాల ముత్యాల వాన కురుస్తుందని, అది తనకు ఆనవాలని, బాబు పుట్టి తండ్రి ఏడని అడిగేనాటికి ఆ బాబుకు పండ్రెడు సంవత్సరాల వయస్సు వచ్చి ఉంటుందని, అప్పటికి తాను ఇంటిముందు వేసిన అల్లోనేరేడు చెట్టుకు పళ్లు కాస్తాయని, ఆ పళ్లు కోసి బుట్టలో పోసి కుమారునికిచ్చి సింహాచలంలో జరిగే డోళ్ల పున్నమనాటికి అతణ్ణి కొండమీదకు పంపించమని, కొండమీద ఆ బాలుడు ఒక్కొక్క నేరేడు పండును పండెత్తు బంగారంతో అమ్మమని, అలా అమ్మేవాడు తన కొడుకని తాను గుర్తుపడతానని కాశీడు తన భార్య సుందరమ్మకు చెబుతాడు.'' దానికి ఆమె అంగీకరిస్తుంది.

ఆ తర్వాత కాశీడు తన తోటి పనివాళ్లందరిని తీసుకొని సింహాచలానికి బయలుదేరి సింహాచలం కొండకింద ఉన్న అడవివరం గ్రామానికి చేరుకుంటాడు. అప్పుడు కాశీడు తన తోటి పనివారితో

**''అన్నలారా మీరు ఓ తమ్ములారా**
**ఇక్కడొక్కా పని మనము జెయ్యాల**
**అడివల్లా గొట్టాల కోనేరు తవ్వాల''**

అంటాడు. వెంటనే పదివేలమంది పనివారు అడవిని కొట్టి కోనేరు తవ్వి దానిచుట్టూ గట్టుపోసి మెట్లుగూడా కడతారు. తర్వాత కాశీడు పైడితల్లి గుడి కట్టాలని పనివారితో చెబుతాడు.

పైడితల్లి గుడి కట్టాలని కాశీడు చెప్పగానే పనివారందరూ కొండను తవ్వి మంచి మంచి రాతి పలకలు బయటికి తీసి వాటిని గోడ కట్టడానికి వీలుగా ఉలులతో సాపు చేసి, పునాదులు తవ్వి గుడికట్టి దానిమీద గోపురంకూడా కడతారు. గోపురంమీద పూర్ణకుంభం గూడా అమర్చుతారు. ఆ తర్వాత కాశీడు మంచిరాయి తెప్పించి పైడి తల్లి విగ్రహాన్ని చెక్కి గుడిలో ప్రతిష్టిస్తాడు. ఆ తర్వాత పని వాళ్లందరూ కలసి విఘ్నేశ్వరుడి గుడి, ఆంజనేయ స్వామి గుడి కట్టి ఆ గుళ్లలో ఆయా విగ్రహాలను పతిష్టిస్తారు.

తర్వాత కాశీడు కొండమీదికి మెట్లు కట్టాలని ఇలా చెబుతాడు.

**''అన్నలారా మీరు బత్తులారా**
**ఇక్కడొక్కా పని మనము జెయ్యాల**
**కొండమీది వస్తువులు కిందకే రావాల**
**కిందానున్న వస్తువులు కొండపై కెళ్లాల**
**కిందాకి మీదాకి మెట్లు గట్టాల''**

అతడు చెప్పగానే పనివాళ్లందరూ మెట్లు గట్టడం ప్రారంభిస్తారు.

"ఆ మాటలిన్నారు బాల కాశీలు
పర్వతాని కెళ్లారు పనులు బట్టారు
తవ్వేరు పలకలు దశలు దల్లాడగ
తీసేరు పలకలు దివ్వెసోగుళ్లు
వాటంగా చెక్కారు వ(టించినారు
సాపుగా చెక్కారు సదును జేసేరు
కొండమీదకు మెట్లు కడతనున్నారు
ఇష్టుమౌతారాలు గోడ బారున నిలిపి
అడుగడుగు పావంచలమిరించినారు
మత్స్యావుతారాలు గోడ బారున నిలిపి
అడుగడుగు పావంచల మిరించినారు
కొమ్మలావుతారాలు గోడ బారున నిలిపి
అడుగడుగు పావంచల మిరించినారు
నరిశిమ్మావుతారాలు గోడ బారున్నిలిపి
అడుగడుగు పావంచల మిరించినారు
వామనావుతారాలు గోడ బారున్నిలిపి
అడుగడుగు పావంచల మిరించినారు
పరసారామావుతారాలు గోడ బారున్నిలిపి
అడుగడుగు పావంచల మిరించినారు
రామావుతారాలు గోడ బారున్నిలిపి
అడుగడుగు పావంచల మిరించినారు
వారావుతారాలు గోడ బారున్నిలిపి
అడుగడుగు పావంచల మిరించినారు
కిష్టావుతారాలు గోడ బారున్నిలిపి
అడుగడుగు పావంచల మిరించినారు
కొండమీధకు మెట్లు కడతనున్నారు
ఎయినూరు మెట్టులు కట్టిరావేల"

దశావతారాల బొమ్మలను రాళ్లమీద చెక్కి ఆ శిల్పాలను గోడ పక్కన నిలిపి మెట్లు గట్టారు. తర్వాత కాశీడు కాశీనుండి సింహాచలం కొండకు దోనె (చిన్న కాలువ) త్రవ్వాలని చెబుతాడు. వెంటనే పెద్ద పనివాళ్లందరు కాశీకి కాలువ త్రవ్వడం ప్రారంభిస్తారు. ఆపాటి ఈపాటి పనివాళ్ళు ఆ దోనెకు ఇరువైపుల రాతి పలకలు అమర్చుతారు. చివరకు కాశీవరకు కాలువ త్రవ్వగానే

కాశీనుండి గంగ (నీరు) కొండమీదికి వస్తుంది. అది చూసి గంగ పోతురాజు నీరు రాకుండా కాశీలో అడ్డుకట్ట వేస్తాడు. వచ్చే గంగ ఆగిపోయిందని కాశీడు దుఃఖిస్తూ ఉంటె విష్ణువు దివ్యదృష్టితో చూసి గంగపోతురాజు అడ్డుకట్టవేసినట్లుగా గ్రహిస్తాడు. వెంటనే విష్ణువు కాశీ విశ్వనాధుణ్ణి వేడుకొని అడ్డుకట్ట తొలగించమంటాడు. అప్పుడు కాశీ విశ్వనాధుడు గంగపోతురాజుకు

**''అవుదువో గంగపోతు అవునంతటోడ**
**కాశినుంచా గంగ కొండకెళ్లనియ్యి**
**కోనేరు గట్టునే కొలువాయి యుండు**
**ముందొచ్చె బోగాలు నీకు ఇస్తారు''**

అని చెబుతాడు. వెంటనే గంగపోతురాజు అడ్డుకట్ట తొలగిస్తాడు. కాశినుంచి గంగ కొండ మీదకు వస్తుంది. గంగపోతురాజు అడివివరం కోనేటి గట్టు మీద కొలువై ఉండి సింహాచలాన్ని దర్శించే భక్తుల మ్రొక్కులు ముందుగా అందుకుంటూ ఉంటాడు.

తర్వాత కాశీడు పనివారితో దేవాలయాన్ని కట్టడానికి ముందు పన్నెండు ధారలను ఏర్పాటు చేయాలని చెబుతాడు. వెంటనే పనివారు ఆకాశధార, మాధవధార, పిచ్చిక ధార, హనుమంతుధార, ఆసాపుధార, వంకధార మొదలైన పన్నెండు ధారలను ఏర్పాటు చేస్తారు.

దేవాలయం కట్టాలంటే కాశీలో ఉన్న స్తంభాలను సింహాచలం కొండమీదకు తీసుకొని రావాలి. అందుకోసం చంద్రుడు ఒక దివ్య రథాన్ని పంపిస్తాడు. కాశీడు ఆ రథంమీద కూర్చొని ఆకాశ మార్గంలో కాశీకి వెళ్లి అక్కడున్న స్తంభాలను రథంమీద వేసుకొని మళ్లీ ఆకాశ మార్గంలో అడివివరానికి వస్తాడు. అయితే రథం కొండమీదకు వెళ్లలేదు. స్తంభాలను కొండపైకి ఎలా చేర్చాలో తెలియక కాశీడు దుఃఖిస్తూ ఉంటే విష్ణువు వచ్చి

**''కొండమీద స్తంబు పట్టి మోపేను**
**కొండా కిందాయేను రధము మిదాయె**
**కొండామీదికి రధము ఎల్లిపోయేను''**

ఆ తర్వాత రథంమీద ఉన్న స్తంభాలను పనివాళ్లు దింపి ఒకచోట పెడతారు.

కాశీడు కొండమీద దేవాలయాన్ని కట్టించడానికి వీలుగా కాపులను పిలిపించి అడవిని నరికించి వేస్తాడు. శుక్రుడు వచ్చి శంకుస్థాపన చేయడానికి ముహూర్తం నిర్ణయిస్తాడు. అదేముహూర్తంలో కాశీడు దేవాలయానికి పునాది వేసి పనివారితో

**''అన్నలారా మీరు ఓ తమ్ములారా**
**ఈనులు చెడకన్న నునుపులు రాకన్న**

సింహాచలం దేవాలయం కట్టుబడి కథాగేయం - ఇతివృత్తం

పాతాళ పుట్టకే బాట సెడకన్న
కట్టాల దేవళము కలియుగములోన
ఉండాల కీరితి ఉగములోపలను''

అని అంటాడు. వెంటనే పనివారు దేవాలయం కట్టడానికి పూనుకుంటారు.

గనుగొండ పర్వతముగను లేరుపరచేరు
తవ్వేరు పర్వతము దశలు దల్లాడ
తీసేరు పలకలు దివ్వె సోగుల్లు
వాటంగా చెక్కేరు వ్రటించినారు
సిత్తిరి పట్టేరు సిలుకు రాసేరు
గదులు కొలిసేనారు గాతలే తవ్వేరు
అక్కడక్కడ కుందలమిరించినారు
కుందమీదను పలక లమిరించినారు
సిమ్మదిరి దేవళము మొదలు బెట్టేనారు''

గనుగొండ గనులనుంచి రాళ్లను త్రవ్వి వాటిలో మంచి సోగులను తీసి, వాటిని బాగా ఉలులతో వాటంగా చెక్కి వాటిమీద సిలుకు, అంటె బొమ్మలను గూడా చెక్కారు. వారు చెక్కిన బొమ్మలను జానపద కవి ఇలా వర్ణిస్తాడు.

''ఏమేమి సిలుకులు వరిణించినారు
ఆవులను చూసేరు గోవులను చూసేరు
పలకమీదను సిలుకు పట్టి రాసేరు
సనక సానందులు సుమతి కుమారులు
వారు చూసేనారు బాల కాశీలు
పలకమీదను సిలుకు పట్టి రాసేరు
సురుకోటి దేవతలు సురులు ముప్పైకోట్లు
ఆరు జూసేనారు బాల కాశీలు
పలకమీదను సిలుకు పట్టి రాసేరు
పలకమీదను కుంద పడిగట్టినారు
అక్కడక్కడ పలకలమిరించినారు
సిమ్మదిరి దేవళము కడతనున్నారు

దేవాలయాన్ని కడుతున్న కంసాలీలు ఆవులను, సనక సనందులను, దేవతలను ఊహించి వారి

బొమ్మలను రాళ్లమీదచెక్కి, బొమ్మలున్న ఆ పలకలను గోడలకు అమర్చి సింహ ్రిదేవాలయాన్ని కడుతున్నారు. అంతేగాకుండా వారు గువ్వలను, గువ్వపోతులను, నెమలి పిట్టలను, కారు కోళ్లను, కంజు పిట్టలను, చల్లలమ్ముతున్న స్త్రీలను, నాట్యంచేస్తున్న భోగం స్త్రీలను, నాగస్వరం ఊదుతున్న పాములవాడిని, ఎద్దు నెక్కిన శివుడిని ఊహించి వారి బొమ్మలను రాతి పలకల మీద చెక్కి ఆ పలకలను గోడలకు, కుంద (స్థంభం కట్టడానికి ఉపయోగించే పెద్దరాయి) లకు అమర్చి దేవాలయాన్ని కడుతుంటారు.

ఇలా కడుతూ ఉంటే అడ్డు కలక అమరకపోవడం వల్ల దేవాలయానికి ముగింపు లేక దేవాలయం గోడలు పెరుగుతూ ఉంటాయి.

సిమ్మదిరి దేవుళము కడతనున్నారు
అక్కడొక్కడ్డు పలకమరడం లేదు
సిమ్మదిరి దేవళము పెరుగుతున్నాది
అంత్రపురముల ముట్ట పెరుగు దేవుళము
పసిడి ఓవవనమెక్కి పార్వతీదేవి
సిలుకు సిమ్మాచలము చూడ నొచ్చేను
వారు చూసినారు బాల కాశీలు
పలకమీదను సిలుకు పట్టి రాసేరు
అక్కడక్కడ పలకలమిరించినారు
అక్కడొక్కడ్డు పలకమరడం లేదు
అంత్రపురములు ముట్ట పెరుగుతున్నాది

ఈవిధంగా దేవాలయం ఆకాశాన్ని తాకేటట్లుగా (అంత్రపురములు ముట్ట) పెరుగుతూ ఉంటె కాశీడు తనతోటి పనివారితో ఇలా చెబుతాడు.

అన్నలారా మీరు ఓ తమ్ములారా
సిమ్మదిరి దేవుళము పెరుగుతున్నాది
అక్కడొక్కడ్డు పలకమరడం లేదు
అందాక యీ పనులు ఆపమన్నాడు
పడమటి భాగాన్ని తుంగభద్రల్లోన
జగన్నాదం గుళ్లు కడతనున్నారు
ఆరు కట్టిన రీతి మనము కట్టాల
నే నెల్లి ఆ గుళ్లు చూసి వత్తానని
బయలుదేరినాడు పెద్ద కాశీడు

పడమటి వైపున తుంగభద్రలో జగన్నాధస్వామి గుడి కడుతున్నారని, వారు ఆ గుడిని ఏ విధంగా కడుతున్నారో చూసి వస్తానని చెప్పి కాశీడు సిత్తిరి, సినబాడిత మొదలైన తన పనిముట్లను తీసుకొని పడమటివైపు వెళ్లుతూ ఉంటాడు. అలాగే జగన్నాధ గుడిని కడుతున్న కంసాలిబత్తుడు కూడా గుడిని పూర్తి చేయలేక సింహాచలం దేవాలయాన్ని చూసి రావాలని తూర్పువైపు బయలుదేరుతాడు. కంసాలిబత్తులిద్దరూ మధ్యదారిలో కలుసుకొని ఒకరికొకరు పరిచయం చేసుకుంటారు. మధ్యదారిలో కలుకున్నారు కాబట్టి వారు కలుసుకున్నచోట మద్ది మారమ్మ తల్లికి గుడి కట్టాలని వారు నిర్ణయిస్తారు. అలాగే గుడి కట్టి గుడిలో దేవతను గూడా ప్రతిష్ఠిస్తారు. ఆ తర్వాత సింహాచలం కాశీడు పడమట రాజ్యంలో ఏ పంట పండుతుందని జగన్నాథం కాశీడ్ని అడుగుతాడు. పత్తి బాగా పండుతుందని జగన్నాథం కాశీడు చెబుతాడు. జగన్నాథం కాశీడు తన ఊరికి వెళ్లిన తర్వాత ఆ ప్రాంతంలోని పత్తినంతా పోగుచేసి బళ్లకెత్తి సింహాచలానికి పంపించు మని సింహాచలం కాశీడు చెపుతాడు. అలాగే సింహాచలం ప్రాంతంలో పండే జనుమును తమ ఊరికి పంపించుమని జగన్నాథం కాశీడు సింహాచలం కాశీడుకి చెబుతాడు. ఆ విధంగా వారు మాట్లాడుకొని ఎవరి ఊరికి వారు వెళ్లిపోతారు.

జగన్నాథం కాశీడు తన ఊరికి వెళ్లినవెంటనే బళ్లతో పత్తిని సింహాచలం కొండకు పంపిస్తాడు. ఆ పత్తితో కాశీడు

''చిక్కనా పత్తల్ల గబ్బులేసినాడు
పలుసనా పత్తల్ల పలబరిసినాడు
పత్తిమీదను పలక గద్దించినారు
ఆ మీదనడ్డు పలకమరించినారు
గుడిగట్టి గుడిమీద గోపురము గట్టి
ఆమీద పూర్వకుండమరించినారు
సిమ్మదిరి దేవుళము పూరితయింది

ఆవిధంగా సింహాచలం దేవాలయం పూర్తి అవుతుంది.

అలాగే సింహాచలం కాశీడు తమ ప్రాంతంలో పండే జనుమును పోగుచేసి జగన్నాధం గుడికి పంపిస్తాడు. ఆ జనుముతో జగన్నాథం కాశీడు

అక్కడక్కడ జనుము లమరించినారు
జనుము మీదను పలక పలబరిసినారు
ఆ మీద నడ్డు పలకమరించినారు
గుడిగట్టి గుడిమీద గోపురం గట్టి
ఆ మీద పూర్వకుండమరించినారు

**జగన్నాథం గుళ్లు పూర్తి చేశారు**

సింహాచలం దేవాలయం పూర్తి అయిన తర్వాత తమ జీతాలు ఇవ్వమని మిగిలిన పనివారంతా కాశీదుని అడుగుతారు. కాశీడు విష్ణువును తలచుకోగానే విష్ణువు గాదెల కొద్ది ధనాన్ని కురిపిస్తాడు. ఆ ధనాన్ని పదివేల మంది కంసాలీలు సమానంగా పంచుకొని మూట గట్టుకొని తమలో తాము ఇలా మాట్లాడుకుంటారు.

**ఈ డబ్బుతో మనము ఇంటికెళ్లితే**
**తరము తరముల దాకా బతికిపోతాము**
**కాపోడు లచ్చిమి మనకుండబోదు**
**మనం నాగళ్లు సెయ్యొద్దు నక్కులెయ్యొద్దు**
**కాపోడు కళ్లాల కొడ్డు కెళ్లొద్దు**
**బిడ్డబిడ్డ అంక సరిసాలు నీ దనము**

ఆ డబ్బుతో తాము తరతరాల వరకు ఏ పని చేయకుండా జీవించవచ్చునని, అందువల్ల తమ కులవృత్తి అయిన నాగళ్ల మొదలైన వ్యవసాయ పని ముట్లను చేయడం, కాపువారిని ఆశ్రయించడం మొదలైన పనులు మానివేయాలని కంసాలివారు అనుకుంటారు. వారి అహంకారాన్ని పోగొట్టడానికి విష్ణువు వృద్ధుని రూపంలో వారి వద్దకు వచ్చి తాను పెద్ద కాశీని దగ్గర పనివాడినని కాశీడు తనను పంపించాడని చెప్పి

**కళ్లు లేనివారు కాబోదులుంటారు**
**కల్లేల మండపం కట్టమన్నాడు**
**దిక్కుమాలినవారు దీనులుంటారు**
**జోగల్ల మండపాలు కట్టమన్నాడు**

అని చెబుతాడు. కంసాలివారు కళ్యాణమండపం జోగల్ల మండపం కట్టడానికి ప్రారంభించి పనిచేస్తూ ఉంటె ఉలులు, శానాలు, బాడితలు మొదలైన వారి పని ముట్లన్నీ విరిగిపోతాయి. పనిముట్లను బాగుచేసి మళ్లీ పనికి పూనుకుంటారు. రెండవసారి గూడా పనిముట్లు విరిగి పోతాయి. అప్పుడు కంసాలి వారందరూ కాశీని దగ్గరికి పోయి విషయమంతా అతనికి చెబుతారు. కాశీడు విషయమంతా గ్రహించి సింహాచలేశ్వరుడే వృద్ధుని రూపంలో వారి వద్దకు వచ్చాడని చెప్పి

**అవుదువోయి మాసోమి అవునంతటోడా**
**కల్లేల మండపాలు కట్టించుకో**
**జోగల్ల మండపాలు కట్టించుకో**

సింహాచలం దేవాలయం కట్టుబడి కథాగేయం - ఇతివృత్తం

**ముస్సపురి బంగలాలు కట్టించుకో**
**గుఱ్రాల సావిళ్ళు కట్టించుకోమని**
**అనుకొని కాశీడు పూని సోకించె**

అతని శోకాన్ని విని విష్ణువు మళ్లీ వృద్ధుని రూపంలో వారి వద్దకు వస్తాడు. అతణ్ణి చూడగానే పనివారంతా అతని దగ్గరకు పరిగెత్తుకొని వెళ్లి అతణ్ణి ఎత్తుకొని

**మాకు పనులూ జెప్పు, మా గజ్జితాత**
**మాతోని పని జెయ్యి మా గజ్జి తాత**

అని అంటారు. దానికి వృద్ధుడు

**మీతోని పనిజేస్తే నాకేమి ఇస్తారు**
**మీకు పనులు జెప్పితే నాకేమి వచ్చు**

అంటాడు. దానికి పనివారు తాము పంచుకున్న డబ్బును మూడు భాగాలు చేసి అందులో రెండు భాగాలు వృద్ధునికి ఇస్తామని మిగిలిన ఒక భాగం తాము తీసుకుంటామని చెబుతారు. వెంటనే వృద్ధుడు ఒక ఆకు పసరు తెచ్చి వారి పనిముట్లమీద పిండి పని ప్రారంభించమని చెబుతాడు. పనివారు వెంటనే పని ప్రారంభించి కళ్యాణమండపం, ముసాపూరి బంగళా, జోగాల మండపం, గుఱ్రాల సావిళ్లు కడతారు.

ఈ విధంగా కాశీడు, మిగిలిన కంసాలీలు అందరూ కలిసి సింహాచలం దేవాలయాన్ని మిగిలిన కట్టడాలను కడతారు.

సింహాచలం దేవాలయం పూర్తి అయ్యేటప్పటికి పండ్రెండు సంవత్సరాలు పడుతుంది. అక్కడ పత్తివలసలో కాశీడు భార్య సుందరమ్మకు ఒక కుమారుడు పుట్టి పండ్రెండేళ్ల బాలుడయ్యాక తన తండ్రి ఎవరు? ఎక్కడికెళ్లాడు అని అడుగుతాడు. దానికి సుందరమ్మ అతని తండ్రి అయిన కాశీడు సింహాచలం దేవాలయం కట్టడానికి వెళ్లాడని చెప్పి, తమ ఇంటిముందున్న నేరేడు చెట్టు పళ్లు కోసి బుట్టలో పోసి అతని కిచ్చి వాటిని తీసుకొని సింహాచలం కొండమీద ఒక్కొక్క పండును ఆ పండెత్తు బంగారానికి అమ్మమని

**''పల్లెవరు గొనలేరు పరవతము మీద**
**పల్లెవరు గొంటారు వాడు మీ తండ్రి''**

అని చెబుతుంది.

కాశీడు కుమారుడైన చిన్న కాశీడు తల్లి చెప్పినట్లుగా సింహాచలం కొండమీదికి వెళ్లి ఒక్కొక్క పండు ఖరీదు ఆ పండు ఎత్తు బంగారమని చెబుతూ ఉంటాడు ఈ విషయాన్ని ఇతర

కంసాలీలద్వారా పెద్ద కాశీడు విని, అతడు తప్పనిసరిగా తన కొడుకై ఉంటాడని భావించి, వెంటనే కుమారుని దగ్గరకు వచ్చి అతనిని గుర్తించి ఆనందంతో కౌగలించుకుంటాడు. తర్వాత కాశీడు తాను కట్టిన దేవాలయాన్ని కుమారునికి చూపిస్తాడు. దేవాలయమంతా చూసిన తర్వాత చిన్న కాశీడు తండ్రికి ఒక స్తంభాన్ని చూపించి అందులో ఒక లోపముందని చెబుతాడు. ఆ లోపమేమిటో చెప్పమని తండ్రి అడుగుతాడు. చిన్న కాశీడు ఉలితో ఆ స్తంభాన్ని చెక్కుతాడు. వెంటనే అందులో నుండి ఒక కప్ప బయటికి వస్తుంది. అప్పటినుండి దానికి కప్పస్తంభమనే పేరు వస్తుంది. తర్వాత చిన్న కాశీడు తండ్రితో దేవాలయ సింహద్వారం తూర్పుకు ఉన్నదని, అలా సింహద్వారం తూర్పుకు ఉండగూడదని, ఆ ద్వారాన్ని పడమటి దిక్కుకు తిప్పాలని చెబుతాడు. ఇంత పెద్ద దేవాలయాన్ని ఎవరు ఏ విధంగా తిప్పుతారు అని పెద్ద కాశీడు అడుగుతాడు. నీ దయవుంటె నేనే తిప్పుతానని చిన్న కాశీడు తండ్రికి చెప్పి దేవలోకంవైపు చూసేటప్పటికి సూర్యుడు అతనికోసం ఒక రథాన్ని పంపిస్తాడు. దేవాలయాన్ని ఆ రథానికి కట్టి గుర్రాలను అదిలించేటప్పటికి దేవాలయం పునాదులతో సహా కదులుతుంది. అప్పుడు చిన్న కాశీడు తండ్రితో

**బాబురా ఒరే బాబు తండ్రీ కాశీడా**
**నువు గట్టిన దేవుళం మా తల్లి జూడాల**
**పత్తివలసల్లోకి పట్టుకెళతాను**

అని అంటాడు. పెద్ద కాశీడు ఆ మాటలను విని తాను కష్టపడి కట్టిన దేవాలయాన్ని తన కొడుకు నాశనం చేస్తాడని భావించి కత్తి తీసుకొని మొదట రథానికి కట్టి గుర్రాలను పొడిచి రథంమీద ఉన్న తన కుమారుని అందుకుని

**నువ్వు పత్తివలసల్లుంతె బతికి పోదుపు కొడుకా**
**నీకు నాకిది రునము బాల చిన్నయ్యని**

చెప్పి కత్తితో అతణ్ణి నరికి చంపుతాడు. ప్రజలు తనను కొడుకును చంపిన పాపాత్ముడని దూషిస్తారని కత్తితో తాను గూడా పొడుచుకుంటాడు. ఈ సంఘటన చూసి విష్ణువు

**ఎంతపని చేశావు అయ్యొ కాశీడా**
**నీకు వైకుంట మిద్దునని అనుకున్నాను**

అని అంటాడు దానికి కాశీడు విష్ణువుతో

**వైకుంటము నాకొద్దు వరము నాకొద్దు**
**నీ పక్క సోటియ్యి నీల యెన్నుండా**

అని అంటాడు. విష్ణువు అతనికి గుడి దర్వాజా వెనుక స్థానాన్ని ఇస్తాడు.

**తండ్రీని కొడుకూను పెనపేగు లేసుకొని**
**గుడి దరవాజ కెనక నున్నారు**
**అప్పన్న పంచనే అమరియున్నారు**

కాశీడు అతని కుమారుడు చనిపోయిన తర్వాత సింహాచలం దేవాలయాన్ని కట్టడానికి వచ్చిన కంసాలీలందరూ కలిసి కాశీడు ఉండే ఇంటికి వెళ్లి తాళాలు పగుల గొట్టి వారి భాగానికి వచ్చిన ధనాన్నే గాకుండా కాశీడు భాగానికి వచ్చిన ధనాన్ని కూడా తీసుకొని, అందరూ సమానంగా పంచుకొని మూటలు కట్టి తలమీద పెట్టుకొని వారి గ్రామాలకు బయలుదేరి అమిత సంతోషంతో పాటలు పాడుతూ, కేకలు వేస్తూ కొండదిగి వస్తూ ఇలా మాట్లాడుకుంటారు.

**ఈ దనము పట్టుకొని మన ఇళ్ల కెలితేను**
**తరము తరములదాకా బతికి పోతాము**
**కాపోడి లచ్చిమి మనకుండబోదు**
**నాగళ్ల చెక్కొద్దు నక్కులెయ్యొద్దు**
**కాపోడి కల్లాల కొద్దు కెళ్లొద్దు**
**కాపోడి నచ్చిమి మన కుండబోదు**

వారి మాటలను సింహాచలేశ్వరుడు విని దేవాలయాన్ని కట్టినందుకు మీకు తగినంత ధనాన్ని లెక్కకట్టి ఇచ్చాను. ఎక్కువ ధనాన్ని చూడగానే మీరు గర్వంతో విర్రవీగి కులవృత్తిని మానివేయాలని చూస్తున్నారు. కంసాలి వృత్తి మీరు చేయకపోతే వ్యవసాయం సాగదు అని చెప్పి కంసాలీల ధనాన్ని దోపిడి చేయడానికి మాయ దొంగలను పంపిస్తాడు. దొంగలు వచ్చి వారి ధనమంతా దోచుకొని వెళ్లిపోతారు. పండ్రెండు సంవత్సరాలు కష్టపడి సంపాదించిన ధనం దొంగల పాలైనందుకు కంసాలీలు ధుఃఖించి ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లలేక ఆత్మహత్య చేసుకొని చనిపోవాలనుకుంటారు. వెంటనే విష్ణువు మనిషి రూపంలో వచ్చి

**సచ్చిపోయి మనము ఏమి సాదిస్తాము**
**ఈ దనము ఎవ్వరిది ఈ బలము ఎవ్వరిది**
**దనమూను బలము కావిడీ కొమ్ములు**
**మీరు దనము కోసం పానమెడతారా**

అని వారికి నచ్చజెప్పి ఆత్మహత్యా ప్రయత్నం నుండి వారిని విరమింపజేసి చుట్టుపక్కల ఉన్న ఊర్ల నాయుళ్లను (మున్సబులను) పిలిపించి ఒక్కొక్క ఊరికి ఒక్కొక్క కంసాలిని కేటాయించి కులవృత్తిని చేసుకొని బ్రతుకుమని వారికి చెప్పి పంపిస్తాడు. చివరకు ఒక కంసాలి మిగిలిపోతాడు. విష్ణువు అతనితో

సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం - ఇతివృత్తం

సిమ్మాచలం చూసుకొని నువ్వు ఉండాల
రాయిబోయిన సోట రాయి పెట్టాల
ముక్క బోయిన కాడ ముక్క లెట్టాల
దేవుళము చూసుకొని నువ్వుండిపోవాల

అని చెప్పి మాయమై తన కంచు దేవాలయానికి వెళ్లిపోతాడు.

ఇంతటితో ఈ కథ పూర్తి అవుతుంది. ఇది ప్రధాన గేయంలోని కథ. కథలో కొన్నిచోట్ల కొంతమంది దాసులు మరొక విధంగా పాడుతారు. ఈ పాఠాంతరం ప్రధానంగా రెండు చోట్ల ఉంది.

1 సింహాచలం దేవాలయం శంకుస్థాపన ముహూర్తం నిర్ణయించడానికి శుక్రుడువచ్చినట్లుగా ప్రధానగేయంలో ఉంది పాఠాంతరంలో ముహూర్తం పెట్టడానికి బ్రహ్మదేవుడు వచ్చినట్లుగా ఉంది. అయితే బ్రహ్మదేవుడు దేవాలయ శంకుస్థాపనకు గాకుండా ధ్వజస్తంభం నిలబెట్టడానికి ముహూర్తం నిర్ణయించినట్లుగా ఇందులో ఉంది. అంతేగాకుండా ముహూర్త సమయంలో విష్ణువు, ఈశ్వరుడు, బ్రహ్మ ముగ్గురూ వచ్చి ధ్వజ స్తంభాన్ని తాకగానే దానంతట అదే నిలబడినట్లుగా ఇందులో ఉంది.

**''జయ్‌మని కంబాము జే కొట్టసాగె**
**జే కొట్టి కంబము తిన్నగా నిలిచె''**

2. సింహాచలం దేవాలయాన్ని కడుతున్నప్పుడు అడ్డుపలక అమరకపోవడం వల్ల దేవాలయం పెరిగిపోతూ ఉందని, అందువల్ల అది పూర్తి కాలేదని ప్రధానగేయంలో ఉంది. పాఠాంతరంలో దేవాలయాన్ని కట్టి దాని మీద సిగిలమెత్తి, ఆ మీద పూర్వకుండ ఎత్తితే అది అమరడం లేదని ఉంది.

వన గూర్చి దేవుళము కడత నున్నారు
గుడిగట్టి గుడిమీద సిగిలి మెత్తేరు
ఆ మీద బంగారి పూర్వ కుండెత్తితే
ఆ మీద పూర్వకుండమరకున్నాది

ఇలా పాడేవారు చివర పత్తిని పెట్టి పూర్వకుండ అమర్చినట్లుగా పాడుతారు.

సిలుకు సిమ్మాచలము సిమ్మదిరి దేవుళము
వనగూర్చి దేవళము కడతనున్నారు
గుడిగట్టి గుడిమీద సిగిల మెత్తారు
ఆ మీద పూర్వకుండ మరించినారు.

# సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం - విశేషాలు

సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం సులభ శైలిలో విశాఖ మాండలిక భాషలో ఉంది. ఈ గేయం కథను చెప్పడమే ప్రధానంగా రచింపబడింది. అందువల్ల ఇందులో కవిత్వాంశ తక్కువ అయినప్పటికి కథ కొత్తది కాబట్టి ఈ గేయాన్ని చదవడం వల్ల గూడా ఆనందాన్ని పొందవచ్చు. గానం చేసేటప్పుడు శ్రోతకు మరింత ఆనందాన్ని ఇది కలిగిస్తుంది. ఇందులో కొన్ని వర్ణనలున్నాయి. ఇవి కథాగతికి ఏ మాత్రం అడ్డుగా లేవు. ఇందులో జానపద మనస్తత్వం, జానపద వాతావరణం, అద్భుత సంఘటనలు, వారానువర్తనాలు మొదలైన విశేషాలున్నాయి

**జానపద వాతావరణం** : సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం వరాహావతార కథకు అనుబంధంగా ఉంది వరాహావతార కథ విష్ణువు రామావతారాన్ని వదలివేసిన తర్వాత జరిగిన కథ. అంటె ఈ కథ త్రేతాయుగం చివరగాని, ద్వాపరయుగం ప్రారంభంలో గాని జరిగినట్లుగా ఈ కథాగేయాన్ని బట్టి తెలుస్తూంది. కాబట్టి ఈ కథ పౌరాణిక కాలానికి సంబంధించిందన్నమాట. కాని ఈ కథా గేయంలో పౌరాణిక వాతావరణం ఏ మాత్రం కన్పించదు. పూర్తిగా జానపద వాతావరణమే ఇందులో వివరింపబడింది. ఈ కథాగేయంలో సింహాచలం కొండ, దానిపరిసరాలు, ఆ కొండ మీద ఉన్న చిన్న నీటి ప్రవాహాలు, దేవాలయాలు, చుట్టు ప్రక్కల ఉన్న అడివివరం, వేపగుంట, పినగాడి, పెదగాడి, పేరికల, పెదనరవ, పురషొదపాలెం, పులగాలిపాలెం, పత్తినలస మొదలైన ఊర్లు వివరింపబడ్డాయి.

సింహాచలం దేవాలయాన్ని కట్టిన పెద్ద కాశీడు పత్తివలస గ్రామస్తుడు. మిగిలిన పనివాళ్లందరూ పైన చెప్పిన మిగిలిన గ్రామాలకు చెందినవారు. అడివివరం, సింహాచలం కొండ కింద ఉన్న గ్రామం కంసాలీలందరూ కలిసి ఈ గ్రామంలో కోనేరును త్రవ్వినట్లు, కోనేటి గట్టుమీద పైడితల్లి గుడిని కట్టినట్లు, కొండపైకి వెళ్లడానికి మెట్లు, కొండమీద దేవాలయం, కళ్యాణమండపం, గుర్రాల సావిళ్ల మొదలైన వాటిని కట్టినట్లు ఈ గేయంలో చెప్పబడింది. ఇవన్నీ అంతకుముందున్నవే. కంసాలీలు వీటన్నింటిని కట్టినట్లుగా ఈగేయంలో కల్పింపబడింది. ఈ గేయంలో అయిదు అద్భుత సంఘటనలు తప్ప మిగిలినదంతా జానపద వాతావరణమే.

**జానపద మనస్తత్వ చిత్రణ** : జానపద కవులు తాము రాసే పౌరాణిక కథాగేయాల్లోని పౌరాణిక పాత్రలకు తమ జానపద మనస్తత్వాన్ని ఆపాదించి, ఆ పాత్రలు సామాన్య జానపదునిలాగా ప్రవర్తించినట్లుగా రాస్తారు దీన్నే జానపద మనస్తత్వ చిత్రణ అంటారు. జానపద సాహిత్య లక్షణాల్లో ఇది ఒకటి.

ఈ కథాగేయంలో శ్రీ మహావిష్ణువు సామాన్య మానవునిలాగా కాశీకి వెళ్లి పళ్లుతోమే

సింహాచలం దేవాలయం కట్టుబడి కథాగేయం - విశేషాలు

పుల్లతోపళ్ళు తోమి, నాలుక గీసి, గంగానదిలో తనివితీరా స్నానం చేసినట్లుగా ఇలా చెప్పబడింది.

కాశీలో నొకపక్క సేరు పయినాడు
ఉత్రాసి పుల్లొకటి ఉరికించి నాగాడు
కొనగోల నా పుల్ల కొసలు బద్దించి
దంతాని కాపుల్ల దాగలిపినాడు
ముత్యాల రాయెక్కి ముని పళ్లు దోమె
నల్లరాయిల మీద నాలికలు గీసె
ముంతడా నీళ్లతో మునిముకము గడిగె
చారెడు నీళ్లతో చెయి జబ్బ గడిగె
కాలు సేతులు గడిగె నీల యెన్నుండు
కాశీలో కెళ్లేను నీలయెన్నుండు
పుష్టుగా తానాలు చేసె నాసోమి
ఉత్రాసి కాశిలో ఓలలాడీనాడు

విష్ణువు తనకు నిలువ నీడ లేదని, అందువల్ల సింహాచలంలో దేవాలయం కట్టుకోవడానికి కాశీలో ఉన్న స్తంభాలను ఇవ్వాలని కాశీ విశ్వనాధునికి సామాన్య మానవునిలాగా ఇలా ఉత్తరం రాసినట్లుగా ఈ కథాగేయంలో ఉంది

అన్నరో మాయన్న అన్న ఇశ్వనాదుడా
దయసేసి కంబాలు సెలవు మనివిస్తేను
సిలుకు సిమ్మాచలం కట్టుకుంటాను
ఎరుకులోడిచేత ఏటు బడ్డానన్న
ఒళ్లల్ల ఎరుపూను మంటలవుతాయి
ఎండలో శరియరము ఎండుతున్నాది
మంచులో శరియరము మాగుతున్నాది
వానలో శరియరము వొడులు తున్నాది
నిలవ నీడలేదు నీలయెన్నుడి కన్న
దయచేసి కంబాలు సెలవు మాకిమ్ము

తర్వాత విష్ణువు గంగా నదిలో ఉన్న స్థంభాలను పైకి తీసి వాటిమీద ఉన్న నాచును సామాన్య జానపదునిలాగా శుభ్రం చేస్తాడు.

ఈ విధంగా శ్రీ మహావిష్ణువు కూడా సామాన్య జానపదునిలాగా ప్రవర్తించినట్లు ఈ కథా

గేయంలో చెప్పబడింది.

కంసాలీలందరు సింహాచలం కొండకు, కాశీకి దోనులు తవ్వగా ఆ దోనె వెంట గంగానదిలోని నీరు కొండమీదికి వస్తుంది దాన్ని చూసి గంగపోతురాజు కొడమీదికి నీరు రాకుండా కాశీలో అడ్డుకట్ట వేస్తాడు. అప్పుడు విష్ణువు గంగపోతురాజు వేసిన అడ్డుకట్టును తొలగించమని కాశీవిశ్వేశ్వరుని వేడుకుంటాడు. విశ్వేశ్వరుని ఆజ్ఞననుసరించి గంగపోతురాజు అడ్డుకట్ట తీసివేస్తాడు. ఈ సంఘటనలో గంగపోతురాజు కుళ్లబోతు మనస్తత్వమున్న జానపదుని లాగా చిత్రింపబడ్డాడు.

**అద్భుత సంఘటనలు :** జానపదులకు అద్భుత రసాభినివేశం ఎక్కువ. ఆశ్చర్యకరమైన సంఘటనలుఎంత ఎక్కువగా ఉంటే వారు అంతగా ఆనందిస్తారు. జానపద కవులు జానపదుల ఈ అభిరుచిని గమనించి తమ రచనల్లో అద్భుత రస సన్నివేశాలను కల్పిస్తూ ఉంటారు.

సింహాచల దేవళం కట్టుబడి కథాగేయంలో అద్భుత సంఘటనలు ఐదు ఉన్నాయి. ఈ అద్భుత సంఘటనలన్నీ అకస్మాత్తుగా ప్రారంభమవుతాయి.

**1. కాశీడు గంగానదిలో వేసిన బెత్తం, నిమ్మపండు సింహాచలం కొండమీదకు రావడం .**

దేవాలయాన్ని కట్టడానికి సింహాచలానికి వచ్చిన కాశీడిని తీసుకొని విష్ణువు కాశీకి వెళ్లి గంగానదిలో ఉన్న స్తంభాలను చూపిస్తాడు. అప్పుడు కాశీడు మొదట విష్ణువు చేతిలో ఉన్న బెత్తాన్ని, ఆ తర్వాత ఒక గజ నిమ్మపండును తీసుకొని గంగానదిలో వేస్తాడు. అవి రెండు ఎంతో ఆశ్చర్యంగా సింహాచలం కొండకు వచ్చి పుట్టుధార దగ్గర బయట పడతాయి. ఆ రెండింటిని దేవతలు తీసి విష్ణువుకు ఇస్తారు.

**సోమి దగ్గర ఉంది ఇల నాగబెత్తాము**
**సోమి దగ్గర బెత్తు కాశీడు దీసికొని**
**కాశీలో నా బెత్తు ఏసినాడాయేళ**
**కాశీలేసిన బెత్తు కొండ కొచ్చింది**
**పుట్టుదారల కాడ పుట్టుబడ్డాది**
**పైకుంట దేవితులు బెత్తు దీసేరు**
**ఆదియిష్ణుకు బెత్తు లందించినారు**
**అప్పుడేమన్నాడు బాల కాశీడు**
**కాశీలో గజనిమ్మపండేసినాడు**
**కాశీలేసిన పండు కొండ కొచ్చింది**
**ఫైకుంట దేవతలు పండుదీసేరు**

**ఆదియిష్ణుకు పండు లందించినారు**

**2. కాశీడు ఆకాశ మార్గంలో రథంమీద కాశీనుండి స్తంభాలను సింహాచలానికి తీసుకొని రావడం :** సింహాచలంలో కట్టే దేవాలయానికి అవసరమైన స్తంభాలను కాశీనుండి తీసుకొని రావడానికి చంద్రుడు కాశీడికి తన రథాన్ని ఇస్తాడు. కాశీడు ఆ రథంమీద ఆకాశ మార్గంలో కాశీకి వెళ్లి అక్కడ ఉన్న స్తంభాలను రథంమీద వేసుకొని ఆకాశ మార్గంలో సింహాచలం కొండకిందికి వస్తాడు. కొండ ఎత్తుగా ఉండడంవల్ల కొండమీదికి రథం వెళ్లలేదు. అప్పుడు కాశీడు విష్ణువును తలచుకోగానే విష్ణువు వచ్చి కొండమీద చెయ్యి మోపగానే ఎంతో ఆశ్చర్యంగా

**కొండ కిందాయేను రథము మీదాయె**
**కొండామీదకు రథము ఎళ్లిపోయి**

నట్లుగా ఈ కథాగేయంలో చెప్పబడింది.

**3. త్రిమూర్తులు ధ్వజ స్థంభాన్ని తాకగానే స్తంభం తనకుతానే నిలబడడం :** సింహాచలం దేవాలయంఎదురుగా ధ్వజస్తంభాన్ని నిలబెట్టడానికి బ్రహ్మ ఒక సుముహూర్తాన్ని నిర్ణయిస్తాడు. ఆ ముహూర్త సమయంలో త్రిమూర్తులు ఆ స్తంభంమీద చేతులు పెట్టగానే అది ''జయ్'' మని శబ్దం చేస్తూ తనకు తానే నిలబడుతుంది.

**4. స్తంభంలో కప్ప ఉండడం :** కాశీడు కొడుకైన చిన్న కాశీడు తన తండ్రిని చూడడానికి సింహాచలం కొండకు వస్తాడు. కాశీడు తాను కట్టిన సింహాచలం దేవాలయాన్ని ఎంతో గర్వంగా తన కుమారునికి చూపిస్తాడు. అంతా చూసిన తర్వాత చిన్న కాశీడు ఒక స్తంభాన్ని తండ్రికి చూపించి ఇందులో లోపముందని చెప్పి ఉలితో ఆ స్తంభాన్ని ఒక చోట చెక్కగానే ఆశ్చర్యంగా అక్కడస్త ంభంలోనుండి ఒక కప్ప బయటికి వస్తుంది. అప్పటినుండి ఆ స్తంభానికి 'కప్ప స్తంభ' మని పేరు వస్తుంది.

**5. చిన్న కాశీడు దేవాలయాన్ని తిప్పడం:** స్తంభంలో ఉన్న లోపాన్ని చెప్పిన తర్వాత చిన్న కాశీడు తండ్రితో దేవాలయం సింహద్వారం తూర్పువైపు ఉందని, సింహద్వారం అలా తూర్పువైపు ఉండగూడదని, కాబట్టి దేవాలయ ద్వారం పడమర దిశకు వచ్చేలాగ దేవాలయాన్ని తిప్పాలని చెబుతాడు. ఇంత పెద్ద దేవాలయాన్ని ఎవరు, ఎలా తిప్పుతారు అని కాశీడు అడుగుతాడు. నీ దయ ఉంటె నేనే తిప్పుతానని చిన్న కాశీడు తండ్రికి చెప్పి ఆకాశం వైపు చూడగానే సూర్యుడు ఆశ్చర్యంగా ఒక రథం పంపిస్తాడు. చిన్న కాశీడు దేవాలయాన్ని ఆ రథానికి కట్టి గుర్రాలను తోలగానే ''పెలపెలమని దేవుళము పెల్లగిల్లింది'' అప్పుడు చిన్న కాశీడు తండ్రితో ఈ దేవాలయాన్ని పత్తివలసకు తీసుకొని వెళ్లి తన తల్లికి చూపించి వస్తానని చెబుతాడు. వెంటనే పెద్ద కాశీడు తన కొడకు దేవాలయాన్ని పడగొట్టి నాశనం చేస్తాడని భావించి చిన్న కాశీడిని

కత్తితో నరికి చంపివేసి తానుగూడా అదే కత్తితో పొడుచుకొని మరణిస్తాడు.

**వారాను వర్తనాలు** : శిష్ట సాహిత్యంలో కవి సమయాలలాగా కథాగేయాల్లో గూడా కొన్ని పడికట్టు వర్ణనలు పదేపదే వస్తూ ఉంటాయి. వీటినే ఇంగ్లీషులో Ballad Common Places అంటారు ఈ వారాను వర్తనాల కారణంగానే గాథాకారులు ఎన్నో కథాగేయాలను గుర్తుంచుకోగలుగుతున్నారు. సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయంలో గూడా కొన్ని వారాను వర్తనాలున్నాయి. ఈ వారాను వర్తనాలు ఈ కథాగేయంలోను మిగిలిన దశావతార కథల్లోను ఒకేవిధంగా ఉంటాయి.

**1. ముహూర్త నిర్ణయం** : ముహూర్త నిర్ణయం ఈ కథాగేయంలో ఎన్నిసార్లు వచ్చిన ఇలా ఉంటుంది.

> నవగుణములు చూసి నచ్చంత్రమెంచి
> దశిమి దశిమినాడు ద్వాదశిమి నాడు
> సుక్కురోరమునాడు సక్కన్ని రోజు
> మంచిదొక మూరతన ఎంచి పడికట్టి

**2. గుడి నిర్మాణ వర్ణన** : ఈ కథాగేయంలో పైడితల్లి, ఆంజనేయస్వామి, వినాయకుడు మొదలైన దేవతల గుడులను కంసాలీలు కట్టినట్లుగా చెప్పబడింది. ఈ గుడి నిర్మాణ వర్ణన అన్నిచోట్ల ఒకేలా ఉంది.

> పదివేలు కాశీలు పనులు బట్టారు
> పర్వతానికి ఎళ్లి పట్టి దవ్వారు
> తవ్వేరు పర్వతము దశలు దల్లాడ
> తీసేరు పలకలను దివ్వె సోగులను
> వాటంగా చెక్కేరు వట్రించినారు
> గదులు కొలిచినారు గాతలే దవ్వేరు
> కుందమీదను కుంద కుదురుగేసీనారు
> కుందమీదన పలక బలపరిసినారు
> అక్కడక్కడ పలకలమిరించినారు
> ఇగ్లునేశుడి గుళ్లు కడతనున్నారు
> గుడిగట్టి గుడిపైన గోపురాలెట్టేరు
> ఆమీద పూర్వకుండమరించీనారు

**3. రాత్రి వర్ణన :**

ఈ కథాగేయంలో రాత్రివర్ణన ఈ విధంగా ఉంది

> **అర్ధరాతిరి యేల నిద్దారి పొద్దున**
> **పసిబిడ్డ తల్లులు పాలు మరసిన యేల**
> **పెద్దపెద్ద బూతాలు మాటుగాసిన యేల**
> **రుచ్చాలు రుచ్చాలు రాపులాడిన యేల**

**4. వేకువ వర్ణన :**

తెల్లవారడాన్ని సింహాచలం కట్టుబడి కథాగేయం ఇలా వివరిస్తుంది.

> **ఊరి కోళ్ళేగూసె ఉదియ తెల్లోరె**
> **మారు కోళ్లే గూసె మంద తెల్లోరె**
> **బలబలా తెల్లారి బమ్మ నాదాయె**
> **తెల్లగా తెల్లారి చల్లగాలూరె**

**5. దంత ప్రక్షాళన వర్ణన :**

ఈ కథాగేయంలో పాత్రలు ఉదయమే లేచి ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు గాని, ఏదైన పని చేయబోతున్నప్పుడుగాని పళ్లు తోముకున్నట్లుగా చెప్పబడుతుంది. ఈ దంత ప్రక్షాళన వర్ణన ఈ గేయంలో రెండుసార్లు ఉంది. రెండుసార్లు ఒకే విధంగా ఇలా ఉంది.

> **ఉత్రాసి పుల్లోకటి ఉరికించినాగాడు**
> **కొనగోలనా పుల్ల కొసలు బద్దించి**
> **దంతాని కాపుల్ల దాగలిపినాడు**
> **ముత్యాల రాయెక్కి మునుపళ్లు దోమె**
> **నల్ల రాయిలమీద నాలికలు గీసె**

**6. అన్నం వర్ణన :**

ఈ కథాగేయంలో భోజన వర్ణన ఇలా ఉంటుంది

> **పంచపరమాన్నాలు వండె నావేళ**
> **పప్పుతో పన్నెండు కూర లొడ్డించె**
> **చుట్టు దిరిగి కూరలు చుక్కలనెబోలు**
> **పెడు టన్నములు చంద్రుని బోలు**

**7. రథం బయలు దేరడం :**

ఈ కథాగేయంలో రథం బయలుదేరే వర్ణన ఒకేలాగా ఇలా ఉంటుంది.

ఎంచి పూసీనాడు ఎల్లటశ్వాల్నీ
పసిడి తుమ్మెదలాంటి పచ్చటశ్వాల్నీ
ఎత్తి పూసీనాడు ఎండి గొలుసులని
పట్టి పూసీనాడు పైడి గొలుసులని
ముత్యాల కొరడాలు మునియేల నంది
గిరగిరని కొరడాలు బిరబిరని దిప్పి
రెచ్చగొట్టశ్వాల్నీ రెచ్చదోలేను

**8. ప్రయాణ వర్ణన :**

ఈ కథాగేయంలో ప్రయాణమై వెళ్లడాన్ని

ఉల్లి తోటలు దాటి ఊళ్లన్నీ దాటి
పసుపు తోటలు దాటి పల్లెలే దాటి
చెరకు తోటలు దాటి చేలన్నీ దాటి''

అని చెప్పబడింది.

అంతేగాకుండా ఈ కథాగేయంలో విష్ణువు గురించి 'నీలయెన్నుండు', లేక 'నీల యెల్లుండు' అని 'శెంకుశెక్కారాల దాశావతారుడు' అని 'ఎయ్యిమాయల వోడు ఏలయినివోదు' అని చెప్పబడింది. సింహాచలం దేవాలయాన్ని 'సిలుకు సిమ్మాచలము సిమ్మదిరి దేవళము తూరుపు దేవుళము'' అని, దివ్యదృష్టితో చూడడాన్ని ''దివ్వెగేనం బట్టి దీష్టించి జూసితే''అని, ఎక్కువసంతోషించడాన్ని ''అతియు సంతోషించి ఆనందుడాయె'' అని చెప్పబడింది.

అంతేగాకుండా సింహాచలం దేవాలయాన్ని కట్టిన కాశీడికి ఏదైనా సమస్య వచ్చి దుఃఖించడాన్ని ''ఆనుకొని కాశీడు పూని శోకించె'' అని ఏమి తెలియని అమాయకులము అని చెప్పడాన్ని ''అన్నాయ మెరుగము అచ్చాయ పరులము'' అని ఈ కథాగేయంలో చెప్పబడింది.

ఈ విధంగా సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయంలో వారాను వర్ణనాలు వివరింపబడ్డాయి.

**రసం :** సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయంలో వీరం ప్రధాన రసం కాబట్టి దీన్ని వీరగాథ అనవచ్చు. ఇందులో విష్ణువు కోరిక ననుసరించి పెద్ద కాశీడు, మిగిలిన కంసాలీలందరితో కలిసి ఎంతో ఉత్సాహంతో పట్టుదలతో అడివివరంలోని చెరువును, చెరువు గట్టుమీద పైడితల్లి గుడిని, విఘ్నేశ్వరుని గుడిని, కిందినుండి కొండపైకి మెట్లను కొండమీదనుండి కాశీకి దోనెలను, కొండమీద ఉన్న ప్రధాన దేవాలయాన్ని, కళ్యాణ మండపం, గుర్రాల సావిళ్ల మెదలైన వాటిని కట్టినట్లుగా చెప్పబడింది. కాబట్టి వీరం ఇందులో ప్రధాన రసమని చెప్పవచ్చు.

కాని చివర పెద్ద కాశీడు తన కుమారుని చంపి, తాను పొడుచుకొని ఆత్మహత్య చేసుకోవడం

సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం - విశేషాలు

వీర రసాభాసాన్ని తెలియజేస్తూ ఉంది

**నీతి** : ఈ కథాగేయం చివర తండ్రీకొడుకులైన పెద్ద కాశీడు, చిన్న కాశీడుల మరణం చెప్పబడింది కాబట్టి ఇది విషాదాంతం తండ్రీకొడుకుల ఈ మరణ సంఘటన, విధి బలీయమైంది, మానవుడు నిమిత్తమాత్రుడనే నీతిని తెలుపుతూ ఉంది పెద్ద కాశీడు చనిపోయిన తర్వాత మిగిలిన కంసాలీలు ధనమంతా తీసుకొని, ధన గర్వంతో తాము కష్టపడి కులవృత్తిని చేయడం మానివేయాలనుకోవడం, విష్ణువు వారి గర్వాన్ని పోగొట్టడానికి మాయ దొంగలను పంపించి వారి ధనమంతా కొల్లగొట్టించడం జరుగుతుంది. ఈ సంఘటన ''నడమంత్రపు సిరి నరంమీది పుండు మననివ్వదు'' అనే సామెతను ఋజువు చేస్తూంది. ఎవరికైనా ధనగర్వం కూడదని, అలా గర్వించేవారు పతనమౌతారనే నీతిని గూడా ఇది తెలియజేస్తుంది.

**కొత్త పదాలు** : జానపదుల వాడుకలో కొన్ని నూతన పదాలు ఉంటాయి ఈ పదాలుగాని, వాటికి అర్థాలుగాని నిఘంటువుల్లో ఉండవు. సందర్భాన్ని బట్టి ఈ పదాలకు అర్థాలు చెప్పుకోవలసి ఉంటుంది. కొన్ని పదాలకు అర్థాలు చెప్పలేము. ఇలాంటి వాటిలో కొన్నింటికి ఆయా గాథాకారులు చెప్పగలరు. మరికొన్ని పదాలకు వారు గూడా అర్థాలు చెప్పలేరు.

ఇలాంటి నూతనపదాలు సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయంలో గూడా కొన్ని ఉన్నాయి.

1. దాగలిపినాడు : చేర్చాడు
   ''దంతానికా పుల్ల దాగలిపినాడు''

2. ఓల లాడీనాడు : స్నానం చేశాడు
   ''ఉత్రాసి కాశిలో ఓలలాడినాడు''

3. మూడు పురుసుల గంగ : మూడు దోసిళ్ల నీరు
   ''మూడు పురుషుల గంగ ముందనుబగించేను''

4. పాకు రోట్టున్నాయి : నాచు పట్టి ఉన్నాయి.
   ''పాతోడ్ని కంబాలు పాకు రోట్టున్నాయి''

5. ఓవనము : వాహనము.
   ''ఓవనము నిలిపినడు వల్లబుడు సోమి''

6. కలలేమి రాకుండ : ఇబ్బందులు రాకుండా.
   ''కట్టున్నేవారికి కలలేమి రాకుండ''

7. దంతదావులం : పళ్లు తోమడం.
   ''దంతదావులం జేసె బాల కాశివుడు''

8. తలము : గర్భం.
"నేను మూడు నెల్లా తలము తొప్పియున్నాను"

9. ఎల్లా చవజనులెల్ల : ప్రజలంతా
"ఎల్లా చవజనులెల్ల కల్లలాడుదురు"

10. పూర్వ కుండ : పూర్ణకుంభం, కలశం.
"ఆమీద పూర్వకుండమరించీనారు"

11. అచ్చాయ పరులార : ఉత్తములారా.
"అన్నలార మీరు అచ్చాయపరులార"

12. పావంచాలు : మెట్లు.
"అడుగడుగు పావంచాలమిరించినారు"

13. దివ్వేగ్యానం బట్టి : దివ్యదృష్టితో.
"దివ్వేగ్యానం బట్టి దీష్టించి జూసితే"

14. అంత్రపురం : ఆకాశం.
"అంత్రపురమున రదము అరగడియ కొచ్చె"

15. ఓజు లేసేరు : కుప్పగా పెట్టారు.
"ఒక సోట కంబాలు ఓజు లేసేరు"

16. మూల తంబం : ధ్వజస్తంభం.
"మూలతంబం యొక్క మూరతన లేదు"

17. సన్నాతా నున్నట్లు : ప్రేమతో నున్నట్లు.
"సతియ పురుషు లిద్దారు సన్నాతానున్నట్లు"

18. గోటకా లాడినట్లు : వాదు లాడినట్లు.
"గొల్లబామలతోనే గోటకాడినట్లు"

19. గజ్జితాత : పండు ముసలి.
"గజ్జి తాతైనాడు గగన నరసింమ్మ"

20. బొజ్జల్ల మొయ్యి : కడుపునిండా.
"బోంచేసె కాశీలు బొజ్జల్ల మొయ్యి"

21. కలబొంగి పోనారు : చాల సంతోషించారు.
"కలబొంగి పోనారు బాల కాశీలు"

22. మిక్కుపోయి : గర్వించి.
"మిక్కుపోయి మీరు మిగుల నాడేరు"

23. నవరుసులు : నవధాన్యాలు.
"నాగటను దున్నాల నవరుసులు పండాల"

24. నాగటారు : నాగేటి చాలు
"నాగటారున గాని నవరుసులు పండు"

25. ఆసోదపడ్డారు : భుక్తాయాసం తీర్చు కున్నారు
"అరగడియు పొద్దు ఆసోదపడ్డారు."

26. కలబలికినారు : కలుసుకొన్నారు
"కాశీలు ఇద్దరు కలబలికినారు"

27. అయికంబయ్యారు : దేవునిలో కలిసి పొయ్యారు
"తండ్రీని కొడుకూను అయికంబయ్యారు."

28. వారకు : దగ్గరకి.
"కాపొళ్ళ కళ్ళాల వారకెల్లండి."

# సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం

అష్టబూలోకాల కాదినారాయణ
కాశి బయలెల్లాడు నీలయెన్నుండు
కాశిలో నొకపక్క సేరుపయినాడు
ఉత్రాసి పుల్లొకటి ఉరికించి నాగాడు
కొనగోల నాపుల్ల కొసలు బద్దించి
దంతానికాపుల్ల దాగలిపినాడు
ముత్యాల రాయెక్కి మునుపళ్లుదోమె
నల్లరాయిలమీద నాలికలు గీసె
ముంతడా నీళ్లతో మునిముకము గడిగె
చారెడు నీళ్లతో చెయి జబ్బ గడిగె
కాలుసేతులు గడిగె నీలయెన్నుండు
కాశీలో కెళ్లేను నీలయెన్నుండు
పుష్టుగా తానాలు చేసె నాసోమి
ఉత్రాసి కాశిలో ఓలలాడీనాడు
బద్ర కాశిల్లోను తాన్నమాడేను
నిలవంటి కాశిలో నిలిసె మాదవుడేమొ
వలివంటి కాశిలో వలిసె మాదముడు
మూడుపురుసుల గంగ మందను బగించేను
నాసిపోయెనుగంగ నాగలోకంకి
తీసిపోయెను గంగ దివ్వెలోకంకి
కాశిలో కంబాలు బట్టబయలాయె
పాతోడ్ని కంబాలు పాకురొట్టున్నాయి
అట్టికన్నుల జూసి నీలయెన్నుండు
కాయితంబులు కలము పట్టుకున్నాడు
అన్నరో మాయన్న అన్న ఇశ్వనాదుండా
దయసేసి కంబాలు సెలవమనివిస్తేను
సిలుకు సిమ్మాచలం కట్టుకుంటాను
ఎరుకులోడి చేత ఏడుబడ్డానన్న
ఒళ్లల్ల ఎరుపూను మంటలవుతాయి
ఎండలో శరియరము ఎండుతున్నాదీ
మంచులో శరియరము మాగుతున్నాది
వానలో శరియరము వొడులుతున్నాది
నిలవనీడలేదు నీలయెన్నుడి కన్న
దయసేసి కంబాలు సెలవుమాకిమ్మని
అష్టబూలోకాల కాదినారాయణ
జాబులేరాశాడు నీలయెన్నుండు
అప్పుడేమన్నాడు అన్ని సమనాదుండు
అవుదువోయి తమ్ముడు అవునంతటోడ
చేతనయితే కంబాలు తీసుకెళ్లామని
ఇశమన్న సోమికి రాసెనాయేళ
అట్టికన్నులజూసి నీలయెన్నుండు
అరిచేత కంబాలు అంకించినాడు
ఉరికించి కంబాలు ఒడ్డుపైనేసె
అగాజు కంబాలు కాశిలున్నాయి
అరిచేత కంబాలు అంకించినాడు
ఉరికించి కంబాలు ఒడ్డుపైనేసె
నలదుమ్మ కంబాలు కాశిలున్నాయి
ఒడ్డుపై కంబాలు ఓజులేసేను
కంబాల దిక్కున కన్నులను జూసి
శెంకుసెక్కారాల దాశావతారుడు
పాతోరికంబాలు పాకురట్టున్నాయి
అట్టికన్నుల జూసి నీలయెన్నుండు
పరవతానికి ఎళ్లి నీలయెన్నుండు
పచ్చిఆకులు దెచ్చి పట్టితోమీనాడు
చిత్తరువు కంబాలు చిలికేరుపడ్డాయి
ఆవులున్నయి బాబు గోవులున్నాయి
గోవుల్ని కాసేటి గొల్లవారున్నారు

అన్నన్ని కంబాల కమిరియున్నారు
సనకసానందులు సుమతికుమారులు
దేవానె దేవుతులు దేవేంద్రనాదులు
అష్టగిరి పాలకులు దివ్వెదేవుతులు
అన్నన్ని కంబాల కమిరియున్నారు
అక్కడా లోసనైనాడు నీలయెన్నుండు
సిలుకుసిమ్మాచలం సిమ్మదిరిదేవళము
తూరుపు దేవళము కట్టుకోవాల
నాలుగే దిక్కులు నాటంగ జూసినడు
ఏదిక్కు జూసిన ఏమిగనపడదు
పడమటిదిక్కునే పాటించిజూసినడు
పడమటి బాగమునే పత్తివలసున్నాది
పత్తివలసల్లోను బత్తుడున్నాడు
సోలవోరబ్బాయి బాలకాశివుడు
అతడైతే దేవళము కట్టునన్నాడు
అర్ధరాతిరియేల నిద్దారి పొద్దున
గరుడు ఓవ నమెక్కి గజ్జావతారుడు
బంగారు సిరియెండి బెత్తుసేబట్టి
బాటపడ్డాడు బాబు బాలుడాయేల
పసిబిడ్డ తల్లులు పాలు మరసినయేల
పెద్దపెద్ద భూతాలుమాటుగాసినయేల
రుచ్చాలు రుచ్చాలు రాపులాడినయేల

బాటపడ్డాడు బాబు బాలుడాయేల
ఏగ్రిమున పత్తివలసెల్లిపోనాడు
పత్తివలసాలోన బత్తుడింటికాడ
ఓవనము నిలిపినడు వల్లబుడుసోమి
బత్తుడు వాకిట ఓవనము దిగినాడు[1]
తనసేత నున్నాది ఇలనాగ బెత్తాము
తలుపు గడియలపైన బెత్తెమోపేను
గడియలూడేను గొలుసులూడేను
చిత్తారి తలుపులు చిలుకులూడేను
అచ్చంగ తానెల్లె తమ్ముడూలాగా
తానెల్లి మాదముడు సరస గూర్చోని
అవుదువోయి బత్తుడా ఆవునంతటోడా
నేను పాలయంబుదిలోన పట్టాపు
సేనున్ని
ఇష్టుమౌతారాలు ఈడుకున్నాను
ఇష్టుమౌతారాలు సుష్టిలో దిగనాడి
రాజ్యంలో రామావుతారమ్మైనాను
రామావుతారాలు రాజ్యంలో దిగనాడి
ఓలుగా ఓరావుతారమ్మైనాను
ఎరికివోడి సేత ఏటుబడ్డాను
ఒడ్డికొండలమీద వరనమ్మైనాను
నాకుండడానికి స్థలమ్మైనాలేదు

1. ఇక్కడ కాశీడు యొక్క మేడను వర్ణిస్తూ కొంతమంది దాసులు ఇలా పాడుతారు బత్తుడినే 'కాశీడు' అని గూడ అంటారు.
సూసినాడమేడ సింగారమల్ల
ఏమి సింగారమొ కాశీడిమేడ
బంగారి బెత్తుతో గెడలొత్తగించేను
నోపటా దరబారు నోవిల్లకెల్లె
నట్టింట రాసింది నాగుపాములరాత
ఏమి సింగారమొ బత్తుడామేడ
దూలన్నే రాసిందోయి దుప్పకలములరాత
ఏమి సింగారమొ కాశీడిమేడ
పక్కనేరాసుంది పారావారాలాట
ఏమి సుంగారమొ కాశీడిమేడా
సీలాన్నే రాసింది చిలకపట్టెలరాత
ఏమిసింగారమొ కాశీడిమేడా
అంసాలూపారాలు ఆడినట్టున్నాది
పచ్చులూ పారాలు పాడినట్టున్నాది
ఏమి సింగారమొ కాశీడిమేడా
పట్టెమంచంమీద పాలతెరల్లోను
పవ్వలించున్నాడు బాలకాశీడు

స్తానామాడనీకి చోటైనలేదు
నిలవనీడలేదు నీలయెన్నుడికి
ఎండలో శరియరము ఎండుతున్నాది
మంచులో శరియరము మాగుతున్నాది
వానలో శరియరము ఒడులుతున్నాది
తూరుపు దేవళము కట్టరావయ్యా
కాశిలో నున్నాయి గనమైన కంబాలు
కంబాని కెయ్యేసి కట్నమిస్తాను
కట్టున్ని వారికి కలలేమిరాకుండ
మూన్నెళ్లు జీతాలు ముందరిస్తాను
మూన్నెళ్లు జీతాలు ముందరేగాకన్న
ఆరునెల్లజీతాలు వగలమిస్తాను
రానుపోను కూలి ముట్టడిస్తాను
రానుపోను కూలి ముట్టడేగాకుండా
ఏపూట బత్తాలు ఆపూట నిత్తాను
సిలుకు సివమ్మాచలము సిమ్మదిరి దేవళము
తూరుపు దేవళము కట్టరమ్మన్నాడు
కలలోన నాసోమి నిలజెప్పినాడు
చెప్పినట్టు జెప్పి చేతిలో సెయ్యేసి
మాయమ్మైపోనాడు మాదవాసోమి
గరుడు ఓవనమెక్కి గజ్జావతారుడు
కోదండ మనసోమి కొండకొచ్చేను
అపుడు దిగ్గాన మేలుకొనెబాలకాశీడు
దిగ్గనె మేలూకొని దిక్కులన్నీజూసె
ఎనకముందల జూస్తె ఎవ్వరూలేరు
మాటాడనీకి మనిసైనలేడు
కలగాసి పడుకుంటె పలమేమీలేదాని
తెల్లవారినదాకా తెలివాయికున్నాడు
ఊరికోళ్లే గూసె ఉదియ తెల్లోరె
మారుకోళ్లే గూసె మందతెల్లోరె

బలబలా తెల్లారి బమ్మనాదాయె
తెల్లగా తెల్లారి చల్లగాలూరె
ఎఱ్ఱగా పొద్దెక్కి ఏడుగడియలాయె
బత్తురాలుండేటి బసల కెళ్లేను
అవుదువోయిబత్తురాలఅవునంతదానా
కల యొకటి గన్నానుకలియుగంలోన
ఆయన పాలయంబుదిలోని పట్టాపు సేనుడట
యిష్టమౌతారాలు సుష్టిలో దిగనాడి
ఓలుగా ఓరావుతారమ్మైనాడు
ఎరికివోడి సెంద ఏటుబడ్డాడు
ఒడ్డికొండలమీద వరణమ్మైనాడు
నిలవ నీడలేదు నీలయెన్నుడికి
ఎండలో శరియరము ఎండుతున్నాదట
మంచులోశరియరముమాగుతున్నాదట
తూరుపు దేవళము కట్టరమ్మన్నాడు
కాశీలో నున్నాయి గనమైన కంబాలు
కంబాని కేయ్యేసి కట్నమిస్తాడట
కట్టున్నె వారికి కలలేమి రాకన్నా
మూన్నెళ్లజీతాలు ముందరిస్తాడంట
మూన్నెళ్ల జీతాలు ముందరేగాకన్న
ఆరునెళ్ల జీతాలు అగలమిస్తాడంట
రానుపోను కూలి రాజెప్పుతాడంట
ఏపూట బత్తాలు ఆపూట నిత్తాడు
తూరుపుదేవళము కట్టరమ్మన్నాడు
ఆమాట లిన్నాది ఆబత్తురాలు
అవుదువోయి బత్తుడాఅవునంతటోడా
అక్కడున్న కూలి ఇక్కడున్నాది
ఎక్కడ సిమ్మదిరి ఎక్కడ దేవళము
ఎక్కడికి యెళ్లొద్దు అయ్యాకాశీడా
నువ్వుసూడ తిరగల్లునువుసేయగలిగితే

సూడిదంగా నేనెల్లి అమ్ముకొస్తాను
పసిడి జన్నికాలు నువ్వుచెయ్యగలిగితే
పదేసి వరహాల కమ్ముకొస్తాను
రాయి జన్నికాలు నువ్వుసేయగల్గితే
రాజ్యములో నేనెల్లి అమ్ముకొస్తాను
ఎక్కడ సిమ్మదిరి ఎక్కడ దేవళము
ఎక్కడికీ ఎళ్లొద్దు అయ్యా కాశీడా
నీపాల గల సోమి నాపాల గలిగితే
పయనములు జేస్తాను పంపించుతాను
అప్పుడేమన్నాడు బాలకాశీడు
మాబాగునన్నాడు మంచిదన్నాడు
ఇలకంచుదేవలాన్నిమిడియున్న తండ్రి
బత్తురాలాడేటి మాటలిన్నాడు
అడివారా పర్వతా లాదుకున్నసోమి
బత్తుర్రాలాడేటి మాటాలిన్నాడు
అవుదువే బత్తురాల అవునంతదాన
కానియ్యే బత్తురాల కానియ్యి మన్నాడు
మాట నీమనసందు ఉంచమన్నాడు
నిస్సరాతిరియేల నిద్దారిపొద్దున
గరుడుఓవనమెక్కె గజ్జావతారుడు
అష్టబ్రూలోకాల కాదినారాయణ
ఏగ్రిమున పత్తివలసెల్లిపోనాడు
పత్తివలసాలోను బత్తుడింటికాడ
ఓవనము నిలిపాడు వల్లబుడు సోమి
బత్తుడు వాకిట ఓవనము దిగినాడు
తనచేత నున్నాది ఇలనాగబెత్తు
తలుపుగడియలపైన బెత్తుమోపేను
గడియలూడేను గొలుసులూడేను
సిత్తారి తలుపుల సిలుకులూడేను
అచ్చంగ తన తోడ తమ్ముడూలాగా
తానెల్లి మాదముడు సరసగూర్చున్నాడు

అవుదువే బత్తురాల అవునంతదానా
నువ్వుఏమిమాటలన్నావుబాలబత్తురాల
ఎవ్వరనుకున్నావు ఎరుక నీకులేదా
పాలయంబుదిమీది పట్టావుసేనున్ని
యిష్టుమౌతారాలు సుష్టిలో దిగనాడి
రాజ్యములో రామావుతారమ్మైనాను
రామావుతారాలు రాజ్యములోదిగనాడి
ఓలుగా వోరావు తారమ్మైనాను
ఎరికివాడి సేత ఏటుబడ్డాను
ఓరావుతారాలు దిగనాడినాను
ఒడ్డికొండలమీద వరణమ్మైనాను
నిలవనీడలేదు నీలయెన్నుడికి
ఎండలో శరియరము ఎండుతున్నాది
వానలో శరియరము ఒడులుతున్నాది
మంచులో శరియరముమాగుతున్నాది
సిలుకుసిమ్మాచలముసిమ్మదిరిదేవళము
తూరుపు దేవళము కట్టపంపించు
కాశీలో నున్నాయి గనమ్మైన కంబాలు
తూరుపు దేవుళము కట్టున్నేవారికి
కంబానికెయ్యేసి కట్నమిస్తాను
కంబానికెయ్యేసి కట్నమే గాకుండా
మూన్నెళ్ళ జీతాలు ముందరిస్తాను
ఆరుసెల్ల జీతాలు వగలమిస్తాను
రానుపోను కూలి రాజెప్పతాను
ఏపూట బత్తాలు ఆపూట నిత్తాను
తూరుపు దేవుళము కట్టబంపించు
కలలోన నాసోమి నిలజెప్పినాడు
చెప్పినట్టు జెప్పి చేతిలో చెయ్యేసి
మాయయ్యిపోనాడు మాదవాసోమి
అప్పుడు దిగ్గానె మేలూకొనెదిక్కులన్నీ
జూసె

ఎనకముందల జూస్తే ఎవ్వరూలేరు
కలగాసి పడుకుంటె పలమేమీలేదాని
తెల్లవారినదాకా తెలవాయికున్నాది
ఊరికోళ్ళే గూసె ఉదియ తెల్లోరె
మారుకోళ్లే గూసె మంద తెల్లోరె
బలబల తెల్లోరె బమ్మనాదాయె
తెల్లగా తెల్లారి చల్లాగాలూరె
ఎఱ్రగా పొద్దెక్కి ఏడుగడియలాయె
కాశీడు ఉండేటి బసలకెళ్లీనాది[1]
అవుదువోయి కాశీడాఆవునంతటోడా
నీకు జెప్పినసోమి నాకు జెప్పినాడు
ఈసుట్టు దేవుళము కట్టెళ్లమన్నాది
ఆమాట లిన్నాడు బాలకాశివుడు
ఉత్రాసిపుల్లొకటి ఉరకించిలాగాడు
దంతదాపులంచేసె బాలకాశివుడు
తలవంటి నీల్లల్లో స్నానాలు జేశాడు
తడివస్తరాలిప్పి పొడివస్తరాలు గట్టి

సక్కగా జన్నిదాలు సర్దుకున్నాడు
ఈబూది పొడి ఒకటి ఇమ్మిగుంచాడు
చేరి చుక్కాబొట్టు నొష్టనుంచాడు
బారువా తువ్వాలు కప్పుకున్నాడు
సల్దికూడన్నాలు సమకూర్చుకొని
సిత్తిరి సినబాడిత పట్టుకున్నాడు
శివన్నారాయణ నీసాయమని
బయలుదేరీనాడు బాలకాశీడు
పినగాడి పెదగాడి పెడతోవనొచ్చేడు
ఏపగుంటడివార మాదుకున్నాడు
ఏపైపు జూసిన అడివికానొత్తంది
వనమల్ల కలబార తిరుగుతున్నాడు
మద్దీలూ మారేలు ఉత్రాసీ వనములు
వనమల్ల కలబార తిరుగుతున్నాడు
కర్జూర కిసిమీసి కమలాసిఫలమూలు
వనమల్ల కలబార తిరుగుతున్నాడు
మాటాడ నీకొక్క మనిసైన లేడు

కొంతమంది దాసులు స్వామి బత్తురాలికి కలలో చెప్పిన మాటలన్నీ మళ్లీ ఇక్కడ గూడా ఇలా పాడుతారు –

ఏమంట పలికింది బాలబత్తురాలు
అయ్యయ్యా కాశీడా నాప్రాణనాదుడా
సెప్పుతా నొకమాట సెవులాలకించు
కల ఒకటి గన్నాను కలియుగములోన
పాలయంబుదీలోని పట్టాపుసేనుడట
ఇష్టుమౌతారాలు సుష్టిలో దిగనాడి
రాజ్యంలో రామావుతారమ్మైనాడు
రామావుతారాలు రాజ్యంలో దిగనాడి
ఓలూగా వారావతారమ్మైనాడు
ఎరుకివాడిసేత ఏటుబడ్డాడట
ఓరావుతారాలు ఒళ్లల్ల దిగనాడి
ఒడ్డికొండలమీద వరణమ్మైనాడట
నిలవ నీడలేదు నీలయెన్నుడికి
సిలుకు సిమ్మాచలము సిమ్మదిరి దేవుళము

తూరుపుదేవుళము నిన్ను కట్టరమ్మన్నాడు
తూరుపుదేవుళము కట్టున్నేవారికి
కంబానికెయ్యేసి కట్నమిస్తాడంట
మూన్నెళ్ల జీతాలు ముందరిస్తాడంట
మూన్నెళ్ల జీతాలు ముందరేగాకుండా
ఆరునెల్ల జీతాలు వగలమిస్తాడంట
ఆరునెల్ల జీతాలు వగలమే గాకుండా
రానుపోను కూలి ముట్టడిస్తాడంట
రానుపోను కూలి ముట్టడేగాకుండా
ఏపూట బత్తాలు ఆపూట ఇత్తాడు
పయనములు కావయ్య నువ్వెళ్లవయ్యా

అల్లాడి కాశీడు తల్లటించేను
శోకించె కాశీడు నోకమల్లాడ
ఇలకంచు దేవిళాన్ని మిడిఉన్నతండ్రి
కాశీడి శోకాపన ఆలకించాడు
కోదండ మనసోమి కొండదిగినాడు
అష్టబూలోకాల కాదినారాయణ
ఎయ్యిమాయలవోడు ఏలయినివోదు
మనిషిరూపైనాడు మాదొడ్డసోమి
అడివారా వాకాలో కొచ్చి నిలిచేడు
కాశీడి కడరెక్క పట్టుకున్నాడు
రావయ్య కాశీడా కొండ కెల్దామని
కాశివుడు నర్శిమ్మ బయలు దేరేరు
తీగి పర్వతాలు తిన్నగెక్కేరు
అట్టి పర్వతాలు ఆనుకోనెక్కేరు
నలరాయి పర్వతం సదునుకెళ్లేరు
అప్పుడేమంట పలికేడుమాదొడ్డసోమి
అవుదువోయి కాశీడాఅవునంతటోడా
ఇస్తారు పర్వతాలు ఇరివిగుండాల
బాగోతముల కొండ బారుగుండాల
సానిమేళంకొండ సదును గుండాల
తాళాలు మేళాలు తోడపెద్దులవారు
గరిడీలకా కొండ గనముగుండాల
రథము తిరుగులకొండబారుగుండాల
కాశివుడు నర్శిమ్మ కలిసికొన్నారు
రావయ్య కాశివుడు కాశి కెల్దామని
కాశివుడు నర్శిమ్మ బయలుదేరేరు
కాశీలో కంబాలు కన్నులను జూసి
సోమిదగ్గరె ఉంది ఇలనాగ బెత్తాము
సోమిదగ్గర బెత్తు కాశీడు దీసికోని
కాశీలోనాబెత్తు ఏసినాడాయేళ
కాశీలేసిన బెత్తుకొండకొచ్చింది

పుట్టుదారలకాడ పుట్టబడ్డాది
వైకుంట దేవతలు బెత్తుదీసేరు
ఆదియిష్ణుకు బెత్తు లందించినారు
అప్పుడేమన్నాడు బాలకాశీడు
కాశీలో గజనిమ్మపండేసినాడు
కాశీలేసిన పండు కొండకొచ్చింది
వైకుంట దేవతలు పండుదీసేరు
ఆదియిష్ణుకు పండు లందించినారు
అష్టబూలోకాల కాదినారాయణ
అవుదువోయి కాశీడాఅవునంతటోడా
ఈసుట్టు దేవిళము కడుదువన్నాడు
ఎంతటోడికైన ఎనకసాయంగలదు
నీసాయమనుసులనుతెచ్చుకోమన్నాడు
అప్పుడేమన్నాడు బాలకాశీడు
మాబాగు నన్నాడు మంచిదన్నాడు
కాశీవుడు నర్శిమ్మ కలిసొచ్చినారు
జాబులే రాశాడు బాలకాశీడు
పినగాడి పెదగాడి జాబులనురాసె
పురుసోద పులగాలి పాలెములురాసేడు
ఎంకటాపుర మొకటి ఏగ్రముసరాసే
పేరికల పెదనరవ జాబులే రాశాడు
కొండసుట్టేటి పల్లెలకు రాశాడు
ఏపగుంటడివరము జాబులేరాసేడు
నాలుగు బాగాలు జాబులేపంపాడు
జాబులే జూసేరు ఆబత్తులంతా
మాబాగునన్నారు మంచిదన్నారు
పెద్దాబాడితలల్ల పట్టుకున్నారు
సిత్తిరి సినబాడిత పట్టుకున్నారు
ఉలులు శానాలు పట్టుకున్నారు
బయలుదేరినారు బాలకాశీలు
ఉల్లితోటలు దాటి ఊళ్లన్నిదాటి

పసుపుతోటలు దాటి పల్లెలే దాటి
చెరుకుతోటలు దాటి చేలన్నీ దాటి
ఏగ్రిమున పత్తివలసెల్లిపోనారు
పత్తివలసాలోను బత్తుడింటీకాడ
అయ్యన్నీ ఒకచోట ఓజులేసీనారు
కాశీని బారియతాసుందరమ్మ
పంచపరమాన్నాలు వండెనావేళ
పప్పుతో పన్నెండు కూర లొడ్డించె
చుట్టు దిరిగి కూరలు చుక్కలనెబోలు
ఏడుటన్నములు చంద్రునిబోలు
బోంచేసె కాశీలు బొజ్జల్లమొయ్య
అరగడియపొద్దు ఆనోదపడ్డారు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అవునర్ర బత్తులు అవునంతటోళ్లు
ఏగ్రిమున పయనములు ఫెత్తమన్నాడు
బయలుదేరీనారు బాలకాశీలు
అట్టికన్నులజూసి తాసుందరమ్మ
అవుదువోయి బత్తుడుఅవునంతవాడా
తూరుపు దేవుళము కట్టనెలతున్నావు
నేనుమూడునెల్లాతలముతప్పియున్నాను
అన్నెమందురు జనులుపున్నెమందూరు
అన్నాయమందురు వాడజనుల్ల
ఎల్లాచవా జనులెల్ల కల్లలాడుదురు
పుట్టిన బాలయే బాబు ఏడంతేను
ఎవరిబాబును నేను చూపేది
ఆమాట లిన్నాడు బాలకాశీడు
అవుదువె బత్తురాల అవునంతదానా
రుచ్చమొక్కటెగాని పచ్చులు పదివేలు
రుచ్చమిడిచిన పచ్చికినాయమున్నాదా
నేను ఉండాగానే నీకేమి బయము
ఆడబాల్లైతేను తాసుందరమ్మ

పసుపు వర్షము గురుసుపర్వతముపైన
అది నాకు ఆనవాలు తాసుందరమ్మ
మగబాలుడైతేను తాసుందరమ్మ
వజ్రాలు ముత్యాలవాన గురిసేను
అది నాకు ఆనవాలు తాసుందరమ్మ
అవుదువే సుందరి అవునంతదానా
ఇంటిముందేసినానుఇలగంగిరేగొకటి
ఆపక్కనేసేను అల్లోనేరల్లు
పన్నెండు ఏళ్లకే పాయమొస్తాది
తూరుపు దేవుళము కట్టేసుతాను
బాబు ఏడాని బాలు డడిగినాడు
అల్లోనేరెడుపళ్లు పండియుంటాయి
డోలాయి పున్నముకి దొడ్డయాత్రగదా
పడమటోలంతాను పరస కొస్తారు
పళ్లుకోసి బుట్టలో పోయితాసుందరమ్మ
పడమటోళ్లయెంట పర్వతానికి పంపు
అడివార పెదసెరువు తాన్నములుసెయ్యమను
ఆపసుపుకుంకాలుపైడమ్మకియ్యమను
అచ్చంగా ఆరాగి దచ్చినాలెయ్యమను
తొల్లి దువ్వారాల టెంకాయ కొట్టి
పన్నెండుదారలతాన్నములు జేసుకొని
గంగదారల వద్ద పళ్లబాజారు
పళ్లబాజారులో పళ్లమ్మ మన్నాడు
పండుకె పండెత్తు బంగారమెత్తు
పళ్లెవరు గొన్నేరు పర్వతముమీద
అప్పుడే కొడుకాని ఆనుకుంటాను
ఆవేళ కాశీడు తాజెప్పినాడు
బయలుదేరీనారు కాశీలందరు
పినగాడి పెదగాడి పెడతోవనొచ్చేరు
ఏపగుంటడివారమాదుకున్నారు

అప్పుడేమన్నాడు బాలకాశీడు
అన్నలారా మీరు ఓ తమ్ముళ్లారా
ఇక్కడొక్కాపని మనము జెయ్యాల
అడివల్లా గొట్టాల కోనేరు తవ్వాల
ఆమాట లిన్నారు బాలకాశీలు
పదివేలు కాశీలు పనులు బట్టారు
అడివల్లా గొట్టారు కాశీలావేల
కోనేరు దవ్వారు ఆరోజు పొద్దున
కోనేరు సుట్టూను గట్టుబోసేరు
ఆవలకి ఈవలకి మెట్లు గట్టారు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
ఇక్కడొక్కాపని మనము జెయ్యాల
అప్పన్న పక్కానే పైడమ్మ ఉండాలి
పైడితల్లమ్మకా గుళ్లు గట్టాల
పట్టండి ఆపనులు పట్టమన్నాడు
ఆమాట లిన్నారు బత్తూలావేళ
పర్వతానికి ఎల్లి పనులు బట్టారు
మంచి మంచి పలకాలెంచి దవ్వినారు
సాపుజేసినారు సదును జేసినారు
వాటంగా జెక్కారు వఁటించినారు
గాతలే కొలిశారు గదులు దవ్వినారు
కుందమీదనుకుందకుదురుగేసీనారు
ఆమీద నడ్డుపలకలమిరించినారు
గుడిగట్టి గుడిమీద గోపురంగట్టేరు
ఆమీద పూర్వకుండ మరించీనారు
అన్నలారా మీరు తమ్ములారా
పైడితల్లమ్మకే గుళ్లు గట్టాము
మంచిదొక్కా పలకా ఎంచిదిమ్మన్నాడు
అమ్మోరు పొలితినే బొమ్మజేసినాడు
గుళ్లోన అమ్మోరిని గుర్తుగెట్టారు
అవునమ్మ పైడమ్మ అవునంతదానా

ఆ పసుపుకుంకాలు ... జెల్లేను
అచ్చంగా ఆరాగి ద...
ముందొచ్చె బోగాలు...కు జెల్లేను
ఆమాటలన్నాడు పెద్దక...డు
పైడితల్లమ్మకాపద్దు లిచ్చినాడు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అవునఁరాబత్తూలు అవునంతటోరూ
ఇక్కడొక్కాపని మనము జేయాల
ఇగ్గునేసుడు గుళ్లు మనము గట్టాల
పట్టండి ఆపనులు పట్టమన్నాడు
పదివేలు కాశీలు పనులు బట్టారు
పర్వతానికి ఎల్లి పట్టి దవ్వారు
తవ్వేరు పర్వతము దశలు దల్లాడ
తీసేరు పలకలను దివ్వెసోగులను
వాటంగా చెక్కేరు వఁటించినారు
గదులు కొలిచినారు గాతలే దవ్వేరు
కుందమీదను కుందకుదురుగేసీనారు
అక్కడక్కడ పలక లమిరించినారు
ఇగ్గునేశుడి గుళ్లు కడతనున్నారు
గుడిగట్టి గుడిపైన గోపురాలెట్టేరు
ఆమీద పూర్వకుండమరించీనారు
ఇగ్గునేసుడు పొల్తుబొమ్మ జేశారు
గుళ్లోన గణపతిని గురుతు గెట్టారు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
ఏడాది కొకమారు నీపండగొస్తాది
ఇలమీద నీపండుగు ముందు నొస్తాది
ఇగ్గునేశుడికాపద్దు లిచ్చెనావేల
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అన్నలారా మీరు అచ్చాంయిపరులారా
ఇక్కడొక్కాపని మనముజేయాల
కొండమీద బూతాలు కిందకే రాకన్న

...PAVL 4343

కిందనే బూతాలు కొండమీదకు రాకన్న
అనుమంతురాయుడే గుళ్లుకట్టాల
ఆమాట లిన్నారు బాలకాశీలు
పదివేలు కాశీలు పనులు బట్టారు
మంచి మంచి పలక లెంచి దవ్వేరు
గదులు కొలిసీనారు గాతలే దవ్వేరు
కుందమీదను కుంద కుదురు గేసీనారు
ఆమీద పలకాలు అమిరించినారు
అనుమంతురాయుడు గుళ్లుగట్టేరు
గుడిగట్టి గుడిమీద గోపురము గట్టి
ఆమీద పూర్వకుండమిరించీనారు
మంచిదొక్కా పలకా ఎంచిదీసినారు
అనుమంతు పోలుతున బొమ్మ జేసీనారు
గుడిలోన అనుమంతు గురుతుగుంచేరు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అవుదువోంబు అనువుంతవా
అవునంతటోడా
సిలుకు సిమ్మాచలము తొక్కన్నేవారల్ల
ముందు నీకు బోగాలు ఇచ్చెళ్లుతారు
అనుమంతురాయుడికి పద్దులిచ్చాడు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అన్నలారా మీరు బత్తులారా
ఇక్కడొక్కాపని మనము జెయ్యాల
కొండమీద వస్తువులు కిందకేరావాల
కిందానున్నొస్తువులు కొండాపైకెళ్లాల
కిందాకి మీదాకి మెట్లుగట్టాల
ఆమాట లిన్నాబు బాలకాశీలు
పర్వతానికెళ్లారు పనులుబట్టారు
తవ్వేరు పలకలు దశలు దల్లాడగ
తీసేరు పలకలు దివ్వెసోగుళ్లు
వాటంగా చెక్కారు వ్రటించినారు

సాపుగా చెక్కారు సదునుజేశారు
కొండమీదకు మెట్లు కడతనున్నారు
ఇష్టుమౌతారాలు గోడబారున నిలిపి
అడుగడుగు పావంచలమిరించినారు
మత్స్యావుతారాలు గోడబారున నిలిపి
అడుగడుగు పావంచ లమిరించినారు
కూర్మావుతారాలు గోడబారున నిలిపి
అడుగడుగు పావంచా లమిరించినారు
కొమ్మలావుతారాలు గోడబారున నిలిపి
అడుగడుగు పావంచాలమిరించినారు
నరిశిమ్మావుతారాలు గోడబారున్నిలిపి
అడుగడుగు పావంచాలమిరించినారు
వామనావుతారాలు గోడబారున్నిలిపి
అడుగడుగు పావంచాలమిరించినారు
పరసారామావుతారాలుగోడబారున్నిలిపి
అడుగడుగు పావంచాలమిరించినారు
రామావుతారాలు గోడబారున్నిలిపి
అడుగడుగు పావంచాలమిరించినారు
వారావుతారాలు గోడబారున్నిలిపి
అడుగడుగు పావంచాలమిరించినారు
కిష్ణావుతారాలు గోడబారున్నిలిపి
అడుగడుగు పావంచాలమిరించినారు
కొండమీదికి మెట్లు కడతనున్నారు
ఒయినూరు మెట్టులు కట్టిరావేల
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అన్నాలారా మీరు అచ్చాయిపరులారా
ఇక్కడొక్కాపని మనము జేయాల
కాశీకి కొండాకు దోనూలు తవ్వాల
పెద్దపెద్ద పనివోలు దోనూలు తవ్వండి
ఆపాటి పనివోలు పలకలమరించండి
కొండాకి కాశీకి దోనులు దవ్వేరు

గుబగుబని కాశీగూరుబిల్లాడె
దొడదొడని ఆకాశి దొం[డిపారేను
కాశీ నుంచి గంగ కొండకొచ్చేను
పదివేలు కాశీలు తాన్నములు జేసేరు
అట్టికన్నులజూసి గంగపోతురాజు
వచ్చేటి గంగకు గట్టేసినాడు
వచ్చొచ్చి ఆగంగ ఆగిపోయింది
అనుకొని కాశీడు పూనిశోకించే
కోదండ మనసోమి కొండ దిగినాడు
దివ్వెగ్యానంబట్టి దీష్టించి జూసితే
గంగపోతురాజు గట్టేసినాడు
అప్పుడేమన్నాడు నీలయెన్నుండు
అన్నోయి మాయన్న అన్నిశమనాద
గంగపోతురాజు గట్టేసినాడు
ఆమాటలిన్నాడు అన్నిశమనాదుడు
అవుదువో గంగపోతు అవునంతటోడ
కాశీనుంచా గంగ కొండకెళ్లనియ్యి
కోనేరు గట్టునే కొలువాయియుండు
ముందొచ్చె బోగాలు నీకు ఇస్తారు
ఆమాట లిన్నాడు గంగపోతురాజు
గట్టిరగదీశాడు గంగపోతురాజు
కోనేరు గట్టునే కొలువాయి ఉన్నాడు
గుబగుబను ఆగంగ గూరిబిల్లాడె
పరవశానికి గంగ పరుగు నొచ్చింది
కన్నులేజూశాడు పెద్దకాశీడు
అతియ సంతోషించి ఆనందుడాయె
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
వానరులు నరులాంఉ కులగిరులు పెకిలించి
ఆనాడు వారది వారుగట్టారు
ఈనాడు దేవుళము మనము గడదాము

కడనుంచి కొడిదాక గంగదారలదాకా
పన్నెండు దారలు బలపరసుదాము
అం[త్రాన్ని బన్నారు ఆకాశదార
మయిమాతో బన్నారు మాదవాదార
పిడియాతో బన్నారు పచ్చికాదార
అందంగాబన్నారు అనుమంతూదార
సొగెల్లేబన్నారు ఆసావుదార
మల్లెల్లీబన్నారు మాదావాదార
వంటాకని బన్నారు అదివంకాదార
ఆవూదారలు బన్ని గోవూదారలు బన్నీ
పన్నెండుదారలు బలపరిసినారు
దయసేసి చెం[దుండు దరని రదములు ఇచ్చె
మెచ్చి శమనాదుండు ఇచ్చె నొకరదము
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
ఎంచిపూసీనాడు ఎల్లటశ్వాల్ని
పసిడి తుమెదలాంటి పచ్చటశ్వాల్ని
గరగర కొరడాలు గిరగిర దిప్పి
అదిలించి ఆశ్వాల్ని బె దిరించినాడు
ఏ[గ్రమున కాశీ యెల్లిపోనాడు
కాశీలో నారదము ఆపుజేసీనడు
ఆకప్పకంబాలు కాశి లున్నాయి
అరిచేత కంబాలు అంకించినాడు
రదముపై కంబాలు ఏసికట్టాడు
ఆ గాజుకంబాలు కాశీలున్నాయి
అరిచేత కంబాలు అంకించినాడు
రదముపై కంబాలు ఏసికట్టాడు
నలరాయి కంబాలు కాశిలున్నాయి
అరిచేత కంబాలు అంకించినాడు
రదముపై కంబాలు ఏసికట్టాడు
కందిపొడి కంబాలు కాశిలున్నాయి

అరిచేత కంబాలు అంకించినాడు
రదముపై కంబాలు ఏసికట్టాడు
ఎండిగొలుసులతోని ఏసిగట్టాడు
గరగర కొరడాలు గిరగిరాదిప్పి
అదిలించి అశ్వాల్ని బె దిరించినాడు
బూమికేగాకుండాఆకాశంగాకుండా
అంత్రపురమునరధముఅరగడియకొచ్చె
అరగడియ పొద్దుకేఅడివోరమొచ్చేను
కొండామీదాయేను రదము కిందాయె
కొండమీదకు రదము ఎళ్లదన్నారు
అనుకొని కాశీడు ఫూని శోకించె
ఆమాట లిన్నాడు నీలయెన్నుండు
అష్టబూలోకాల ఆదినారాయణ
కోదండ మనసోమి కొండదిగినాడు
కొండమీదస్తంబు పట్టిమోపేను
కొండ కిందాయేను రథముమీదాయె

కొండామీదికి రదము ఎళ్లిపోయేను
ఒకసోట కంబాలు ఓజులేసేరు
ఎలుపుఎయ్యామట పొడుగునూరామట
కాపుదనముల బిలిచి కారడవి నరికేరు
సుక్కొకటి పడిగట్టి సుక్కురుండొచ్చె[1]
నవగునములు చూసి నచ్చంత్రమెంచి
దశిమి దశిమినాడు ద్వాదశిమినాడు
సుక్కురోరమునాడు సక్కన్నిరోజు
మంచిదొక మూరతన ఎంచి పడికట్టి
సుబకంబు వంటిదే సుక్కురుండేసె
పునయాదులేశారు పుడమిలోపలను
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అన్నలారా మీరు ఓతమ్ములారా
ఈనులు చెడకన్న నునువులురాకన్న
పాతాలపుట్టకే బాట సెడకన్న
కట్టాల దేవుళము కలియుగములోన
బ్రెమ్మ పట్నములోన మూరతముంది
బ్రెమ్మ దేవుడితోనె మూరతముంది
శోకించె కాశీడు నోకమల్లాడ
ఆమాట లిన్నాడు నీలయెన్నుండు
ఏమంట పలికినడు నీలయెల్లుండు
బ్రెమ్మపట్నంలోని బ్రెమ్మదేవుండా
బ్రెమ్మదేవుడులేని మూరతములేదు
మూలతంబంయొక్క మూరతములేదు
మాకొక్క మూరతము చెప్పు ఓ బ్రెమ్మ దేవుడా
ఆమాటలిన్నాడు బ్రెమ్మదేవుండు
మునియేల పుస్తకము ముడులిప్పినాడు

---

1. కొంతమంది దాసులు ముహూర్తం పెట్టడానికి శుక్రుడు గాకుండా బ్రహ్మ వచ్చినట్లుగా పాడుతారు అయితే ఈవిధంగా పాడేవారు ముహూర్తం, దేవాలయం శంకుస్థాపనకు గాకుండా మూలస్తంభం నిలబెట్టడానికి తగిన ముహూర్త నిర్ణయం కోసం బ్రహ్మ వచ్చినట్లుగా ఇలా పాడుతారు -
కాఫూదనముల బిలిచి కారడవి నరికేరు
పునయాదులేసేరు పుడమినోపలను
అరటీపూతంబాలు అందంగా నిలిపారు
వనగూర్చి దేవుళము కడత నున్నారు
మూలతంబంయొక్క మూరతనలేదు
అల్లాడికాశీడు తల్లడించేను
అష్టకంకణాల ఆదినారాయణ
ఏవరుసాకంబాలు పడుదుమయ్యాసోమి
ఏవరుసా దేవుళము కడుదుమయ్యాసోమి

సింహాచలం దేవళం కట్టుబడి కథాగేయం

ఉండాల కీరితి ఉగములోపలను
ఆమాటలిన్నారు బాలకాశీలు
మాబాగు నన్నారు మంచిదన్నారు
గనుకొండపరవతము గనులేరుపరిచేరు
తవ్వేరు పర్వతము దశలు దల్లాడ
తీసేరు పలకలు దివ్వెసోగుల్లు
వాటంగా చెక్కేరు వ్రటించినారు
సిత్తిరిపట్టేరు సిలుకురాసేరు
గదులు కొలిసినారు గాతలే తవ్వేరు
అక్కడక్కడ కుంగ లమరించినారు
కుందమీదను పలక లమరించినారు
సిమ్మదిరి దేవుళము మొదలుబెట్టినారు
పలకమీదను సిలుకు పడిగట్టినారు
ఏమేమి సిలుకులు వరినించినారు'
ఆవులను చూసేరు గోవులను చూసేరు
పలకమీదను సిలుకు పట్టిరాసేరు
సనకసానందులు సుమతికుమారులు
వారు చూసినారు బాలకాశీలు
పలకమీదను సిలుకు పట్టిరాసేరు

సురుకోటి దేవతలు సురులు ముప్పైకోట్లు
ఆరుజూసినారు బాలకాశీలు
పలకమీదను చిలుకు పట్టిరాసేరు
పలకమీదను కుంద పడిగట్టినారు
అక్కడక్కడ పలక లమిరించినారు
సిమ్మదిరి దేవళము కడతనున్నారు
దేవాని దేవతలు దేవేంద్రనాదులు
ఆరు చూసినారు బాలకాశీలు
పలకమీదను సిలుకుపట్టిరాసేరు
అక్కడక్కడ పలక లమరించినారు
పలకమీద కుంద బలపరిసినారు
గువ్వలను జూసి గూపోతులను జూసి
పలకమీదను సిలుకు పట్టిరాసేరు
సెమళీపిట్టలను జూసి కారుకోళ్లను జూసి
పలకమీదను సిలుకు పట్టిరాసేరు
అక్కడక్కడ సిలుకు లమరించినారు
సిమ్మదిరి దేవుళము కడతనున్నారు
అక్కడొక్క అద్దుపలకమరడంలేదు
అంత్రప్రపమెల సుట్టుపెరుగు దేవళము

నవ్వపదంసదివి నచ్చత్రమెదికి
మంచిదొక మూరతము ఎంచి పడికట్టి
అంసటవనమెక్కి బ్రెమ్మదేవుండు
దేవుళము వద్దకు ఆదుకున్నాడు
ఇష్టును యిలబ్రెమ్మ ఈశ్వరుడు ముగ్గురు
మూలకంబంమీద ఆస్తాలు మోపేరు
'జయ్' మని కంబాము జేకొట్టసాగె
జేకొట్టి కంబము తిన్నగా నిలిచె
అతియ సంతోషించి ఆనందులాయి
కాశీలు దేవుళము కడతనున్నారు
1 కాశీలు పలకలమీదచిత్రించేబొమ్మల గురించి
కొంతమంది దాసులు ఇలా పాడుతారు -
గోవవరదన పరవతము గొడుగుపట్టినరీతి

గోపాలసోమిని పలకమీదను పట్టి రాసేరు
సతియుపురుషులిద్దారు సన్నాతానున్నట్లు
పలకమీదను సిలుకు పట్టిరాసేరు
గొల్లబామలతోనే గోటకాలాడినట్లు
పలకమీదను సిలుకు పట్టిరాసేరు
పాలమ్మవచ్చిన ఓసకిచ్చూ యావత్తు
పలకమీదను సిలుకు పట్టిరాసేరు
తొండాపు ఏనుగులు పెనుగులాడినట్లు
పలకమీదను సిలుకు పట్టిరాసేరు
డాలు కత్తులవారు డంకసిపాయిలు
పలకమీదను సిలుకు పట్టిరాసేరు

ఎద్దు ఓవనమెక్కి ఎలిగిసిరి శివుడు
సిమ్మదిరి దేవుళము చూడనొచ్చేడు
వారు చూసేనారు బాలకాశీలు
పలకమీద సిలుకు లమిరించినారు
అక్కడక్కడ సిలుకు పట్టిరాసేరు
సిమ్మదిరి దేవుళము కడతనున్నారు
అక్కడొక్కడ్డుపలకమరడంలేదు
సిమ్మదిరి దేవుళము పెరుగుతున్నాది
అంత్రపురముల ముట్టపెరుగు దేవుళము
పసిడి ఓవనమెక్కి పార్వతీదేవి
సిలుకు సిమ్మాచలము చూడనొచ్చేను
వారు చూసేనారు బాలకాశీలు
పలకమీదను సిలుకు పట్టిరాసేరు
అక్కడక్కడ పలక లమిరించినారు
అక్కడొక్కడ్డుపలకమరడంలేదు
అంత్రపురములు ముట్టపెరుగుతున్నాది
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అన్నలారా మీరు ఓతమ్ములారా
సిమ్మదిరి దేవుళము పెరిగిపోతున్నాది
అక్కడొక్కడ్డుపలకమరడంలేదు
అందాక యాపనులు ఆపమన్నాడు[1]
పడమటి భాగాన్ని తుంగబద్రల్లోన
జగన్నాదంగుళ్లు కడతనున్నారు
ఆరుకట్టినరీతి మనముకట్టాల

నేనెల్లి ఆగుళ్లు చూసివత్తానని
బయలుదేరినాడు పెద్దకాశీడు
సిత్తిరి సినబాడిద పట్టుకున్నాడు
సిమ్మదిరి కాశీడు పయనమానాడు
తూరుపు దేవుళము ఆరుగట్టారు
ఆ దేవుళంచూసివద్దామని
తూరుపుకాశీడు పడమటికి బయలెల్లె
పడమటికాశీడు తూరుపుకి బయలెల్లె
మద్దిదారిలోను కలుసుకున్నారు
కాశీలు ఇద్దరు కలబలికినారు
తూరుపువోడు పడమటోన్నడిగేడు
ఎందాక ఎలతవు అయ్యా పనివాడా
అప్పుడేమన్నాడు పడమటి పనివాడు
తుంగబద్రల్లోను జగన్నాదగుళ్లు
జగన్నాద గుళ్లు కడతనున్నాము
అక్కడొక్కడ్డు పలకమరడంలేదు
సిలుకు సిమ్మాచలము సిమ్మదిరి దేవుళము
తూరుపు దేవళము చూడ సెలతాను
అప్పుడేమన్నాడు సిమ్మదిరి కాశీడు
అవుదువోయి పనివోడ అవునంతటోడా
నువ్వు కట్టినరీతి నేను గట్టాలని
జగన్నాదగుళ్లు చూడనొస్తున్నాను
మనము మద్దితోవాలోను కలుసుకున్నాము

1 సింహాచలం దేవాలయంపైన పూర్వకుండ మరడంలేదని, పడమటి భాగంలో జగన్నాధస్వామి దేవాలయం కట్టేవారు ఏవిధంగా పూర్వకుండ అమర్చారో చూసి వస్తానని పెద్దకాశీడు బయలుదేరి వెళ్లినట్లుగా కొంతమంది దాసులు ఇలా పాడుతారు -
కప్పురాళ్లా వేసి కడతనున్నారు
వనగూర్చి దేవుళము కడతనున్నారు
గుడిగట్టి గుడిమీద సిగిలిమెత్తేరు
ఆమీద బంగారి పూర్వపుకుండెత్తితే
ఆమీద పూర్వకుండమరకున్నాది
గూనాచారపు గుళ్ళు జగన్నాదం గుళ్ళు
ఆమీద పూర్వపు కుండమరించినారు
ఆమీద పూర్వపు కుండ ఏరీతిగమరె
ఆరునెల్లాకబురు అడిగివత్తావని
సింహాద్రి కాశీడు బయలుదేరాడు

ఇక్కడొక్కాపని మనము జే యాల
మద్దిమారమ్మకే గుళ్లుగట్టాల
ఆమాటలిన్నాడు వాడు పనివాడు
మా బాగునన్నాడు మంచిదన్నాడు
ఇద్దరూ పనివోలు ఒకమాటమీదుండి
పర్వతానికి ఎళ్లి పలకలే దవ్వేరు
మంచి మంచీ పలక లెంచిదవ్వేరు
వాటంగా చెక్కేరు వజ్రించినారు
సాపునే చేసేరు సదును చేశారు
గదులు కొలిచినారు గాతలే దవ్వేరు
కుందమీదను కుంద కుదురుగ నేసేరు
కుందమీదను పలక బలపరిసినారు
ఆమీద నడ్డుపలకమిరించినారు
గుడిగట్టి గుడిమీద గోపురముగట్టి
ఆమీద పూర్వకుండమరించినారు
మద్దిమారమ్మ పొలితినే బొమ్మజేసేరు
గుడిలోన అమ్మోర్ని గురుతుగా నిలిపేరు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అవుదమ్మ అమ్మోరు అవునందతానా
దూపాలు దీపాలు నీకు లే వమ్మా
అష్టబూలోకాలు నీకారమన్నాడు
మద్దిమారమ్మకే పద్దులిచ్చేడు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అవుదువోయి పనివాడ అవునంతవాడా
పడమట రాజ్యంలో ఏమిపండూనూ
పడమటి రాజ్యములో పత్తివనములు
పండు
ఆమాటలిన్నాడు పెద్దకాశీడు
పేలిన పత్తల్ల బళ్లకెత్తూకొని
సిలికి సిమ్మాచలం పంపించమన్నాడు
ఆమాటలిన్నాడు జగన్నాదం కాశీడు
తూరుపు రాజ్యంలో ఏమిపండూను
తూరుపు రాజ్యంలోజనుముపండూను
ఆమాటలిన్నాడు జగన్నాధం కాశీడు
పండిన జనుమల్లా బళ్లకెత్తి
పడమటి రాజ్యానికి పంపించమన్నాడు
వారిలోన వారు మాటాడుకున్నారు
సిమ్మాదిరికాశీడు సిమ్మాది రొచ్చె
జగన్నాదం కాశీడు జగన్నాదమెళ్లె
అప్పుడేమిజేసె జగన్నాదం కాశీడు
పేలిన పత్తల్లా పొదుపుజేసినాడు
బళ్లమీద పత్తికొండ కొంపేను
అట్టి కన్నులజూసి బాలకాశీడు
చిక్కనాపత్తల్ల గబ్బులేసినాడు
పలుసనాపత్తల్ల పలబరిసినాడు
పత్తిమీదను పలక గద్దించినారు
అమీద నడ్డుపలకమరించినారు
గుడిగట్టి గుడిమీద గోపురముగట్టి
ఆమీద పూర్వకుండమరించినారు
సిమ్మదిరి దేవళము పూరితయింది[1]
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
అక్కడక్కడ జనుము పోగుజేసేను
ఆమీద పూరపు కుండెత్తి
దూదిపత్తిలమీద కప్పులేశారు
జగన్నాదం కాశీడు జగన్నాదమెళ్లె
కత్తిజనుము నార చుట్టించినాడు
ఆమీద దూలాలు అమరించినాడు
గుడిగట్టి గుడిమీద సిగిలమెత్తాడు
ఆమీద పూర్వకుండమరించినారు

1 సింహాచలం దేవళం మీద పూర్వకుండమరడంలేదని పాడే దాసులు పత్తిని పెట్టి పూర్వకుండ అమరించినట్లుగా ఈవిధంగా పాడుతారు –
సిలుకుసిమ్మాచలము సిమ్మదిరి దేవుళము
వనగూర్చి దేవుళము కడతనున్నారు
గుడిగట్టి గుడిమీద సిగిలమెత్తారు
ఆమీద ఒకపత్తి నమరించినారు

పోగుజేసిన జనుము పడమటి కొంపేను
వారు జగన్నాదం గుళ్లు కడతనున్నారు
అక్కడక్కడ జనుము అమరించినారు
జనుముమీదను పలక పలబరిసినారు
ఆమీద నడ్డుపలకమరించినారు
గుడిగట్టి గుడిమీద గోపురము గట్టి
ఆమీద పూర్వకుండమరించినారు
జగన్నాదంగుళ్లు పూర్తిజేశారు
అప్పుడేమన్నారు బాలకాశీలు
అయ్యయ్యా కాశీడా పెద్దకాశీడా
తెచ్చిన బత్తాలు చెల్లిపోనాయి
బత్తాలకే మేము బాదపడుతున్నాము
ఇంతోటి దేవళము మేము గట్టాము
ఇంటికెళ్లేమేము ఏమిదినాల
ఆలుబిడ్డల్నిడిచి అన్నదమ్ముల్నిడిసి
మాకారుసెళ్లయింది ఈకొండమీద
ఈవేళ జీతాలు మాకియ్యావయ్యా
ఆమాటలిన్నాడు పెద్దకాశీడు
మీకేమిజీతాలు ఇద్దునని
అనుకొని కాశీడు పూనిశోకించె
కోదండ మనసోమి కొండదిగినాడు
ఎండిగాదెల దనము ఎల్లబోసేను
పైడికొట్టుల దనము పైకిబోసేను
పదివేల కాశీలు కన్నులనిజూసి
అగల సంతోషించి ఆనందులాయి
పదివేల మందేమొ పంచుకున్నారు
ఎవరి డబ్బులు వారు మూటలేగట్టారు
ఎవరిపేరు వారు మూటపై రాసేరు
ఎండికొట్టుల్లోను పోగులేసినారు
అన్నలారా మీరు ఓతమ్ములారా
మనవము కిచ్చిడి పులగాము వంట
చేదాము
వంట మొదలెట్టిరయ్యు పనివోరు
కిచ్చిడి పులగాలు వంటలొండుకొని
వారిలోనేవారు మాటలాడేరు
చిన్నీరి పెద్దీరి వోరి మల్లన్న
ఈడబ్బుతో మనము ఇంటికెళ్లితే
తరము తరములదాకా బతికిపోతాము
కాపోడు లచ్చిమి మనకుండబోదు
మనం నాగళ్లుసెయ్యొద్దు నక్కు లెయ్యొద్దు
కాపోడు కల్లాల కొడ్డుకెళ్లొద్దు
బిడ్డబిడ్డ అంక సరిసాలునీదనము
ఆమాట లిన్నాడు నీలయెన్నుండు
అష్టబూలోకాల కాదినారాయణ
గజ్జితాతైనాడు గగన నరిసిమ్ము
వొనుకుతా వొనుకుతా తాతొచ్చినాడు
అట్టికన్నుల జూసి బాలకాశీలు
ఏఊరు ఏపల్లె ఓగజ్జితాత
ఏమి పనిమీద నువ్వొచ్చినావు
గాలికిందకు ఎళ్లు ఓగజ్జితాత
ఏమి పనిమీద నువ్వొచ్చినావు
గాలికిందకు ఎళ్లు ఓగజ్జితాత
ఆమాట లిన్నాడు నీలయెన్నుడుసోమి
అవుదురోయి పనివోరు అవునంత టోరా
దేవుళం కట్టేటి బాలకాశీడు
బాలకాశీని వద్ద పనివోడిని నేను
కళ్లులేనివోరు కబోదులుంటారు
కల్లేల మండపం కట్టమన్నాడు
దిక్కుమాలిన దీనులుంటారు
జోగల్ల మండపాలు కట్టమన్నాడు
ముస్సపురి బంగళాలు కట్టమన్నాడు
గాలికిందకి ఎల్లి ఆగజ్జితాత

అట్నుంచి సిరిగాలి ఇటు దిప్పినాడు
అవుదువోయి మాతాతఅవు నంతటోడా
కట్టకుండగమేము కొండదిగమన్నారు
కోదండ మనసోమి కొండకెళ్లీపోయె
కిచ్చిడి పులగాలు వంట చేసుకొని
బోంచేసి కాశీలు బొజ్జల్లమెయ్యి
అరగడియపొద్దు అసోదపడ్డారు
అప్పుడేమన్నారు వారు పనివారు
కల్లేల మండపము కడుదుమన్నారు
మళ్లెళ్లి ఆపనులు పట్టుకున్నారు
ఆపెద్ద బాడితలు పట్టుకున్నారు
ఉరగబడి కంటాలు చెక్కబోనారు
ఆపెద్ద బాడితలు ఇరిగిపోనాయి
చిన్నబాడితలన్ని చితకలైనాయి
ఉలులు సేనాలు ఇరిగిపోనాయి
కొండమీదనే వారు కొలువు లెట్టుకొని
ఆపెద్ద బాడిదలు పదునులోసేరు
ఉలులు సేనాలు పదునులోసేరు
చేతిసేబాడిదలు పదునులోసేరు
మళ్లెళ్లి ఆపనులు పట్టుకున్నారు
ఆపెద్ద బాడిదలు ఇరిగిపోనాయి
చిన్నబాడిదలన్ని చితకలైనాయి
అప్పుడేమన్నారు బాలకాశీలు
మమ్ముదెచ్చిన పెద్దకాశీడా
అన్నాయ మెరుగము అచ్చాయపరులము
పెద్దబాడిదలన్నీ ఇరిగిపోనాయి
చిన్నబాడిదలన్నీ చితకలానాయి
ఆమాటలిన్నాడు పెద్దకాశీడు
అవునర్ర పనివోరు అవునంతవారు
ఎవరిసేమన్నారు ఎవరొచ్చినారు
వనుకుతా వనుకుతా తాతొచ్చినాడు

గజ్జితాతొచ్చినాడు మావద్ద కిపుడు
జోగల్ల మండపాలు కట్టమన్నాడు
కల్లేల మండపాలు కట్టమన్నాడు
ముస్సపురి బంగళాలు కట్టమన్నాడు
కట్టకుండా మేము కొండ దిగ మన్నాము
అంతకంట మాకు ఏమి తెలవదు
ఆమాటలిన్నాడు బాలకాశీడు
అవునర్ర పనివోరు అవునంతవారు
గజ్జితాతయినాడు గగన నరిసిమ్మ
ఎంతపని జేసినారయ్యా పనివోరా
అప్పుడేమన్నాడు బాలకాశీడు
అవుదువోయి మాసోమి అవునంతటోడా
కల్లేల మండపాలు కట్టించుకో
జోగల్ల మండపాలు కట్టించుకో
ముస్సపురి బంగలాలు కట్టించుకో
గుర్రాల సావిల్లు కట్టించుకో
అనుకోని కాశీడు పూని సోకించె
సోకాప విన్నాడు నీలయెన్నుండు
గజ్జితాతయినాడు గగన నరిసిమ్మ
వనుకుతా వనుకుతా తాతొచ్చినాడు
అట్టికన్నుల జూసి వారు కాశీలు
పదివేల కాశీలు పరుగెట్టి కెళ్లి
పట్టుకొని తాతను ఎత్తుకున్నారు
అవుదువోయి మాతాత అవునంతవాడ
మాకు పనులూ జెప్పు మాగజ్జితాత
మాతోని పనిజెయ్యి మాగజ్జితాత
ఆపలుకులిన్నాడు నీల యెన్నుడు సోమి
అయ్యయ్యొ పనివారు అవునంతటోరు
మీతోని పనిజేస్తే నాకేమి ఇస్తారు
మీకు పనులు జెప్పితే నాకేమి వచ్చు
ఆమాటలిన్నారు అయ్యా పనివారు

అవుదువోయి మాతాత అవునంతటోడా
మాకందరికి ఒకవంతు నీకు రెండొంతులు
నీకు రెండొంతులు ఇస్తుమన్నారు
ఆమాటలిన్నాడు నీలయెన్నుండు
పరవతానికి ఎల్లి నీలయెన్నుడుసోమి
ఆకు తెలియకన్న చెట్టు తెలియకన్న
పత్తి ఆకులు తీసి పట్టుకున్నాడు
అరిచేత నాయాకు నలిపేసినాడు
నలిపి తెచ్చిన పసురు బాడిదలపై జల్లె
పలక మీదస్త్రాలు పట్టిమోపేను
అవునయ్య పనివారు అవునంతవారు
మీపనులు మీరు చేసుకోమన్నాడు
ఆమాట లిన్నారు బాలకాశీలు
మళ్లెళ్లి ఆపనులు పట్టుకున్నారు
ఒరగాబడి కంబాలు చెక్కుతున్నారు
ములమక్రలకన్న మెత్తగా తెగినాయి
నున్నంగా చెక్కేరు నునుపు లెట్టేరు
సక్కగా కంబాలు తరినిబట్టేరు
కల్లేల మండపాలు కడుదుమన్నారు
సాపులే చెక్కేరు సదునులే చేశారు
సిత్తిరి బట్టారు సిలికిరాశారు
గాతలే తవ్వారు గదులు కొలిచీనారు
కుందమీదను కుంద కుదిరించినారు
ఆమీద నడ్డుపలకమిరించినారు
కల్లేల మండపాలు కట్టేసినారు

1 తన ఈడు బాలలతో కలిసి చిన్నయ్య బొంగరాలాట ఆడుతున్నప్పుడు అతని చేయి ఒక స్త్రీకి తగులగా ఆమె అతణ్ణి తండ్రిలేని తనయు ముండాకొడకా అని తిట్టినట్లుగా కొంతమంది దాసులు పాడుతారు.

ఇంతటంతట బాల ఇలమీద పెరిగి

అన్నలారా మీరు అచ్చాయిపరులార
ముస్సపురి బంగళాలు కడుదుమన్నారు
గదులు కొలిచీనారు గాతలే తవ్వారు
కుందమీదను కుంద లమిరించినారు
ఆమీద పలకలు అమిరించినారు
ముస్సపురి బంగలాలు కట్టేసినారు
జోగాలమండపాలు కట్టేసినారు
అందులో పలకలు మిగిలిపోనాయి
అన్నలారా మీరు ఓతమ్ములారా
మిగిలిన పలకలు ఏమిజేద్దాము
గుఱ్ఱాలసావిళ్లు కట్టిరాయేల
మరికొన్ని పలకలు మిగిలిపోనాయి
మిగిలిన పలకలు ఏమిజేద్దాము
పుట్టుదారల వద్ద ఓజులేశారు
కాశీడు కొడుకేమో చిన్నయ్యకాశీడు
పుట్టాడు చిన్నయ్య పత్తివలసల్ల
అంతటింతట బాల ఇలమీద పెరిగె
ఎండిగిన్నెల్లోను ఎన్నదినసీడు
పైడిగిన్నెల్లోను పాలుదాగీడు
కుండ్రగిన్నెల్లోను కూడు దినసీడు
ఇంతటంతట బాల ఇలమీద పెరిగి
తనఈడు బాలలతో ఆటకెల్లీనాడు [1]
బాలలంత గూడి ఏమిపలికేరు
తండ్రినేనీవాడ తనయుడానీవు
మాతోని ఆటలు ఆడనీకు తగదు
తనఈడు బాలలతో ఆటలాకెల్లి
బొంగరాలాట ఆడుతున్నాడు
నీలారి కాంతలు నీల్లకెల్తుంటె
తప్పాకన్న ఆడిచెయ్యి తగులుతున్నాది
ఓరితండ్రిలేని తనయూ ముండాకొడకాని

ఆమాటలిన్నాడు చిన్నయ్యా కాశీడు
వాడితల్లి వద్దకు పరుగునెల్లేను
అమ్మరో మాయమ్మ ననుగన్నతల్లి
తల్లీవే నువ్వమ్మా మాతండ్రీ ఎవరు
నాఈడు బాలలు నన్నుసెంకించారు
తండ్రిసేనివాడా తనయుడా అన్నారు
బాబు సేనివాడా బాలుడా అన్నారు
బాబు ఏడోలమ్మ తాసుందరమ్మ
ఆమాట లిన్నాది చిన్నయ్యతల్లీ
నాయనా నాయబ్బా నాముకుమారా
మీతండ్రీ కాశీడు తూరుపెల్లీనాడు
తూరుపుదేవుళము కట్టెల్లినాడు
ఇంటిముందేసేడు ఇలగంగిరేగొకటి
ఆపక్కానేశాడు అల్లోనేరేడు
అల్లొనేరెడు పండ్లు పండిఉన్నాయి
పండ్లుకోసి బుట్ల పోసిఇస్తాను
పడమటోల్లంతాను పరస కొస్తారు
డోలాయపున్నమ దొడ్డయాతరలు
ఆళ్లతో నువ్వు ఎళ్లారా బాబు
అడివార పెదచెరువు కోనేరు కెళ్లు
అడివార పెదచెరువు స్నానాలు చేయు
ఆపసుపు కుంకాలు పైడమ్మకియ్యి
అచ్చంగా ఆరాగి దచ్చినాలే సురా
తొల్లి దువ్వారాల టెంకాయగొట్టు
పన్నెండు దారల స్నానాలు చేయు
గంగదారల వద్ద పళ్లబాజారులో
పళ్లబాజారులో పళ్లనమ్ము
పండుకే పండెత్తు బంగారమెత్తంటే
పళ్లెవరు గొనలేరు పరవతముమీద
పళ్లెవరు గొంటారు వాడు మీతండ్రి
వాడితల్లి అతనికి ఆనవాలు జెప్పింది

పండ్లుకోసి బుట్లోపోసి ఇచ్చింది
పండ్లు పట్టుకొని చిన్నయ్యా కాశీడు
ఏగ్రిమున తూరుపుకు ఎళ్తనున్నాడు
అడివార పెదచెరువు కోనేరు కెళ్లి
అడివార పెదచెరువు స్తానాలు చేసె
ఆపసుపుకుంకాలు పైడమ్మకిచ్చి
అచ్చం ా ఆరాగి దచ్చినాలేసె
తొల్లి దువ్వారాల టెంకాయగొట్టి
పన్నెండుదారల స్నానాలుచేసి
గంగదారల వద్ద పల్లబాదారులో
పళ్లబాదారులో పళ్లుబెట్టీనాడు
పదివేల కాశీలు పళ్లు గొనవచ్చి
ఈపళ్లా కరీదు చెప్పమన్నారు
అప్పుడేమన్నాడు చిన్నకాశీడు
పండుకే పండెత్తు బంగారమెత్తు
ఆమాటలిన్నారు వారు కాశీలు
కొనలేక కాశీలు మళ్లిపోనారు
ఆరెల్లి కాశీడికి కబురు జెప్పేరు
అయ్యయ్యా కాశీడా పెద్దకాశీడా
పన్నెండు ఏళ్లోడు బాలు డొకడున్నాడు
పళ్లు బాదారిలో పళ్లమ్ముతున్నాడు
పండుకే పండెత్తు బంగారమెత్తు
ఆమాటలిన్నాడు బాలకాశీడు
అప్పుడే కొడుకని అనుకున్నాడు
మడమెత్తుపరుగునమరినగువునొచ్చేడు
కొడుకుదే నిజరూపు తండ్రి జూసీనడు
అప్పుడేకొడుకాని అనుకున్నాడు
అప్పుడేమన్నాడు పెద్దకాశీడు
ఏఊరు బాలుడా ఏవాడ నీది
దేశంబు పేరేమి చెప్పమన్నాడు
తల్లిపేరేమని తండ్రిపేరేమని

ఆమాట లిన్నాడు చిన్నకాశీడు
మాతండ్రి కాశీడు తూరుపెళ్లీనాడు
తూరుపుదేవళము కట్టెళ్లినాడు
మాతల్లి సుందరమ్మ నన్ను పంపింది
పళ్లుబాదారిలో పళ్లమ్మమంది
పండుకే పండెత్తు బంగారమెత్తు
పళ్లెవరు గొనలేరు పర్వతంమీదా
పళ్లెవరు గొంటారు వాడు మీతండ్రాని
మాతల్లి సుంద్రమ్మ చెప్పి పంపింది
అప్పుడేమన్నాడు పెద్ద కాశీడు
నాయనా నాయబ్బా నాముకుమారాని
తండ్రినీ కొడుకూను కౌగలించుకొని
పదివేల కాశీలకు పళ్లు బంచీనారు
బాబురా ఒరేబాబు బాలచిన్నయ్య
కష్టపడి దేవుళము నేనుగట్టాను
ఇంతోటి దేవుళము నేనుగట్టాను
కొడుకూను తండ్రీని కలుసుకోని
దేవుళము చుట్టాను తిరిగి చూశారు
అప్పుడేమన్నాడు చిన్నకాశీడు
బాబురా ఒరే బాబు తండ్రి కాశీడా
కంబాన్ని కొరత ఉంది అయ్యకాశీడా
ఆమాటలిన్నాడు తండ్రి కాశీడు
బాబూరా ఒరేబాబు బాలచిన్నయ్య
ఏకొరత ఉన్నాది ఎంచరా కొడక
తండ్రిచేతిని ఉలి తాదీసికోని
కంబాన్ని ఆ ఉలితో గట్టిగా నాటె
అది చెక్క నొక కప్ప జలదిలో గలసె
ఆకప్ప కంబమని పేరు బెట్టారు
బాబురా ఒరేబాబు అయ్యకాశీడా
మరి ఒక్క సాటువా మళ్ల ఇన్నావా
తూరుపున దువారము పెట్టినావు
తూరుపు సూర్యకళలు దేవుడికి తగులును
తూరుపుకి దువ్వారము ఉండరాదు తండ్రి
పడమటికి దువ్వారము తిప్పాల తండ్రి
ఏమంట పలికినడు పెద్దకాశీడు
సిమ్మదిరి దేవుళము నేను గట్టాను
ఏరీతి తిప్పదువు నను గన్నతండ్రి
ఎంతమాటన్నావు బాల చిన్నయ్య
బాబురా ఒరే బాబు అయ్యకాశీడా
నీచలవ అయితేను నేను దిప్పతాను
ఒరే తిప్పరా నాకొడకా కళ్లజూస్తాను
ఆమాట లిన్నాడు చిన్నకాశీడు
దేవేంద్రనోకాలు పొరటించాడు
దయచేసి సూరుండు దరిని రదములు
ఇచ్చె
ఏకావన్నెవి మంచి సక్కన్ని అశ్వాలు
ఎంచి పూసీనాడు ఎల్లటశ్వాల్ని
పసిడి తుమెదలాంటి పచ్చటశ్వాల్ని
ఎత్తిపూసీనాడు ఎండిగొలుసులని
పట్టిపూసీనాడు పైడిగొలుసులని
ముత్యాల కొరడాలు మునియేల నంది
గిరగిరని కొరడాలు బిరబిరని దిప్పి
రెచ్చగొట్టశ్వాల్ని రెచ్చదోలేను
పెలపెలనిదేవుళము పెల్లగిల్లింది
బాబురా ఒరేబాబు తండ్రీ కాశీడా
నువ్వు గట్టిన దేవుళం మాతల్లి జూడాల
పత్తి వలసల్లోకి పట్టుకెళతాను
ఆమాటలిన్నాడు పెద్దకాశీడు
ఈడు ఉంచద్రా దేవులాన్ని ఉగము
లోపలను
చందరాయుదం కత్తి పట్టుకున్నాడు
అశ్వాల్నీ బొడిసేడు అయ్యకాశీడు

రదములోని బాలుడ్ని అందుకున్నాడు
నువ్వు పత్తివలసల్లుంతె బతికిపోదువు కొడకా
నీకు నాకిది రునము బాలచిన్నయ్యాని
కండించి కొడుకుని నడిమికె నరికె
కొడుకు పేగులు దీసి జన్నిదము ఏసె
కొడుకు జంపుకున్న తండ్రివంటారని
తన కత్తితో తాను పొడుసుకున్నాడు
అట్టికన్నులజూసి నీలయెన్నుండు
అవుదువోయి కాశీడా అవునంతవాడా
ఎంతపనిజేశావు అయ్యకాశీడా
నీకు వైకుంటవిద్దునని అనుకున్నాను
అమాటలిన్నాడు బాలకాశీడు
వైకుంటము నాకొద్దు వరము నాకొద్దు
నీపక్కసోటియ్యి నీలయెన్నుండా
దరవాజ ఎనకాల స్తానమిచ్చేను
తండ్రీని కొడుకూను పెనపేగులేసుకొని
గుడిదరవాజ కెనక నున్నారు
అప్పన్న పంచన అమరియున్నారు
అప్పుడేమన్నారు బాలకాశీలు
చిన్నీరి పెద్దీరి ఓరి మామల్లన్న
మన పాపములు తగిలి మన దోసములు తగిలి
తండ్రీని కొడుకూను ఆయికంబయ్యారు
సిమ్మాదిరప్పన్న మాదొడ్డదేముడు
సెక్కాకాడికి మనకు జీతమిచ్చాడు
కాశీడు ఉండేటి బసలకెలదామని
అపుడు కాశీడు ఉండేటి బసలకెళ్లారు
సుత్తితో తాళాలు ఈడదీసేరు
నోపట దరబార నోవిల్లకెళ్లారు
దనము కన్నులజూసి బాలకాశీలు
కలబొంగి పోనారు బాలకాశీలు
ఈదనము ఆదనము దోసికున్నారు
పెద్ద పెద్ద గుమ్మడీ మూటలే గట్టారు
ఒక్కడికి ఒక్కడూ పట్టెత్తుకున్నారు
కొండదిగి వారు వస్తున్నారు
వారిలోనే వారు మాటలాడేరు
ఈదనము పట్టుకొని మన ఇల్లకెలితేను
తరము తరములదాకా బతికి పోతాము
కాపోడిలచ్చిమి మనకుండబోదు
నాగళ్లు చెక్కొద్దు నక్కు లెయ్యొద్దు
కాపోడి కల్లాల కొడ్డుకెళ్లొద్దు
కాపోడి నచ్చిమి మన కుండబోదు
అపుడు బుగబుగనితాళాలుదిమిదిమని మద్దెలు
పంచమ్మ నాదాలు పాటలే పాడేరు
ఇల కాంచుదేవిలాన్నిమిడివున్న తండ్రి
కాశీల మాటలు ఆలకించాడు
కానీరా కాశీలు కానియ్యమన్నాడు
సెక్కాకాడికి మీకు జీత మిచ్చాను
మిక్కుపోయి మీరు మిగులనాడేరు
నాగటను దున్నాల నవరుసులు పండాల
అన్ని శివజంతువులకి ఆరమేయాల
నాగళ్లు చెక్కాల నక్కులెయ్యాల
కంసాలి నేపోతే కత జరుగబోదాని
మాయదొంగల బన్నె మాదముడుసోమి
దొంగలా మర్రిధగ్గర పొంచి ఉన్నారు
కొండదిగి కాశీలు వస్తున్నారు
దొంగలమర్రి వద్దకు ఆరొచ్చినారు
ముందొచ్చినోడిని ఒకదెబ్బగొట్టేరు
నెత్తిమీద మూట నేలపై పారేసి
కల్లిబిల్లియినారు కంసాలి బలము

కొండదిగి వారు పారొచ్చినారు
అపుడు కడనుంచి కొడి దాకా
గంగదారలదాకా
గంగదారలదాకా దోచేసినారు
అప్పుడేమన్నారు వారు కాశీలు
ఆలుబిడ్డల్నిడిచి అన్నదమ్ముల్నిడిచి
ఆరునెల్లయింది ఈకొండకొచ్చి
ఇల్లు ఇడిచీనాము ఇల్లాల్నిడిచి
ఆరునెల్లయింది ఈకొండ కొచ్చి
జీతాలు నేవయ్య బత్తాలు లేవు
కష్టపడిన డబ్బు దొంగలపాలైంది
మనము ఇంటికి ఎళ్లి ఏమి తింటాము
మనము ఇంటికాడ ఏమి జెప్పుదుము
ఏమి పట్టుకొని ఇల్లకెళ్తామని
ఎవరి ఉల్లతోనే వారు పొట్టచీరి
కొండమీద పాణాలు విడుతుమన్నారు
కొండమీదను మనము చెల్లిపోదాము
ఇల కాంచుదేవిలాన్నిమిడియున్న తండ్రి
కాశీలు ఆడేటి మాటలిన్నాడు
కంసాల్లే లేకపోతే కత జరుగబోదు
నాగల్లే చెక్కాల నక్కులెయ్యాల
నాగల్లేపూసి నలగదున్నాల
నాగటారునగాని స ారుసులు పండు
అన్ని శివజంతువులకు ఆరమేయాల
కంసాల్లే లేపోతే కత జరుగబోదు
శెంకుసెక్కారాల దాశావతారుడు
మనిసిరూపైనాడు మాదవాసోమి
బత్తులుండేచోట కొచ్చేనాపల
అవుదురోయి కాశీలు అవునంతవారు
చెపుతాను కాశీలు చెవులాలకించండి
చెడుబుద్దులెవ్వరో మీకు చెప్పారు

పేనాము ఉంటేని బలుసాకు తిందురు
సచ్చిపోయి మనము ఏమి సాదిస్తాము
ఈ దనము ఎవ్వరిది ఈబలము ఎవరిది
దనమూను బలమును కావిడీ కొమ్ములు
మీరు దనముకోసం పానమెడతారా
కొండమీదను డబ్బు కొండ మీదున్నాది
పేనాలు మీరేమి విడిచిపెట్టొద్దు
అప్పుడేమన్నాడు నీలయెన్నుండు
ఊరికొక నాయుడ్ని పిలిపించినాడు
నాగల్లు చెక్కాల నక్కులెయ్యాల
నాగల్లతో బూమి నలగదున్నాల
కాపోళ్లకల్లాల వార కెళ్లండి
బత్తులకు ఆవరము లిచ్చెనాసోమి
ఊరి కొక బత్తుడిని పంచేసినాడు
అందరిని పంచగా ఒక్కడున్నాడు
అందులో కాశీడు మిగిలిపోనాడు
అప్పుడేమన్నాడు నీలయెన్నుండు
అవుదువోయి కాశీడా అవునంతవాడ
కొండమీదను నువ్వు ఉండిపోవాల
సిమ్మాచలం చూసుకొని నువ్వు ఉండాల
రాయి బోయినసోట రాయిపెట్టాల
ముక్క బోయినకాడ ముక్కలెట్టాల
దేవుళము చూసుకొని నువ్వుండిపోవాల
చెప్పినట్లు చెప్పి చేతిలో చెయ్యేసి
మాయయ్యిపోనాడు మాదవాసోమి
ఇలకంచుదేవిలాన్నిమిడికున్నాడు
అడివారా పర్వతా లానుకున్నాడు
ఇక్కడికి దేవులము ఇంతయితేసాలు

## కొన్ని పదాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| సేరు పయినాడు | : | చేరుకున్నాడు |
| మునుపళ్లు | : | ముందుపళ్లు |
| నలరాయిలు | : | నల్లరాళ్లు |
| నిలవంటి కాశిలో | : | నిలబడడానికి తగిన లోతుగల నీటిలో |
| పాతోడ్ని కంబాలు | : | మట్టిలో కూరుకుపోయిన స్తంభాలు |
| శరియరము | : | శరీరము |
| అన్నిసమనాదుండు | : | అన్న అయిన విశ్వనాధుడు |
| ఇశమన్న | : | అన్న అయిన విశ్వనాధుడు |
| అంకించినాడు | : | ఎత్తాడు |
| చిలికేరు పడ్డాయి | : | బొమ్మలు బయట పడ్డాయి |
| అష్టగిరి పాలకులు | : | అష్టదిక్పాలకులు |
| నాటంగ జూసినడు | : | స్పష్టంగా చూశాడు |
| రుచ్చాలు | : | వృక్షాలు |
| దుప్ప కలముల రాత | : | దుప్పి బొమ్మలు |
| ఇష్టుమౌతారాలు | : | విష్ణువు అవతారం |
| ఓరావుతారం | : | వరాహావతారం |
| పారావారాలాట | : | పావురాల ఆట |
| సీలాన్నే | : | దూలం మీద |
| పాల తెరల్లో | : | తెల్లని దోమ తెరలో |
| కలగాసి | : | కలగని |
| తెలవాయికున్నాడు | : | మేలుకొని ఉన్నాడు |
| ఇలకంచు దేవిలాన్ని మిడివున్న తండ్రి | : | భూమిలోని కంచు దేవాలయంలో ఉన్న విష్ణువు |
| పినగాడి, పెదగాడి | : | ఇవి రెండు సింహాచలం దగ్గర ఉన్న ఊర్లు |
| పెడతోవ | : | అడ్డదారి |
| ఏవగుంటడి వారము | : | వేపగుంట, అడివివరం అనే ఊర్లు |
| మద్దీలు | : | మద్ది చెట్లు |
| ఉత్రాసీ | : | ఉత్రాసి చెట్లు |
| కమలాసి | : | కమలాపళ్ల చెట్లు |
| బాగోతముల | : | భాగవతాలు ఆడడానికి |
| సానిమేలం | : | భోగంవారు ఆడడానికి |
| గరిడీలకు | : | సేవగరిడి అనే జానపద కళ ప్రదర్శించడానికి |
| రధము తిరుగుల | : | రధం తిరగడానికి |
| బారు గుండాల | : | పొడవుగా ఉండాలి |

| | |
|---|---|
| నీసాయ మనుసులను | : నీకు సహాయంగా దేవాలయం కట్టేవారిని |
| డోలాయి పున్నము | : డోల్లపున్నమి, ఏప్రిల్ నెలలో సింహాచలంలో జరిగే జాతరను డోలయాత్ర అంటారు |
| పరస | : జాతర |
| రాగి దచ్చినా లెయ్యమను | : రాగి నాణాన్ని దక్షిణగా వెయ్యమని చెప్పు |
| తొల్లి దువ్వారాల | : మొదటి ద్వారం దగ్గర |
| గాతలు | : పునాదులు |
| కుంద | : స్తంభం కట్టడానికి ఉపయోగించే పెద్ద రాయి |
| ఇగ్గునేసుడు | : విఘ్నేశ్వరుడు |
| అనుమంతురాయుడు | : ఆంజనేయుడు |
| పావంచాలు | : మెట్లు |
| దోనూలు | : చిన్న కాలువ |
| అంత్రాన్ని | : ఆకాశంలో |
| సుక్కొకటి పడిగట్టి | : నక్షత్రం చూసి |
| సుక్కురుండు | : శుక్రుడు |
| నవగునములు | : నవగ్రహాలు |
| కావూదనములు | : కాపువారు |
| మూరతన | : ముహూర్తం |
| సుబకంబు | : శంకుస్థాపన |
| పునయాదులు | : పునాదులు |
| సిలుకు | : బొమ్మ |
| ఆరమన్నాడు | : ఆహారమన్నాడు |
| ఆగల సంతోషించి | : చాల సంతోషించి |
| కల్లేల మండపం | : కళ్యాణమండపం |
| కొలువు లెట్టుకొని | : కొలిమి పెట్టి |
| పల్లబాదారు | : పల్లబజారు |
| కొరత | : దోషం |
| సూర్య కళలు | : సూర్య కిరణాలు |
| దువారము | : ద్వారం |
| ఏకావన్నెవి | : ఒకే రంగు కలవి |
| [illegible]సినాడు | : కట్టాడు |
| [illegible]నాము | : ప్రాణం |

# సింహాచల క్షేత్రం - శిష్ట సాహిత్యం

సింహాచల క్షేత్రం పురాతనమైంది, ప్రసిద్ధమైంది కావడంవల్ల ఎంతోమంది కవులు ఈ క్షేత్ర మాహాత్మ్యాన్ని వివరిస్తూ అనేక రచనలు చేశారు. వీటిలో ఒక స్థల పురాణం, కొన్ని వచనాలు, రెండు కావ్యాలు, అయిదు శతకాలుమాత్రమే గాకుండా ఒక దండకం, అయిదు అష్టకాలు గూడా ఉన్నాయి.

**స్థల పురాణం**: శిష్టసాహిత్యంలో సింహాచల మాహాత్మ్యాన్ని వివరిస్తున్న వాటిలో మొదటిది ఈ స్థలపురాణం. ఇది స్కాంద పురాణంలో జగన్నాద క్షేత్ర మాహాత్మ్యం తర్వాత 32 అధ్యాయాల్లో చెప్పబడింది. ఇందులో ఉన్న కథ క్లుప్తంగా ఇది –

శ్రీ మహావిష్ణువు తన ద్వారపాలకులైన జయవిజయులను, సనకసనందులనే మునులను లోపలకు రానివ్వకుండా నిరోధించినందుకు రాక్షసులుగా పుట్టమని శపిస్తాడు. విష్ణువు శాపం ప్రకారం జయవిజయులు హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులుగా జన్మించి ముల్లోకాలను ముప్పుతిప్పలు పెడుతుంటారు. హిరణ్యాక్షకుడు భూమిని ఎత్తుకొని వెళ్తూ ఉంటె విష్ణువు వరాహావతారాన్ని ధరించి హిరణ్యాక్షకుణ్ణి వధించి భూమిని రక్షిస్తాడు. తన సోదరుని చంపినందుకు హిరణ్యకశ్యపుడు విష్ణువు మీద పగ సాధించాలని బ్రహ్మను గురించి తపస్సు చేసి వరాన్ని పొంది అసాధారణ బలసంపన్నుడై దేవతలను మునులను హింసిస్తూ ఉంటాడు. హిరణ్యకశ్యపుని బారినుండి వీరిని రక్షించడం కోసం విష్ణువు సుముఖుడనే తన సేవకుణ్ణి హిరణ్యకశ్యపుని కుమారుడైన ప్రహ్లాదుడుగా జన్మింపజేస్తాడు. ప్రహ్లాదుడు పుట్టినప్పటినుండి విష్ణుభక్తి కలిగి ఉంటాడు. హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుని విష్ణుభక్తిని మాన్పించాలని నయానా భయానా చెప్పి విఫలుడై చివరకు అతణ్ణి చంపించడానికి ఏనుగులతో తొక్కించడం, విషనాగులతో కరిపించడం మొదలైన పనులు చేస్తాడు. విష్ణువు ప్రభావంచేత ప్రహ్లాదుడు ఎలాంటి ఆపద లేకుండా క్షేమంగా ఉంటాడు హిరణ్యకశ్యపుడు చివరి ప్రయత్నంగా ప్రహ్లాదుని సముద్రంలో త్రోసి అతనిమీద పెద్ద పర్వతాన్ని పెట్టమని తన సేవకులకు చెబుతాడు. సేవకులు ప్రహ్లాదుని సింహాచలం కొండమీదనుండి త్రోసి అతనిమీద ఆ కొండను పడవేయాలని ప్రయత్నిస్తూ ఉంటారు. ఈలోగా విష్ణువు సముద్రంలోకి దూకి ప్రహ్లాదుణ్ణి సముద్రంలోనుండి ఎత్తుకొని వచ్చి రక్షిస్తాడు. ఆ విధంగా బ్రతికి బైట పడిన కుమారుని చూచి హిరణ్యకశ్యపుడు కోపంతో నీ హరి ఎక్కడున్నాడో చూపించు అని దగ్గరలో ఉన్న స్తంభాన్ని బద్దలు కొడతాడు స్తంభంలోనుండి నరసింహస్వామి ఉద్భవించి హిరణ్యకశ్యపుని వధిస్తాడు ఆ తర్వాత విష్ణువుప్రహ్లాదుని కోర్కెననుసరించి వరాహ నరసింహ రూపంలో సింహాద్రిమీద వెలుస్తాడు

కొంతకాలం తర్వాత ప్రహ్లాదుడు వరాహనరసింహమూర్తికి ఆలయాన్ని నిర్మిస్తాడు.

కృతయుగాంతంలో ఆ దేవాలయం పూజాపునస్కారాలు లేకుండా శిధిలమై చివరికి వరాహనరసింహమూర్తి విగ్రహం కూడా మట్టితో కప్పివేయబడుతుంది. త్రేతాయుగం ప్రారంభంలో పురూరవుడనే రాజు తన భార్య ఊర్వశితో కలిసి సింహాద్రిమీద ఆకాశయానం చేస్తున్నప్పుడు వారి రథం ఆగిపోతుంది. పురూరవుడు రథంమీదనుండి కొండమీదికి దిగి మట్టితో కప్పబడిన స్వామి వారి విగ్రహాన్ని చూసి, మట్టిని తొలగిస్తూ ఉంటాడు. అప్పుడు ఆకాశవాణి విగ్రహం చుట్టూ ఉన్న మట్టిని తొలగించవద్దని, మట్టిని తొలగించినంతమేర విగ్రహానికి చందనం పూత పూయమని చెబుతుంది. అంతేగాకుండా ఆ విగ్రహాన్ని చందనం పూసిన రూపంతోనే పూజించాలని, సంవత్సరానికి ఒకసారి వైశాఖ మాసంలో మూడవ రోజు మాత్రం చందనం పూతను తొలగించి నిజరూప దర్శనం చేయాలని గూడా ఆకాశవాణి చెబుతుంది. పురూరవుడు ఆకాశవాణి చెప్పినట్లుగా స్వామివారి విగ్రహానికి చందనం పూత పూస్తాడు. తర్వాత అతడే విగ్రహానికి దేవాలయాన్నిగూడా కట్టిస్తాడు. అప్పటినుండి ఆ దేవాలయం ప్రసిద్ధిలోకి వచ్చింది. ఇది సింహాచల క్షేత్రంయొక్క స్థలపురాణంలోని కథ.

**వచనాలు:** కృష్ణమాచార్యులు ''సింహగిరి వచనాలు'' అనే పేరుతో సింహాచలంలో వెలసిన శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామిని ఉద్దేశించి నాలుగు లక్షలకు పైగా వచనాలను రచించాడు. అయితే వీటిలో నూటికి 90 శాతం వరకు లభించలేదు. ఆచార్య ఎమ్. కులశేఖరరావుగారు 60 వచనాలను సేకరించి పరిష్కరించారు. ప్రస్తుతం లభించిన వచనాలను విషయవైవిధ్యాన్ని బట్టి ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు అవి 1. నామ సంకీర్తన వచనాలు, 2. పౌరాణిక వచనాలు, 3. ధార్మిక వచనాలు, 4. కథావచనాలు, 5. జీవిత వచనాలు, 6. సంప్రదాయ వచనాలు. ఈవచనాలన్నీ ''దేవా'' అనే సంబోధనంతో ప్రారంభమై విష్ణు నామ సంకీర్తనంగాని, పూర్వ భాగవత కథాకథనం గాని వచన వస్తువుగా ఉంటూ చివరకు నమస్కారంతో ముగుస్తాయి.[1]

**ఉదాహరణగా కొన్ని వచనాలు** : 1.''దేవా ! ఇంద్రాది దేవతలు నూఱునను, హిరణ్యగర్భులిన్నూఱును, కాశ్మీర గిరులు మున్నూఱును, తిలదాంచన గిరులు నిన్నూఱును, పతివ్రతలు వేనూఱ్లును, అగ్రహారంబు లాఱునూఱ్లును, స్త్రీమూర్తు లేడునూఱ్లును, కపిల ధేనువులు వేయిని, కాలచక్రంబు లక్షయును, తులాపురుషంబులు కోటియును, కన్యకాదానంబులుపదికోట్లును, నివి యన్నియు గూడినమీ దివ్యనామ సంకీర్తన వినినందులకు వేయిలో నొక్క భాగంబునకు సరిగావు. ఈ సంకీర్తన ఫలంబెవరు వ్రాసిరి, యెవరు చదివిరి యెవరు వినిరి వారి కాయురారోగ్యైశ్వర్యంబులు కృపచేతువు. అటుమీదట వైకుంఠంబు కృపచేతువు మాయతి రామానుజముని వరము దాతారు. అనాధపతీ, స్వామీ, సింహగిరి నరహరీ, నమోనమో దయానిధీ ! (సింహగిరి వచనములు, సింహాచలం దేవస్థానం).

1 ఉత్తరాంధ్ర క్షేత్రమహాత్య సాహిత్యం - అనుశీలనం,
[illegible] పుట 195

2.దేవా, శ్రీమన్నారాయణా, పరబ్రహ్మ స్వరూపా, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా, వేదవేదాంత వేద్యా, పురాణ పురుషోత్తమా, పురందర వద్యా, కపట నాటక సూత్రధారీ, మాయా వినోదా, అగణిత మహిమావతారా, లోకపావనా, మైథిలీ సమేతా, ఆనందా, జయజయ శ్రీరాఘవేశ్వరా, మాయతిరామానుజా, సింహగిరి నరహరీ, నమోనమోదయానిధీ ! (సింహగిరి వచనములు, సింహాచల దేవస్థానం)

కృష్ణమాచార్యుల వచనాలను అనుసరించి తాళ్లపాక పెదతిరుమలాచార్యులు శ్రీ వేంకటేశ్వర వచనాలను రచించారు. వేంకటేశ్వర వచనాలమీద సింహగిరి వచనాల ప్రభావం ఎంతైనా ఉంది. కృష్ణమాచార్యుల పై రెండవ వచనాన్ననుసరించి పెదతిరుమాలాచార్యులు ఇలా రచించాడు.

''శ్రీ జనార్ధనా, శ్రీ భూర్ణానీళాసమేతా, శంఖచక్రగధా ఖడ్గ శార్ఙాయుధధరా, శ్రీ కౌస్తుభ మణి, శ్రీ వత్సశోభిత వక్షా, పీతాంబరధరా, మణికిరీట మకరకుండలాభరణా, వైజయంతీ వనమాలాభరణా, పుండరీకాక్షా, అనేక బాహుదండశిరః, పాణి పాదోరుజం ఘూవయువా, అనురక్షకా, జగన్నివాసా, జయజయ నీకుననంత నమస్కారంబులు సేసెద, అవధారు, శ్రీ వెంకటేశ్వరా (శ్రీ వేంకటేశ్వర వచనములు)

**కావ్యాలు :** స్థల పురాణంలోని కథ ననుసరించి కూచిమంచి తిమ్మకవి సింహాచల మాహాత్మ్యం అనే కావ్యాన్ని, కట్టమూరి కామేశ్వర కవి లక్ష్మీనరసింహ చరిత్ర అనే కావ్యాన్ని రచించారు. వీటిలో కామేశ్వర కవి కావ్యం లభించలేదు.

**సింహాచల మహాత్మ్యం :** కూచిమంచి తిమ్మకవి 18వ శతాబ్దానికి చెందినవాడు. ఇతడు తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న పిఠాపురం జమీందారుల ఆస్థానంలో ఉన్నాడు. సింహాచల మాహాత్మ్య కావ్యాన్ని ఇతడు అయిదు ఆశ్వాసాలుగా 931 పద్యాల్లో రచించాడు.

సింహాచల మాహాత్మ్య కావ్యం క్షేత్ర మాహాత్మ్య గ్రంధం. అందువల్ల ఇందులో క్షేత్ర వర్ణన, దైవ వర్ణన, తీర్థ వర్ణన, ప్రకృతి వర్ణనలు మొదలైనవి ఎక్కువగా ఉన్నాయి.

సింహాచల క్షేత్ర మాహాత్మ్యాన్ని గురించి జైమినీ మహర్షి శౌనకాది ఋషులకు చెప్పినట్లుగా కవి ప్రథ మాశ్వాసంలో ఇలా వివరించాడు.

**''మఱియును సింహాద్రి మహిమ వర్ణించెద**
**వినువారి కెంతయు విస్మయముగ**
**మదిబుట్టయగ్గిరి మాహాత్మ్యమంతయు**
**నెన్నిక గావింప నెన్న దోపు**
**సకల ధర్మంబులు ప్రకటంబుగా నందు**

దినదినంబును బ్రవర్తించుచుండ
నవిరళముగ మహేంద్రాది శైలములనే
కమ్మలు ధరణిపై గలుగు గాని
యెవ్వియును సింహగిరితోడ నీడురావు
గంగ మొదలగు నదులు చక్కగ ప్రవాహ
రూపమున నందు బ్రవహించు నేపు మీర
మునుగు వారల నెపుడు బావనుల జేయ (1 - 21)

సింహాచలంలో పుట్టిన మానవులకు మళ్లీ జన్మ ఉండదని, ముక్తికి హేతువైన మానవ జన్మ ఎత్తిసింహాద్రికి వెళ్లనివారు దైవవంచితులవుతారని అందువల్ల మానవునిగా పుట్టిన ప్రతివాడు తప్పనిసరిగా సింహాచలేశుని దర్శించాలని (1 -117.118) చెబుతూ -

కావున నెల్లవిధంబుల
గైవల్య పదంబు గోరు ఘనుడెక్కడికిన్
బోవక సింహాచలమున
పావనమతి నుండవలయు ప్రతివాసరమునన్ (1.120)

అని సింహాచల మహిమాతిశయాన్ని కవి వివరించాడు.

సింహాచలం కొండ సింహం ఆకారంలో ఉండడంవల్ల దానికి ఆ పేరు వచ్చినట్లు జైమిని శౌనకాది ఋషులకు చెప్పినట్లుగా ఇందులో చెప్పబడింది.

కం. సింహాకారంబున నర
సింహాధిష్ఠితమునై వసించు నగేంద్రం
బంహస్సంహారకమది
సింహాద్రి యనంగ బరగు శివకరమగుచున్ (1.78)

ప్రతి పుణ్యక్షేత్రంలోను పవిత్ర ప్రవాహాలుంటాయి వీటిని తీర్థాలు అంటారు. తిరుపతిలో పాపనాశనం, శ్రీశైలంలో పాతాళ గంగ మొదలైనవి పవిత్ర తీర్థాలు. అలాగే సింహాచలంలో గూడా 'గంగధార' పవిత్ర తీర్థం. ఇది సింహాచలంలో స్వామికి పశ్చిమాభిముఖంగా ఉంది. గంగధార మహిమను కవి సింహాచల మాహాత్మ్యం కావ్యంలో ఇలా వివరించాడు.
పశ్చిమ దిక్కున ఉన్న గంగధారలో మునిగి పశ్చిమ దిక్కున ఉండే నరహరిని దర్శిస్తే పాపాలన్నీ నశిస్తాయి.

మాఘమాసంలో వేకువజామున గంగధారలో స్నానం చేస్తే ప్రయాగలో స్నానం చేసిన ఫలం కలుగుతుంది.

తే. గీ. మకరమున రవి వశియింప మాఘమాస
మున బ్రయాగంబు లోపల మునిగినట్టి
ఫలము సిద్ధించు నరుడు ప్రభాత వేళ
మోదమున గంగధారలో మునిగెనేని (1.104)

గంగధారలో స్నానం చేస్తే ఘోరమైన పాపాలు, క్షయ, కుష్టు మొదలైన రోగాలు నశించడమే గాకుండా కోరిన కోరికలన్నీ సిద్ధిస్తాయి(1.104)

కూచిమంచి తిమ్మకవి స్థల పురాణంలోని కథకు ఎలాంటి మార్పులు చేయకుండా సింహాచల మహాత్మ్య కావ్యాన్ని రచించాడు. ఇది క్షేత్ర మాహాత్మ్య గ్రంథం కావడం వల్ల ఇందులో విష్ణు మూర్తి మహిమలు ఎక్కువగా వర్ణింపబడ్డాయి. ఈ వర్ణనల వల్ల కథ మందంగా సాగుతుంది.

**లక్ష్మీనరసింహ చరిత్ర**: సింహాచల స్థల పురాణంలోని కథను ఆధారంగా చేసుకొని కట్టమూరి కామేశ్వర కవి లక్ష్మీనరసింహ చరిత్ర అనే కావ్యాన్ని రచించాడు. ఇతను 19వ శతాబ్దానికి చెందినవాడు. ఇందులో విష్ణువు నరసింహావతారమెత్తి హిరణ్యకశ్యపుని చంపినతర్వాత వరాహ నరసింహుని రూపంలో సింహాద్రిమీద వెలవడం, ప్రహ్లాదుడు ఆ మూర్తిని సేవించడం వరకు ఉన్న కథ మాత్రమే వివరింప బడింది.[2] ఊర్వశీ పురూరవుల వృత్తాంతం ఈ కావ్యంలో చెప్పబడలేదు.

**శతకాలు**: సింహాచల క్షేత్రం మీద గోగులపాటి కూర్మనాద కవి సింహాద్రినారసింహ శతకాన్ని, మండపాక పార్వతీశ్వర శాస్త్రి వరాహ నారసింహ శతకాన్ని, మూలాపేరన్న శాస్త్రి శ్రీ వరాహ నారసింహ శతకాన్ని,. మానాప్రగడ శేషశాయి శ్రీ చందనం అనే శతకాన్ని, మదినె సుభద్రయ్యమ్మ సింహాచలాధీశ్వర శతకాన్ని రచించారు. వీటిలో మదినె సుభద్రయ్యమ్మగారి సింహాచలాధీశ్వర శతకం లభించడం లేదు.

**సింహాద్రి నారసింహ శతకం**: ఈ శతకాన్ని గోగులపాటి కూర్మనాథ కవి రచించాడు. ఇతడు ఆరువేల నియోగి బ్రాహ్మణుడు. ఇతని తల్లిదండ్రులు గౌరమాంబ, బుచ్చెన్నలు. ఇతడు నేటి విజయనగరం జిల్లాలోని రామతీర్థ గ్రామ నివాసులైన పెద్దింటి సపత్కువూర, వేంకటాచార్యులవారి శిష్యుడు. ఇతడు విజయనగర సంస్థాన దేవస్థాన శాఖలో ఉద్యోగం చేస్తూ రామతీర్థం, పద్మనాభం, సింహాచలం, శ్రీకూర్మం మొదలైన చోట్ల ఉన్నాడు. ఈ శతకం రాయడానికి గల కారణం సింహాచల దేవస్థానంవారు ప్రచురించిన ఈ శతక పీఠికలో ఇలా ఉంది.

క్రీ.శ. 1753 వ సంవత్సరంలో దక్కన్ సుబేదారైన సలాబత్ జంగ్ ఉత్తర సర్కారు ప్రాంతాన్ని

2 The Simhachalam Temple Dr Sundaram.P-56

ఫ్రెంచి దొర బుస్సీకి కౌలుకిచ్చాడు. బుస్సీ మచిలీపట్నంలోని మారిసన్ అనే అతన్ని రాజమహేంద్రవరం, శ్రీకాకుళం సర్కారులను స్వాధీనంచేసుకోవడానికి పంపించాడు శ్రీకాకుళం ఫౌజుదారు జాఫరల్లీఖానుకు ఇది ఇష్టంలేదు. అదువల్ల అతడు విజయనగర సంస్థానాధిపతి అయిన విజయ రామ గజపతితో సంధి చేసుకొని మారిసన్‌ను ఎదిరించాలనుకుంటాడు. మారిసన్ ఈ విషయాన్ని గ్రహించి, విజయరామ గజపతితో తానే ముందుగా సంధి చేసుకుంటాడు. ఈ విషయాన్ని గ్రహించి జాఫరల్లీ శ్రీకాకుళంనుండి పారిపోతాడు కాని అతడు విజయరామగజపతి మీద ఫ్రెంచివారి మీద పగ సాధించాలని అప్పటికే ఫ్రెంచివారితో యుద్ధంచేస్తున్న నాగపురాధీశ్వరుడైన రఘోజీ భాంస్లే అనే మహారాష్ట్ర నాయకుని వద్దకు వెళ్తూ మార్గమధ్యంలో రఘోజీ కుమారుణ్ణి కలుసుకొని అతణ్ణి బ్రతిమాలి సైన్యంతో కొండలమీదుగా శ్రీకాకుళం సర్కారుకు రమ్మంటాడు. ఆ దళంలో మహారాష్ట్రులు, తురకలు ఉన్నారు మహారాష్ట్రులు ఊర్లను దోచుకుంటూ వస్తూ ఉంటే, తురకలు దేవాలయాలను పడగొట్టుతూ సింహాచలానికి వస్తారు.

ఈ విషయాన్ని తెలుసుకొని దేవస్థాన ఉద్యోగులూ, భక్తులూ అయిన ఆదుర్తి హరిహర దాసు, గోగులపాటి కూర్మనాధుడు అనే ఇద్దరు స్నానం చేసి దేవాలయం గర్భగుడిలో ప్రవేశించి తలుపులు మూసుకొని కూర్మనాధుడు ఆశువుగా ఈ శతకాన్ని చెబుతూ ఉంటే హరిహర దాసు గంటంతో తాటాకు మీద రాశాడు. శతకం మొదట దూషణ తిరస్కారాలతో ప్రారంభమై తర్వాత క్షమార్పణలతో, ప్రార్ధనలతో ముగుస్తుంది. తురకదండు కొండపైకి వచ్చి గుడిని పాడుచేస్తూ గర్భగుడి దగ్గరకు వచ్చేటప్పటికి కంచు తుమ్మెదలుద్భవించి తురకదండును తరిమి కొట్టి చంపుతూ విశాఖపట్నం సమీపంలో ఉన్న గిరిబిలం దగ్గర అంతర్ధానమయ్యాయి.

ఈ విషయం శతకంలోని ఈ పద్యంవల్ల తెలుస్తూంది –

గీ. **అరుల పరిమార్చి వైశాఖపుర సమీప**
**గిరి బిలంబున డాగె బంభరము లెల్ల**
**అది మొదలు తుమ్మెదల మెట్టయంద్రు దాని**
**వైరి హర రంహ సింహాద్రి నారసింహ.**

సింహాద్రి నారసింహ శతకంలో 1 01 పద్యాలున్నాయి. ఈ పద్యాలు ''వైరిహరరంహ సింహాద్రి నారసింహా'' అనే మకుటంతో ఉన్నాయి. సింహాచలానికి శత్రువుల వల్ల ముప్పు కలుగబోతున్న సమయంలో ఈ శతకం రాయబడడంచేత ఇందులోని పద్యాలు భయోద్వేగ, భావోద్వేగ, భక్త్యుద్వేగంతో కూడుకొని గొప్ప కవితాధారను కలిగి ఉన్నాయి.

తురకల ధాటికి ప్రజలు పడ్డ కష్టాలను కవి ఇలా వివరించాడు -

సీ. యవనేశు ధాటికిన్ హడలి సర్వస్వమ్ము
విడిచి మందిరములు వెడలువారు
వెడలియుదలదాచవెరవేమి గానక
నడవుల నిడుమల బడెడు వారు
బడియు నెచ్చట కూడు బట్ట గానక తమ
శిశువులతో వెతజెందువారు
జెంది డెందము గుందగాందిశీక తనభి
మానార్తులై ఖేదమూను వారు
నైరి యొక్కొక్క భార్యతో నవని ప్రజలు
అష్టమహిషులపై పదియారువేల
సతులతో నీవు వలస కెచ్చటి కరిగెదు
వైరి హరరంహ సింహాద్రి నారసింహ (11న పద్యం)

ఒక్కొక్క భార్యను కలిగిన గృహస్థుడే ఇన్ని కష్టాలు పడుతుంటె అష్టమహిషులు ఆ పై పదహారు వేల భార్యలతో నీవు ఎక్కడికి పోగలవు అని కవి దేవుణ్ణి అధిక్షేపించాడు.

సీ. మా మొఖాసాకు గ్రామంబు లిమ్మనలేదు
కొంపలు కాల్పింపకూడదంటి
గరిహయాదుల మేము గాంక్షింపగా లేదు
గోవధ మాన్పించి ప్రోవుమంటి
మాకు మిమ్ములను సామ్రాజ్య మిమ్మన లేదు
జనులను దోపింప జనదంటి
స్వామి మా కొరకేమి కామింపగా లేదు
క్షితిలోన ప్రజల రక్షింప మంటి
జెలగి నీ పదసేవలు సేయు మాకు
వేరె కోరిక లేటికి వెన్నగలుగ
నహహ నేతికి నేటికి నంగలార్ప
వైరి హరహరరంహ సింహాద్రి నారసింహ (54వ పద్యం)

ఈపద్యంలో కవి తనకోసం తానేమి కోరడం లేదని, దుర్మార్గులనుండి ప్రజలను రక్షింపుమని మాత్రమే కోరుతున్నానని, నీ పాదసేవ చేసే మాకు వేరే కోరికలు కలగవని వెన్న ఉండగా నెయ్యి కోసం ఎవరు వెదుకుతారని చెప్పాడు.

ఈ విధంగా కవి భగవంతుని స్తుతించడంవల్ల భగవంతుడు కరుణించి ఉక్కుమూతులు గల గండుతుమ్మెదల దండును సృష్టించి వాటిచేత శత్రుసైన్యాన్ని చీల్చి చెండాడించాడు. అప్పుడు కవి భగవంతుని -

వీరాధివీరుడవై రాజిల్లెడు నిన్ను
బిరికి వాడంటిని భీతిలేక
జగదేక వితరణాశ్రయ మూర్తివగు నిన్ను
బహులోభి వనుచును పలికినాడ
పరిపూర్ణ కరుణా స్వభావుండవగు నిన్ను
నిర్దయుండంచు నిందించినాడ
నద్భుతానంద కల్యాణ గుణుండవౌ
నినుగూర్చి పలికితి నిర్గుణుడని

యలుక జనియించి దుష్టుల నణచు కొరకు
బడుచుదనమున నిటులంటి భక్తవరద
మదపరాద సహస్రముల్ మదిక్షమింపు
వైరిహరరంహ సింహాద్రి నారసింహ

అని ప్రార్థించాడు.
ఈ శతకంలో కవి సామెతలను ఎక్కువగా ప్రయోగించాడు.

''ఇంటికన్న గుడి పదిలమంచు''
''వ్రతము చెడ్డ సుఖము దక్కదు''
''కొండ యెక్కెదు బ్రతిమాలిన కొలది''
''తినదినగ గారెలైన కసరువేయు''
''కందకు లేని దురద బచ్చలకి నేలగల్లు''

**వరాహ నారసింహ శతకం**: ఈశతకాన్ని మండపాక పార్వతీశ్వర శాస్త్రి రచించాడు. ఇతడు బొబ్బిలి సంస్థానాధిపతి అయిన శ్రీ వేంకటశ్వేతాచలపతి రంగారావు బహద్దూరు ఆస్థాన కవి. సింహాచల క్షేత్రంలో ప్రతి చైత్ర మాసంలోను రథోత్సవం చాల వైభవంగా జరుగుతుందని, ఈ రథోత్సవాన్ని భక్తులు తప్పనిసరిగా దర్శించాలని కవి ఇందులో చెప్పాడు. ఒక్కొక్క పద్యంలో నక్షత్రాల పేర్లు, ప్రభవ మొదలుకొని అక్షయ వరకుగల సంవత్సరాల పేర్లు వచ్చేటట్లుగా ఒక నియమం ప్రకారం ఈ శతకాన్ని ఈ కవి రచించాడు. ''ఆహా చిత్రం నీ చరిత్ర - ధృతి పెంపుట్టగ'' మొదలైనవి ఇందుకు ఉదాహరణలు.

ఈ శతకంలో నాయిక విరహ వేదన వర్ణింపబడింది. నాయిక నాయకుడైన నారసింహుని తీసుకొని రావడానికి చెలికత్తె సహాయాన్ని కోరడం ఇందులో ముఖ్యాంశంగా కన్పిస్తుంది. ''అతివ నీవేగి నేడు సింహాద్రి నున్న వరాహ నారసింహుదేగదే వారిజాక్షి'' అనేది ఈ శతకంలో మకుటంగా ఉంది.

**శ్రీ వరహా నారసింహ శతకం** : ఈ శతకాన్ని మూలా పేరయ్య శాస్త్రి కవి ''నరసింహా ! సింహశైలేశ్వరా'' అనే మకుటంతో 109 మత్తేభ, శార్దూల పద్యాల్లో రచించాడు. ఈ శతకంలో ఎక్కువ పద్యాలు సింహాచల శ్రీ వరహ నరసింహ స్వామిని స్తుతిస్తూ రచింపబడ్డాయి.

కవితానువేదాలను చదవలేదని, పండితులను గురువులను ఆశ్రయించి చదువుకోలేదని చెప్పుకున్నాడు.

**నిగమాదుల్ పఠియింపలేదు, బుధసాన్నిధ్యమ్ము ప్రాప్తింప బో**
**దు గురూత్తంశుల పాదపద్మముల బొందున్ బొందగా లేదు (19వ పద్యం)**

కవి, తాను ధనధాన్యాలను కోరలేదని పరుల సొమ్ము కాంక్షించడం లేదని, ఎల్లవేళల భగవంతుని పాదామృతాన్ని మాత్రమే పొంద నపేక్షించానని, అందువల్ల వాత్సల్యాన్ని తనమీద వర్షించి రక్షింపుమని నారసింహుని ప్రార్థించాడు.

**ధనధాన్యమ్ము గోర్కెలేదు పరవిత్త ద్రోహ దుష్కర్మ వ**
**ర్తనలం గాంక్ష యొకింత లేదు సతతమున్ త్వత్పాద పీయూష మొం**
**దనపేక్షించితినయ్య ! నీ సరళ వాత్సల్యమ్ము వర్షించి న**
**న్నును రాగంబున బ్రోవుమయ్య ! నారసింహ ! సింహశైలేశ్వరా(75వపద్యం)**

కవి తననే గాకుండా తన దేశమైన ఆర్యావర్తాన్ని గూడా శాంతి సౌఖ్యాలతో తులతూగేలాగా రక్షించాలని భగవంతుని ప్రార్థించాడు.

**శా. అన్నా నీ దయచేత వర్ధిల్లుచు నార్యవర్తమున్ ఖ్యాతి చేన్**
**వన్నెన్ వాసియు గన్న మా భరత ఖండంబెంతయున్ శాంతి సం**
**పన్నంబై సుఖవంతమై, పరమ ధర్మస్థానమైయుండు న**
**ట్లన్నా నిత్యమొనర్పుమయ్య ! నరసింహా సింహశైలేశ్వరా (102వపద్యం)**

ఈ విధంగా ఈ శతకం సింహాచలాధీశ్వరుని స్తుతితో సాగింది.

**శ్రీ చందనం** : ఈ శతకాన్ని మానాప్రగడ శేషశాయి ''సింహగిరివాస నిత్యలక్ష్మీవిలాస'' అనే మకుటంతో సీస పద్యాల్లో రచించాడు.

కృతులు రాయడానికి అవసరమైన పదజాలం, భావం, రసం, మొదలైనవేవీ తనకు తెలియవని,

శ్రీ నారసింహుని పదాలు మాత్రమే తనకు దిక్కని కవి మొదట ఇలా చెప్పుకున్నాడు -

సీ పదమెరుంగను భావపద మెరుంగను రసా
స్పద మెరుంగను నీదు పదము దక్క
కృతులెరుంగను లోకగతు లెఱుంగను రసా
కృతులైన నీ అలంకృతులు దక్క
దర్శనమ్ము లెఱుంగ తత్వబోధ లెఱుంగ
కనువిందు నీ సుదర్శనము దక్క
కధ లెఱుంగను దర్మవిధులెఱుంగను కృపాం
బుధులు నీ నయనాంత సుధలు దక్క
చరణ మెఱుగను మంగళాచరమ్మైన
నీదు శరణమ్ము దక్క నాకేది దిక్కు
ఏమి వ్రాయింతువో నేరనితనిచేత
సింహగిరివాస ! నిత్యలక్ష్మీ విలాస ! (6వ పద్యం)

కవి, చందనాచ్ఛాదన స్వామి అయిన శ్రీ వరాహ నృసింహస్వామి మాహాత్మ్యాన్ని గురించి ఇలా వివరించాడు -

సీ చందనాచ్ఛాదన స్వామిని వీక్షింప
భవబంధములు పటాపంచలగును
గంధ దైవతమును కనులార చూసిన
కైవల్యమరచేత కాననగును
చలువ వేలుపు రూపు సందర్శనము చేయ
శోకమోహమ్ములు సురిగిపోవు
శ్రీ గంధలాంఛ నాంచితుని దర్శించిన
తాపత్రయ్యమ్ములు తొలగి పోవు
సింహగిరి వంకస్వామి నీక్షించి నంత
చింతలన్నియు తునియలై చెదరిపోవు
పరమ రసభావ దివ్యకృపాస్వభావ
సింహగిరివాస ! నిత్యలక్ష్మీవిలాస (87 వ పద్యం)

ఈ శతకంలో కవి నరసింహస్వామిని మేల్కొల్పడం, ఊర్వశీపురూరవులు స్వామిని దర్శించిన విదం లక్ష్మీ నరసింహస్వాముల వివాహం మొదలైన విషయాలను చెప్పాడు.

సింహాచల నృసింహస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైంది శ్రీ చందనం. అందువల్లనే నృసింహస్వామి ఎల్లప్పుడూ చందనాచ్ఛాదిత రూపంతోనే దర్శనమిస్తాడు. చందనం ఎంతో చల్లనిది శ్రీకరమైంది. అందువల్లనే కవి తను రాసిన శతకానికి శ్రీ చందనమని పేరు పెట్టాడు.

**వరాహ నారసింహ దండకం** : సింహాచల శ్రీ వరాహ నరసింహస్వామి నుద్దేశించి మూలా పేరన్న శాస్త్రి ఈ దండకాన్ని రచించాడు ఇందులో దేవతలు హిరణ్యకశ్యపునివల్ల తమకు కలిగిన కష్టాలను గురించి విష్ణువుకు విన్నవించడం, ప్రహ్లాదుడు జన్మించడం, హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుని హింసించడం, విష్ణుమూర్తి నృసింహావతారంలో హిరణ్యకశ్యపుని సంహరించడం, ప్రహ్లాదుడు దేవాలయాదులను నిర్మించడం మొదలైన విషయాలే గాకుండా గోగులపాటి కూర్మనాథుడు పిండారి దాడులనుండి దేవాలయాన్ని, ప్రజలను కాపాడుమని నృసింహస్వామిని ప్రార్థించడం, కంచు తుమ్మెదలుద్భవించి పిండారి దండును పారద్రోలడం మొదలైన విషయాలు గూడా సూచింపబడ్డాయి

ఉదాహరణ : ఈ సభాస్తంభమందుండురా ! యంచు బ్రశ్నింపగా, సంతతా ప్రహ్లాదుడైనట్టి ప్రహ్లాదుడు రాక్షసాధీశ్వరా ! సత్యమీ స్తంభమందున్న వాడయ్యు దెల్పంగ నాలించి, వేటాంది గుప్పించు నాగంబు చందాన గ్రోధానల జ్వాలలుద్వృత్తి నల్దిక్కులన్ నిండగా గస్సుమంచున్ వడిన్ లేచి దిగ్దంతి తుండంబుతో సాటి యౌబాహు దండంబుచే స్తంభమున్ రెండుగా వ్రీలగా వేయగా భక్త రక్షాత్వరాయత్త చిత్తంబుతో నీవు తన్మధ్యమందుండి దైత్యాళి భీతాత్ములై చూడగా నబ్బురంబెన శ్రీ నారసింహాకృతిన్ బూని జేజేలు జేజేలు గావించనేతెంచి ......

**అష్టకాలు :** సింహాచల మాహాత్మ్యాన్ని వివరిస్తూ అయిదు అష్టకాలు రచింపబడ్డాయి. అవి 1. శ్రీ నృసింహాష్టకం, 2. శ్రీ నృసింహాష్టకం, 3. శ్రీశ్రీ నృసింహాష్టకం, 4. శ్రీ సింహశైల శ్రీ వరాహలక్ష్మీ నృసింహాష్టకం, 5. లక్ష్మీనృసింహాష్టకం. ఇందులో ఒకటవ, రెండవ, ఐదవ అష్టకాల రచయితల పేర్లు తెలియడం లేదు. మూడవ అష్టకమైన శ్రీశ్రీ నృసింహాష్టకాన్ని శ్రీ రామకవి, నాల్గవదైన శ్రీ సింహశైల శ్రీ వరహా లక్ష్మీనృసింహాష్టకాన్ని కందాళ పద్మనాభస్వామి రచించారు. పై అయిదు సంస్కృతంలో రచింపబడ్డాయి.

**శ్రీ నృసింహాష్టకం :** దీని కర్త ఎవరో తెలియదు. ఇందులో కవి విష్ణువును అనేక పేర్లతో స్తుతించాడు. ఈ అష్టకం 'నరసింహ నరసింహ' అనే మకుటంతో రచింపబడింది.

ఉదాహరణగా ఒక శ్లోకం :

**''శ్రీ మదకలజ్క పరిపూర్ణ శశికోటి శ్రీధర మనోహర పటాపటల కాన్త !**
**పాలయ కృపాలయ భవామ్బుధినిమగ్నం దైత్యవరకాల ! నరసింహ ! నరసింహ''**

(1)

**శ్రీ నృసింహాష్టకమ్** : దీని కర్త ఎవరో తెలియదు. ఇందులో గూడ కవి భగవంతుడైన నరసింహుని అనేక విధాలుగా స్తుతించాడు

ఉదాహరణగా ఒక శ్లోకం :

> ''ఇంద్రాది దేవ నికరస్య కిరీటకోటి
> ప్రత్యుప్తరత్న ప్రతిబింబిత పాదపద్మ
> కల్పాంతకాల ఘనగర్జన తుల్యనాద
> శ్రీ నారసింహ పరిపాలయమాంచభక్తమ్. (2)

**శ్రీశ్రీ నృసింహాష్టకమ్** : దీన్ని శ్రీరామకవి ''సింహశైల మందిరం నృసింహదేవ మాశ్రయే'' అనే మకుటంతో రచించాడు. ఇందులో గూడా నరసింహుని స్తుతి కనిపిస్తుంది.

ఉదాహరణగా ఒక శ్లోకం :

> ''శ్రీ రమాకుచాబ్జ కోశకుంకుమాంకితో రసం
> పావనాంఘ్రిసారసం సదాదయా సుధారసం
> కుందశుభ్ర శారదారవింద చంద్రసుందరం
> సింహశైల మందిరం నృసింహదేవ మాశ్రయే''

నృసింహుడు లక్ష్మీదేవి కుచాబ్జాల్లో పూసుకున్న కుంకుమ కలిగినవాడు, పవిత్రమైన పాదాలు గలవాడు, ఎల్లప్పుడు దయామృతాన్ని వర్షించేవాడు, స్వచ్ఛమైన తెల్లని కీర్తి కలవాడు, చంద్రునిలాంటి అందమైనవాడు అని కవి స్తుతించాడు.

**శ్రీ సింహశైల శ్రీ వరాహ లక్ష్మీనృసింహాష్టకం** : ఈ అష్టకాన్ని కందాళ పద్మనాభస్వామి ''వందే నృసింహ మరవింద దళాయతాక్షం'' అనే మకుటంతో రచించాడు ఇందులో గూడ నృసింహుని స్తుతి ప్రధానంగా ఉంది.

ఉదాహరణగా ఒక శ్లోకం

> ''ప్రహ్లాద ఖేద హరణాయ కృతావతారం
> సద్గంధ బంధుర దీప విలిప్తకాయం
> వైకుంఠ పాతన ధరాతల గుప్తపాదం
> వందే నృసింహ మరమింద దళాయతాక్షం''

నృసింహుడు ప్రహ్లాదుని దుఃఖాన్ని పోగొట్టడానికి అవతారం ధరించాడని, గంధంచేత పూయబడిన శరీరం కలవాడని, వైకుంఠం నుండి భూమివరకు వ్యాపించి [illegible] కలవాడని

కవిస్తుతించాడు.

**లక్ష్మీనృసింహాష్టకం :** దీని కర్త ఎవరో తెలియదు. ఇది ''వారాహనృహరి శ్రీమాన్ పాయన్మాం సర్వదా భువి'' అనే మకుటంతో రచింపబడింది.

ఉదాహరణగా ఒక శ్లోకం :

> **''చందనామృత సన్దేహ : కోటి సూర్యసమప్రభ :**
> **వారాహ నృహరి శ్రీమాన్ పాయన్మాం సర్వదాభువి''**

చందనంచేత కప్పబడినవాడు, కోటి సూర్యులతో సమానంగా వెలిగేవాడు అని కవి నృసింహుని కీర్తించాడు.

ఈ విధంగా సింహాచల క్షేత్రాన్ని గురించి, ఆ క్షేత్రదైవమైన వరాహ నృసింహస్వామిని గురించి శిష్ట కవులు వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారు.

# ఉపయుక్త గ్రంథ సూచిక



1. కాటమరాజు కథలు – మొదటి భాగం : తంగిరాల వేంకట సుబ్బారావు
2. జానపద విజ్ఞాన వ్యాసావళి : డా. జి.ఎస్. మోహన్
3. జానపద సాహిత్య స్వరూపం : ఆర్వీయస్. సుందరం
4. తెలుగులో జానపద గేయ గాథలు : ఆచార్య నాయని కృష్ణకుమారి
5. తెలుగు జానపద గేయ సాహిత్యం : బి. రామరాజు
6. శతక కవుల చరిత్రము : వంగూరి సుబ్బారావు
7. సింహాద్రి నారసింహ శతకం : గోగులపాటి కూర్మనాథ కవి

**అముద్రిత సిద్ధాంత వ్యాసాలు**

1. ఉత్తరాంధ్ర క్షేత్ర మాహాత్మ్య సాహిత్యం అనుశీలనం : సి. హెచ్. వరప్రసాద్
2. తెలుగులో స్థల పురాణములు–స్వభావ పరిశీలన : వి. జి. కృష్ణమాచార్యులు
3. బొబ్బిలి సంస్థాన చరిత్ర – సాహిత్య సేవ : బి. సరళ

**ఆంగ్ల గ్రంథం**

1. The Simhachalam Temple : Dr K. Sundaram



SPAA Offset © 547600